
తిరుమల శ్రీదేవి

విశాఖ ఉపాధ్యాయినికి జాతీయ అవార్డు

జిల్లాలోని భీమునిపట్నంలో గల పండిట్ నెహ్రూ జీవీఎంసీ మునిసిపల్ హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయురాలిగా (బయాలజీ టీచర్) పనిచేస్తున్న మాదాబత్తుల తిరుమల శ్రీదేవి జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయినిగా ఎంపికయ్యారు.

-వివరాలు మెయిన్ ఎడిషన్‌లో...

ఉక్కులో ఆర్‌ఎంహెచ్‌పీ అస్తవ్యస్తం

గందరగోళంగా మెటీరియల్ హ్యాండ్లింగ్

- విభాగాలకు దిగజారిన ముడిపదార్థాల సరఫరా
- తగ్గిపోతున్న స్టీల్ ఉత్పత్తి
- రా మెటీరియల్ హ్యాండ్లింగ్ ప్లాంటులో పనిచేసేందుకు నిపుణులు అంతా ముందుకు రావాలని యాజమాన్యం పిలుపు
- విభాగాధిపతులకు కూడా ఆదేశాలు


ఆర్‌ఎంహెచ్‌పీలో అస్తవ్యస్తంగా ఉన్న ట్రిప్లింగ్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం స్టీల్‌ప్లాంటు యాజమాన్యం 'అందితే జుట్టు...అందకపోతే కాళ్లు' పట్టుకునే చందంగా వ్యవహరిస్తోంది. బ్లాస్ట్ ఫర్నేస్-3ను హడావిడిగా ప్రారంభించవద్దని, ముందు సంబంధిత విభాగాలన్నింటిలో నిర్వహణ పనులు చేపట్టాలని ఉద్యోగ వర్గాలు నెత్తీనోరు కొట్టుకున్నాయి. అలా చేయని పక్షంలో ఉత్పత్తికి ఆటంకం కలుగుతుందని, ప్రమాదాలు జరుగుతాయని హెచ్చరించాయి. కానీ ఇన్‌చార్జి సీఎండీ సక్సేనా ఎవరి మాటలు పట్టించుకోకుండా జూన్ నెలాఖరున బ్లాస్ట్‌ఫర్నేస్-3ని ప్రారంభించారు. ప్లాంటులో రోజుకు 21 వేల టన్నుల హాట్ మెటల్ ఉత్పత్తి చేస్తామని ప్రకటించారు. అయితే గత రెండు వారాలుగా ఉత్పత్తి సగటున పది వేల టన్నులకు మించడం లేదు. ప్లాంటుకు అతి ముఖ్యమైన రా మెటీరియల్ హ్యాండ్లింగ్ ప్లాంటు (ఆర్‌ఎంహెచ్‌పీ)లో సమస్యలు తలెత్తడమే దీనికి ప్రధాన కారణం.

ఆర్‌ఎంహెచ్‌పీలో నైపుణ్యంతో పనిచేసే కాంట్రాక్టు కార్మికులను తొలగించి, వారి స్థానంలో తక్కువ కూలీకి వచ్చే ఇతర రాష్ట్రాల వారిని పెట్టారు. వారు కన్వేయర్ బెల్ట్‌ల నిర్వహణ, ర్యాకుల ట్రిప్లింగ్ పనులు చేయలేకపోతున్నారు. దాంతో వివిధ విభాగాలకు తగినంత ముడి పదార్థాలు సరఫరా కావడం లేదు. ఫలితంగా ఉత్పత్తి పడిపోయింది. ఇప్పుడు మేల్కొన్న యాజమాన్యం 'స్ట్రెంగ్తెన్ ఆర్‌ఎంహెచ్‌పీ-సపోర్ట్ వీఎస్‌పీ' అంటూ సోమవారం పిలుపునిచ్చింది. ఇది అత్యంత కష్టకాలం అని, ఆర్‌ఎంహెచ్‌పీని సమర్థంగా నడపాలని, 100శాతం ఉత్పత్తి తీయాలని ఉద్యోగ వర్గాలను కోరింది. ఆర్‌ఎంహెచ్‌పీకు వెళ్లి బాగా పనిచేయగల సామర్థ్యం కలిగిన ఉద్యోగులు, వర్కర్లు ఏ విభాగంలో ఉన్నా వెంటనే యుద్ధప్రాతిపదికన అక్కడకు తరలించాలని ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసింది. విభాగాధిపతులు అంతా నైపుణ్యం కలిగిన వారిని గుర్తించాలని, వారిని ఈ నెలఖారులోగా ఆర్‌ఎంహెచ్‌పీ జనరల్ షిఫ్ట్‌నకు పంపాలని ఆదేశించింది. అక్కడ ... మిగతా 6వ పేజీలో

వీఆర్‌ఎస్ ఉద్యోగులకు ఆర్‌ఎంహెచ్‌పీ డ్యూటీ

- నేటి నుంచి నెల రోజులు...
- ఆ తరువాత ఎవరితో చేయిస్తారంటున్న ఉద్యోగ సఘాలు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

స్టీల్ ప్లాంటు రా మెటీరియల్ హ్యాండ్లింగ్ ప్లాంటు(ఆర్‌ఎంహెచ్‌పీ)లో తలెత్తిన సంక్షోభాన్ని నివారించడానికి యాజమాన్యం 263 మంది అధికారులను ఆ విభాగానికి రోస్టర్ విధానంలో డిప్యుటేషన్ వేస్తూ సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీచేసింది. వీరంతా బ్లాస్ట్ ఫర్నేస్ సహా అనేక విభాగాల్లో పనిచేస్తున్నారు. మంగళవారం నుంచి వారంతా ఆర్‌ఎంహెచ్‌పీకి వెళ్లి 12 గంటలు డ్యూటీ ... మిగతా 6వ పేజీలో

ఏయూ రిజిస్ట్రార్ రాజీనామా!

- బాధ్యతల నుంచి తప్పుకున్న ప్రొఫెసర్ ఇఎన్ ధనుంజయరావు
- క్యాంపస్‌లో కలకలం
- వీసీతో దూరం పెరగడమే కారణం

విశాఖపట్నం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి):


ప్రొఫెసర్ ధనుంజయరావు

ఆంధ్ర విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఈఎన్ ధనుంజయరావు రాజీనామా చేశారు. తనను బాధ్యతల రిలీవ్ చేయాలని ఆయన సోమవారం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్‌ను కోరారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత ప్రొఫెసర్ ధనుంజయరావు రిజిస్ట్రార్‌గా నియమితులయ్యారు. అయితే, అనూహ్యంగా ఇప్పుడు తప్పుకోవడం చర్చనీయాంశంగా మారింది. రిజిస్ట్రార్‌గా ఏడాదిపాటు అందించిన సేవలు తనకు సంతృప్తిని కలిగించాయని, ఈ అవకాశం కల్పించినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి, ఏయూకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్టు ఆయన రాజీనామా లేఖలో పేర్కొన్నారు. రిజిస్ట్రార్ నిర్ణయం వర్సిటీలో కలకలం రేపింది. అందుకు గల కారణాలు ఏమై ఉంటాయా.? అన్న చర్చ జరుగుతోంది. అయితే, ఈ నిర్ణయం వెనుక బలమైన కారణాలు ఉన్నట్టు చెబుతున్నారు. గడిచిన కొన్నాళ్లుగా వీసీ, రిజిస్ట్రార్ మధ్య దూరం పెరిగిందని పలువురు పేర్కొంటున్నారు. ప్రధానంగా కొన్ని కీలక నిర్ణయాల్లో రిజిస్ట్రార్‌కు వీసీ భాగస్వామ్యం కల్పించడం లేదని చెబుతున్నారు. కొన్నాళ్ల కిందట డీన్లు, డైరెక్టర్లు, ఇతర పదవుల నియామకాన్ని వీసీ చేపట్టారు. అయితే, వారిని నియమించే క్రమంలో కనీసం రిజిస్ట్రార్‌గా ఉన్న ధనుంజయరావును వీసీ సంప్రతించలేదని తెలిసింది. అలాగే శతాబ్ది ఉత్సవాలకు గవర్నర్‌ను ఆహ్వానించేందుకు కూడా వీసీ ఒక్కరే వెళ్లిపోయారు. ఈ తరహా ఆహ్వానాలను అందించేప్పుడు సాధారణంగా వీసీ వెంట రిజిస్ట్రార్ ఉంటారు. వీటితోపాటు అనేక కీలక నిర్ణయాల్లోనూ ఇద్దరి మధ్య దూరం పెరిగిందని, అదే తాజా నిర్ణయానికి కారణంగా పేర్కొంటున్నారు. ఇదిలావుండగా రాజీనామాపై రిజిస్ట్రార్‌తో మాట్లాడేందుకు యత్నించగా ఆయన అందుబాటులో లేరు.

చెరువులనే రాసిచ్చేస్తారా!?

పద్మనాభం పూర్వ తహశీల్దార్, ప్రస్తుతం అల్లూరి జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ ఎంవీఎస్ లోకేశ్వరరావుపై ప్రభుత్వం సీరియస్


ఎంవీఎస్ లోకేశ్వరరావు

- క్రమశిక్షణ చర్యలకు రంగం సిద్ధం
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- పది రోజుల్లోగా లిఖిత పూర్వక వివరణ ఇవ్వాలని ఆదేశం
- రేవిడి, పొట్నూరు చెరువులను ప్రైవేటు వ్యక్తులకు ఇచ్చేసిన రెవెన్యూ అధికారి
- ఆ వ్యవహారాన్ని వెలుగులోకి తెచ్చిన 'ఆంధ్రజ్యోతి'

పద్మనాభం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి):

సాగునీటి చెరువులకు పట్టాదారు పాస్ పుస్తకాలు జారీచేసిన వ్యవహారంలో పద్మనాభం పూర్వ తహశీల్దార్, ప్రస్తుతం అల్లూరి సీతారామరాజు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ ఎంవీఎస్ లోకేశ్వరరావుపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవడానికి వీలుగా ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు రెవెన్యూ విజిలెన్స్ విభాగం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.జయలక్ష్మి ఉత్తర్వులు (జీఓ నంబరు 913) విడుదల చేశారు. ఈ జీఓ ద్వారా లోకేశ్వరరావుపై వచ్చిన రెండు అభియోగాలకు సంబంధించి ప్రభుత్వం చర్యలు తీసుకోవడానికి ఉపక్రమించింది.

1991 నాటి ఏపీ సివిల్ సర్వీసెస్ (సీసీఏ) నియమాలు రూల్ 20 కింద అవినీతి, దుష్ప్రవర్తన, అధికార దుర్వినియోగానికి పాల్పడడం తదితర ఆరోపణలపై చర్యలకు నిర్ణయించింది. ఉత్తర్వులు అందిన పది రోజుల్లోగా లోకేశ్వరరావు ప్రభుత్వానికి లిఖితపూర్వక వివరణ ఇవ్వాల్సి ఉంది. లేదంటే అతనిపై జరిపిన విచారణ నివేదికలోని ఆధారాల మేరకు క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీనికి అనుబంధంగా అనెగ్జరు-1/2లో అతనిపై మోపిన అభియోగాలను వివరించారు.

సాగునీటి చెరువులకు పట్టాదారు పాస్ పుస్తకాలు జారీచేసిన వైనంపై 2023 జనవరి 24న 'ఆంధ్రజ్యోతి' 'చెరువుకు టెండర్' శీర్షికన కథనం ప్రచురించింది. రేవిడి సర్వే నంబరు 73/2లోని 7.73 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న యాతవాని చెరువును కొందరికి అప్పటి తహసీల్దారు లోకేశ్వరరావు పట్టాదారు పాస్‌పుస్తకాలు జారీ చేశారు. దీనిపై జిల్లా కలెక్టర్ అప్పటి భీమిలి ఆర్డీవోను విచారణకు ఆదేశించారు. విచారణలో ఆంధ్రప్రదేశ్ ఇనాం రద్దు చట్టం 1956, 1975 ప్రకారం ప్రజా ప్రయోజనం, ... మిగతా 6వ పేజీలో



బంగాళాఖాతంలో ఆవరించిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో సోమవారం ఉదయం నుంచి అడపాదడపా నగరంలో జల్లులు పడ్డాయి. సాయంత్రం నుంచి మాత్రం ముసురు వాతావరణం నెలకొంది. ఒక మోస్తారుగా వర్షం కురుస్తూనే ఉంది. మంగళ, బుధవారాల్లో నగరంలో వర్షం కొనసాగుతుందని, అక్కడక్కడా భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ తెలిపింది.

-విశాఖపట్నం/ఆంధ్రజ్యోతి

నగరంపాలెంలో చెరువు కబ్జా!


- గతంలోనే కొంత మేర ఆక్రమణ
- కల్యాణ మండపం నిర్మిస్తామంటూ ఇప్పుడు పూర్తిగా పూడ్చివేస్తున్న వైనం
- చోద్యం చూస్తున్న యంత్రాంగం

విశాఖపట్నం/మధురవాడ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి):

మధురవాడ సమీపాన నగరంపాలెంలో ఉన్న చెరువును కబ్జా చేసేందుకు కొందరు యత్నిస్తున్నారు. కల్యాణ మండపం నిర్మిస్తామంటూ చెరువును పూడ్చేస్తున్నారు. నగరంపాలెంలో భూలోకమాత గుడి ఎదురుగా, 61,62 సచివాలయాలకు ఆనుకుని సర్వే నంబరు 65/10లో ప్రభుత్వానికి చెందిన చెరువు సుమారు 2.9 ఎకరాలు ఉంది. ఒకప్పుడు ఆ చెరువు కింద వ్యవసాయం చేసేవారు. అయితే వ్యవసాయ భూముల్లో కాలనీలు వచ్చేశాయి. దీంతో కొందరు కబ్జాదారులు చెరువులో నిర్మాణ వ్యర్థాలు డంపింగ్ చేసి సుమారు ఎకరా వరకూ ఆక్రమించుకున్నారు. అక్కడ గత ఏడాది బడ్డీలు ఏర్పాటుచేయగా కొందరు స్థానికుల ఫిర్యాదు మేరకు అధికారులు వాటిని తొలగించారు. జీవీఎంసీ, రెవెన్యూ అధికారులు చెరువు చుట్టూ ఫెన్సింగ్ వేసి హెచ్చరిక బోర్డు ఏర్పాటుచేస్తే కబ్జాదారులు ... మిగతా 6వ పేజీలో


నగరంపాలెంలోని చెరువు

28న డీఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన



- వేదిక... ఉక్కునగరంలోని విశాఖ విమల విద్యాలయం
- 1,139 పోస్టుల భర్తీకి అభ్యర్థుల ఎంపిక
- నేటి సాయంత్రంలోగా కాల్ లెటర్స్

విశాఖపట్నం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి):

డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు సంబంధించిన ధ్రువపత్రాల పరిశీలన ఈనెల 28వ తేదీ ఉదయం తొమ్మిది గంటలకు ఉక్కునగరంలోని విమల విద్యాలయంలో ప్రారంభం కానున్నది. ఇందుకోసం విమల విద్యాలయంలో 21 కౌంటర్లు ఏర్పాటుచేశారు. ప్రతి కౌంటర్‌లో ఎంఈవో, హెచ్‌ఎం, డిప్యూటీ తహశీల్దారుతో కూడిన బృందం ఉంటుంది. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు సోమవారం రాత్రి నుంచి కాల్‌లెటర్లు పంపించే ప్రక్రియ మొదలవుతుందని, మంగళవారం సాయంత్రంలోగా పూర్తవుతుందని విద్యా శాఖ వర్గాలు తెలిపాయి. కాల్‌లెటర్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని పేర్కొన్నాయి. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో వివిధ కేటగిలలో 1,139 పోస్టుల భర్తీకి అభ్యర్థులను ఎంపిక చేయనున్నారు. ప్రతి కేటగిరీలో ఏ ర్యాంకు వరకూ ఉద్యోగం వస్తోందనేది అభ్యర్థులకు మాత్రమే తెలిసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. జోన్-1లోని రెసిడెన్షియల్ స్కూళ్లు, మోడల్ స్కూళ్ల ప్రిన్సిపాళ్లు, పీజీటీ, టీజీటీ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఇదే ప్రాంగణంలో నిర్వహిస్తారు. అభ్యర్థులు తమ విద్యార్హతలకు చెందిన ఒరిజినల్ ధ్రువపత్రాలు, ఇటీవల జారీచేసిన కుల ధ్రువీకరణపత్రం (అవసరమైన వర్గాలకు), అంగవైకల్యం ఉంటే సంబంధిత సర్టిఫికెట్, కాల్ లెటర్‌లో పేర్కొన్న ఇతర ధ్రువీకరణ పత్రాలు, గజిటెడ్ అధికారి ధ్రువీకరించిన మూడుసెట్ల జెరాక్స్ కాపీలు, ఐదు పాస్‌పోర్టు సైజు ఫొటోలు తీసుకు వెళ్లాల్సి ఉంటుంది. కాగా ఉమ్మడి విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు విస్తృత ఏర్పాట్లు చేశామని విద్యా శాఖ ఆర్జేడీ విజయభాస్కర్ తెలిపారు. ఆయా కేంద్రాల్లో తాగునీరు, వైద్య సదుపాయం ఏర్పాటుచేశామన్నారు.

రౌడీషీటర్లపై డేగ కన్ను

- క్రియాశీలకంగా ఉన్నవారి ఇళ్లలో ఆకస్మిక సోదాలు
- వారి ప్రతి కదలికలపై ప్రత్యేక నిఘా
- వినాయక చవితి నేపథ్యంలో అప్రమత్తమైన సీపీ
- నగరంలో గొడవలు, కొట్లాటలు లేకుండా ముందస్తు చర్యలు



విశాఖపట్నం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి):


నగరంలో రౌడీషీటర్లపై పోలీసులు నిఘాను పటిష్ఠం చేశారు. ఎప్పటిలాగే వారి కదలికలపై కన్ను వేసి ఉంచడంతోపాటు క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న రౌడీషీటర్ల ఇళ్లలో ఆకస్మిక సోదాలు చేపట్టాలని సీపీ శంఖబ్రతబాగ్చి ఆదేశించారు. వినాయక చవితి ఉత్సవాల నేపథ్యంలో నగరంలో అల్లర్లు, వివాదాలకు ఆస్కారం లేకుండా ఆయన ముందస్తు చర్యలకు ఉపక్రమించారు.

నగర పరిధిలో సుమారు 650 మంది రౌడీషీటర్లు ఉన్నారు. వీరిలో సగం మంది క్రియాశీలకంగా ఉన్నట్టు పోలీసులు అంచనా వేస్తున్నారు. భూ వివాదాలు, సివిల్ సెటిల్‌మెంట్లలో తరచూ తలదూర్చుతున్నారు. కొన్నాళ్ల కిందట ఈస్ట్‌పాయింట్‌కాలనీలోని శాంతి ఆశ్రమం భూ వివాదంలో రెండు వర్గాలకు చెందినవారు రౌడీషీటర్లను ఆశ్రయించడంతో వివాదాస్పద స్థలంలో పట్టపగలే రాళ్ల దాడి చేసుకుని, కొట్టుకున్నారు. దీనిపై ఎంవీపీ పోలీసులు కేసు నమోదుచేసి ఇరువర్గాల్లోని రౌడీషీటర్లలో కొందరిని అరెస్టు చేసి, రిమాండుకు తరలించారు. అలాగే హార్బర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కోల్ హ్యాండ్లింగ్ కంపెనీకి చెందిన బొగ్గును దొంగచాటుగా తరలించారనే ఆరోపణపై ఒక డ్రైవర్‌ను కంపెనీ ప్రతినిధులు నిర్బంధించారు. ఒక రౌడీషీటర్‌తో అతడిని తీవ్రంగా కొట్టించడంతో ఆస్పత్రికి తరలించేలోగా ప్రాణాలు కోల్పోయాడు.

ముందస్తు చర్యలు

గత ఏడాది వినాయక నిమజ్జనం ఊరేగింపు సమయంలో సీతమ్మధారలో రెండు వర్గాలకు చెందిన రౌడీషీటర్లు కొట్లాటకు దిగడంతో ఓ రౌడీషీటర్ దారుణ హత్యకు గురయ్యాడు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది వినాయక చవితి మహోత్సవాల సందర్భంగా నగరంలో అల్లర్లు, ... మిగతా 6వ పేజీలో

నేడు కేంద్ర రక్షణ మంత్రి రాక



విశాఖపట్నం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి):

కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ మంగళవారం విశాఖపట్నం వస్తున్నారు. రెండు యుద్ధ నౌకలు ఐఎన్‌ఎస్ ఉదయగిరి, ఐఎన్‌ఎస్ హిమగిరిలను ఆయన జాతికి అంకితం చేస్తారు. ఉదయం పది గంటలకు ఢిల్లీలో బయలుదేరి 12.30 గంటలకు విశాఖపట్నం చేరుకుంటారు. అక్కడి నుంచి నేవీ గెస్ట్‌హౌస్ ఐఎన్‌ఎస్ చోళాకు వెళ్లి విశ్రాంతి తీసుకుంటారు. మధ్యాహ్నం మూడు గంటలకు సర్కార్స్‌లోని ఎన్1, ఎన్3 జెట్టీల వద్దకు వెళ్లి నౌకల కమిషనింగ్ కార్యక్రమంలో పాల్గొంటారు. సాయంత్రం ఐదు గంటలకు విమానాశ్రయానికి చేరుకొని ఢిల్లీకి వెళతారు.

బార్‌లకు స్పందన నిల్

- జిల్లాలో 121 బార్లు... ఇప్పటివరకూ 17 బార్లకు 51 దరఖాస్తులు
- నేటితో ముగియనున్న గడువు



విశాఖపట్నం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి):

జిల్లాలో బార్ అండ్ రెస్టారెంట్‌లకు వ్యాపారుల నుంచి స్పందన అంతంతమాత్రంగానే ఉంది. మొత్తం 121 బార్లకు దరఖాస్తులను ఆహ్వానిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీచేసిన విషయం తెలిసిందే. ఈనెల 26 వరకు ... మిగతా 6వ పేజీలో

విచక్షణ కోల్పోయిన జీవీఎంసీ అధికారి

- క్లాప్ వాహన డ్రైవర్‌పై చేయి చేసుకున్న భీమిలి జోనల్ కమిషనర్


సీఐటీయూ నాయకులు, క్లాప్ వాహన డ్రైవర్లతో మాట్లాడుతున్న జడ్సీ అయ్యప్పనాయుడు

భీమునిపట్నం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి):

విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే కారణంతో క్లాప్ (క్లీన్ ఆంధ్రప్రదేశ్) వాహన డ్రైవర్‌పై జీవీఎంసీ జోనల్ కమిషనర్ చేయి చేసుకోవడం వివాదాస్పదమైంది. మిగిలిన డ్రైవర్లంతా ఆందోళనకు దిగారు. చివరకు జోనల్ కమిషనర్ క్షమాపణ చెప్పడంతో ఆందోళనకారులు శాంతించారు. సోమవారం ఉదయం జరిగిన ఈ సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. జోన్-1 రెండో వార్డు పరిధిలోని ఆదర్శనగర్-2లో పారిశుధ్య పనులను పరిశీలించడానికి జడ్సీ అయ్యప్పనాయుడు వెళ్లారు. ఈ సందర్భంగా స్థానికులు క్లాప్ వాహన డ్రైవర్ ఇంటి శ్రీను సరిగ్గా పనిచేయడం లేదని ఫిర్యాదు చేశారు. దీంతో శ్రీనుపై జడ్సీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ దూషించడమే కాకుండా చేయి చేసుకున్నారు. ఈ విషయం జోన్‌లో ఉన్న క్లాప్ వాహన డ్రైవర్లందరికీ తెలియడంతో వారు జోనల్ కార్యాలయానికి చేరుకుని ఆందోళనకు దిగారు. విధి నిర్వహణలో ఉన్న డ్రైవర్‌ను దుర్భాషలాడి, చేయి చేసుకున్న జడ్సీపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఆందోళన సమాచారం అందుకున్న భీమిలి ఎస్ఐ గౌరి, సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. జోనల్ కమిషనర్‌తో సీఐటీయూ నాయకుడు మూర్తి, క్లాప్ వాహన డ్రైవర్లు చర్చలు జరిపారు. శ్రీను సరిగ్గా పని చేయడం లేదని స్థానికులతో పాటు ఆ ప్రాంత శానిటేషన్ కార్యదర్శి విజయలక్ష్మి చెప్పడంతో చేయి చేసుకోవాల్సి వచ్చిందని, ఏదిఏమైనా తప్పు జరిగిందని క్షమాపణ చెప్పారు. దీంతో క్లాప్ వాహన డ్రైవర్లు ఆందోళన విరమించారు.



బాలికలకు అవగాహన కల్పిస్తున్న ఆరిలోవ ఎస్‌ఐ రామదాస్

ఇబ్బందులు ఉంటే సమాచారం ఇవ్వండి

ఎండాడ హైస్కూల్ బాలికలకు పోలీసుల సూచన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఎండాడ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 8వ వార్డులోని ఎండాడ ప్రధాన గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆరిలోవ ఎస్‌ఐ రామదాస్‌తో పాటు శక్తి టీం పోలీసులు ఈవ్‌టీజింగ్‌పై అవగాహన కల్పించారు. 'ఎండాడలో ఆకతాయిలతో ఇబ్బందులు' అన్న శీర్షికన సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి వారు స్పందించారు. ఈమేరకు పాఠశాలలోని బాలికలకు ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. ఎవరైనా ఇబ్బందులకు గురిచేసినా.. భయపెట్టినా వెంటనే 112 నంబర్‌కి కాల్ చేయడంతో పాటు ఉపాధ్యాయులకు తెలియజేయాలని చెప్పారు. అలాగే పోలీసులకు కూడా సమాచారం ఇవ్వాలని సూచించారు. ఉపాధ్యాయుల మాట వినకుండా ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తే భవిష్యత్తు నాశనమవుతుందని హెచ్చరించారు. పాఠశాల సమీపంలోని దుకాణాల వద్ద ఆకతాయిలు తిష్ట వేస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని తెలిపారు.

అవంతి ఫార్మా కళాశాలకు స్వయం ప్రతిపత్తి



ఉత్తర్వుల కాపీలను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి ముత్తంశెట్టి

భీమునిపట్నం (రూరల్), ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని చిప్పాడ వద్ద ఉన్న అవంతి ఫార్మా కళాశాలకు పదేళ్ల పాటు స్వయం ప్రతిపత్తి హోదా కల్పిస్తూ యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ ఉత్తర్వులు జారీ చేసింది. ఉత్తర్వుల కాపీలను సోమవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థుల సమక్షంలో కళాశాల చైర్మన్, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 34 ఏళ్లుగా తెలుగు రాష్ట్రాల్లో 20కి పైగా బ్రాంచ్‌లతో అవంతి విద్యా సంస్థలు నడుస్తున్నాయని తెలిపారు. కళాశాలకు వివిధ ప్రాంతాల్లో ఉన్న 34 సంస్థలతో ఎంఓయూ కుదుర్చుకున్నామని, విద్యార్థులకు ప్లేస్‌మెంట్‌ల కోసం నిరంతరం కృషి చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. పూర్ణ నాగశ్రీ, వైస్ ప్రిన్సిపాల్ డా. వి.ఉమాశంకర్, హెచ్‌ఓడీలు డా. పావని, డా. మనోజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల రక్తదానం

భీమునిపట్నం (రూరల్), ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) :అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం నిర్వహించిన రక్తదాన శిబిరంలో విద్యార్థులు 300 యూనిట్లు రక్తం దానం చేశారు. ఈ శిబిరాన్ని బ్రహ్మకుమారీ సేవా పీఠానికి చెందిన శివలీల ప్రారంభించారు. కళాశాల చైర్మన్, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా శివలీల మాట్లాడుతూ యూనివర్సల్ బ్రదర్‌హుడ్ దినోత్సవం సందర్భంగా యోగిని దాది ప్రకాశ్ మణి ఆదేశాల మేరకు ఎన్‌టీఆర్ బ్లడ్ బ్యాంకు సౌజన్యంతో ఈ శిబిరం నిర్వహించామన్నారు. అనంతరం దాతలకు ముత్తంశెట్టి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈకార్యక్రమంలో ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డా.చంద్రశేఖర్, ప్రొఫెసర్ డా. షరీఫ్, హెచ్‌ఓడీ కోలా చంద్రశేఖర్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీపురంలో 54 మంది విద్యార్థుల దత్తత



పాఠశాలలో జరిగిన తల్లిదండ్రుల సమావేశం

భీమునిపట్నం (రూరల్), ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లక్ష్మీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 54 మంది పదో తరగతి విద్యార్థులను 14 మంది ఉపాధ్యాయులు దత్తత తీసుకున్నారు. పరీక్షలకు ఇంకా ఎనిమిది నెలలు ఉండడంతో సోమవారం తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటు చేశారు. పదో తరగతి చదువుతున్న 54 మంది విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించేందుకు వీలుగా దత్తత కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం దంతంశెట్టి సత్యారావు మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిరోజూ ఉదయం 5 నుంచి 7 వరకు సాయంత్రం 6 నుంచి రాత్రి 10 వరకు చదవాలని, దీన్ని దత్తత తీసుకున్న ఉపాధ్యాయులు పర్యవేక్షణ చేస్తారన్నారు.

గీతంలో పికిల్ బాల్ కోర్డు ప్రారంభం

సాగర్‌నగర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన పికిల్ బాల్ కోర్టు సముదాయాన్ని గీతం అధ్యక్షుడు, ఎంపీ శ్రీభరత్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. దీని వల్ల ఒత్తిడిని దూరం చేసుకోవచ్చునని చెప్పారు. క్రీడాకారులను ప్రోత్సహించడానికి వర్సిటీలో స్పోర్ట్స్ కోటా కింద ప్రత్యేక ప్రవేశాలు కల్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గీతం విద్యార్థి విభాగం అసిస్టెంట్ డీన్ అరుణ్ కార్తీక్, స్పోర్ట్స్ విభాగం అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక పింఛన్‌దారుల ధర్నా

తగరపువలస, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : చిట్టివలస కార్మిక పింఛన్‌దారులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రాంబాబు, బాబాజీ మాట్లాడుతూ కార్మికుల పింఛన్‌ను కనీసం రూ. 8 వేలుకు పెంచాలని, పింఛన్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

గాయత్రినగర్‌లో బోరు ఏర్పాటు

కొమ్మాది, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : గాయత్రినగర్‌లో ఏర్పాటు చేసిన బోరును ఆరో వార్డు టీడీపీ నాయకులు సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో యువ నాయకుడు గరే గురునాథ్, రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి శ్రీనివాస్, జనసేన వార్డు అధ్యక్షుడు సంతోష్‌నాయుడు, యార్లగడ్డ జీవన్‌కుమార్, రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు గొల్లంగి ఆనందబాబు, నాగోతి వెంకట్రావు, భరత్, పాల్గొన్నారు.

రేపటి నుంచి బనారస్ ఎక్స్‌ప్రెస్ తాత్కాలిక రద్దు

విశాఖపట్నం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఆగ్నేయ రైల్వే జోన్ పరిధిలో నాన్ ఇంటర్ లాకింగ్ పనులు చేపడుతున్న నేపథ్యంలో విశాఖ- బనారస్ మధ్య నడుస్తున్న ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఈనెల 27 నుంచి తాత్కాలికంగా రద్దు చేశామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. 27, 31, సెప్టెంబరు 9, 10 తేదీల్లో విశాఖ-బనారస్ ఎక్స్‌ప్రెస్ (18523), తిరుగు ప్రయాణంలో బనారస్-విశాఖ ఎక్స్‌ప్రెస్ (18524) ఈ నెల 28, సెప్టెంబరు 1, 8, 11 తేదీల్లో రద్దు చేశామన్నారు.



జేవీ అగ్రహారంలో కార్డులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గంటా



లింగన్నపేటలో కార్డులు ఇస్తున్న ఏఎంసీ వైస్ చైర్మన్ జగన్నాథం

ప్రజలు మెచ్చేలా కూటమి పాలన

» ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు
» జేవీ అగ్రహారంలో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ

భీమునిపట్నం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక పరిజ్ఞానంతో ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందుతాయని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. సోమవారం ఆయన 4వ వార్డు జేవీ అగ్రహారంలో స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా పంపిణీ వ్యవస్థకి సాంకేతికతను అనుసంధానం చేయడం వల్ల మెరుగైన ఫలితాలు లభిస్తాయన్నారు.కార్డులో క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే మొత్తం రేషన్ వివరాలన్నీ తెలుస్తాయని, దీనివల్ల అక్రమాలు జరిగే అవకాశం ఉందని చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వం ఇంటింటికి రేషన్ పేరుతో కోట్లాది రూపాయల ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేసిందని విమర్శించారు. జేవీ అగ్రహారంలో కిడ్నీ బాధితుల సంఖ్య పెరగడానికి గల కారణాలను అన్వేషించాల్సి ఉందన్నారు. కిడ్నీ సమస్యలకు తాగునీరు కారణం కాదన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సంగీత్ మాథూర్, జడ్పీ అయ్యప్పనాయుడు, తహసీల్దార్ రామారావు, వార్డు టీడీపీ అధ్యక్షుడు పాసి నరసింగరావు, కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు పంచకర్ల సందీప్, ఏఎంసీ చైర్మన్ కురుమిన రామస్వామినాయుడు, నాయకులు గంటా నూకరాజు, గొలగాని నరేంద్రకుమార్, డీఏఎన్ రాజు, గాడు అప్పలనాయుడు, తదితరులు త్రినాథ్ కుమార్ పాల్గొన్నారు.

8, 9వ వార్డుల్లో...

ఎండాడ, విశాలాక్షినగర్ : జీవీఎంసీ 8వ వార్డులోని గొల్లల ఎండాడలో కార్పొరేటర్ లొడగల అప్పారావు లబ్ధిదారులకు స్మార్ట్ కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సారిపిల్లి శ్రీనివాస్, చెట్టుపల్లి సన్యాసిరావు, అప్పలస్వామి సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే జనసేన పార్టీ 8వ వార్డు అధ్యక్షుడు శాఖరీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో రాజీవ్‌నగర్‌లో స్మార్ట్ కార్డులు పంపిణీ చేశారు. 9వ వార్డులోని జోడుగుళ్లపాలెంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ఉమ్మడి సుజాత, వార్డు టీడీపీ అధ్యక్షుడు అక్కరబోయిన రాంబాబు లబ్ధిదారులకు కార్డులు అందజేశారు.

కృష్ణంరాజుపేటలో...

భీమునిపట్నం (రూరల్) : కృష్ణంరాజుపేటలో జడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు స్మార్ట్ కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సింగనబంద సర్పంచ్ నారాయణ, అయ్యప్ప ధర్మ ప్రచార సభ జాతీయ కార్యదర్శి తాతినాయుడు, వీఆర్‌ఓ శ్యామ్ పాల్గొన్నారు.

నగరపాలెంలో..

తగరపువలస : తగరపువలస సమీపంలో ఉన్న నగరపాలెంలో సర్పంచ్ చాయా గౌతమి స్మార్ట్ కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ అప్పారావు డీలర్ శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యురాలు పల్ల నీలిమ, నీటి సంఘం డైరెక్టర్ తమ్మిన వెంకటరమణ. ఇదిపల్లి నానాజీ, శివ ప్రకాశ్, మంగరాజు పాల్గొన్నారు.

సింహాచలంలో...

సింహాచలం : రేషన్ సరకులు మరింత సులభంగా పంపిణీ చేయడానికే ప్రభుత్వం స్మార్టు కార్డులు అందజేస్తుందని 98వ వార్డు కార్పొరేటర్ పివి నరసింహం అన్నారు. ఆయన పోస్టాఫీసు వీధిలోని రేషన్ డిపోలో లబ్ధిదారులకు కార్డులు పంపిణీ చేశారు.నూతన కార్డుపై కుటుంబ యజమాని ఫొటో మాత్రమే ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో 98వ వార్డు తెలుగు యువత అధ్యక్షుడు గుసిడి అవినాష్ బాబు, బీఎల్‌ఓ మజ్జి చంద్ర శ్రీనివాసరావు, డీలర్లు రమణి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కొమ్మాదిలో...

కొమ్మాది : స్మార్ట్ కార్డుల వల్ల అక్రమాలను అరికట్టవచ్చునని 5వ వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత అన్నారు. వార్డులోని లబ్ధిదారులకు ఆమె కార్డులు పంపిణీ చేశారు. స్మార్ట్ కార్డుల వల్ల ప్రభుత్వ సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు మరింత సులభంగా అందుతాయని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి మొల్లి లక్ష్మణరావు, డీలర్ అనేష్ కుమార్, వీఆర్‌ఓ దిలీప్ పాల్గొన్నారు. అలాగే పీఎంపాలెం కాలనీలో టీడీపీ విశాఖ పార్లమెంట్ తెలుగు యువత నాయకుడు గరే గురునాథ్ కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు గొల్లంగి ఆనందబాబు,పోలిశెట్టి నాగేశ్వరరావు, లోడగల జానకీరామ్, మన్యాల సోంబాబు,నాగోతి వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభంలో..

పద్మనాభం : మండలంలోని పలు గ్రామాల్లో స్మార్ట్ రేషన్ కార్డులను రెవెన్యూ అధికారులు పంపిణీ చేశారు. మండలంలో 16569 మంది కార్డుదారులకు ఈ కార్డులను అందిస్తున్నారు. ఈనెల 30వ తేదీలోగా లబ్ధిదారులకు వీటిని అందజేయాలని ఆర్డీఓ సంగీత్ మాథూర్ ఆదేశించారు. ఈమేరకు సోమవారం అయినాడ, బీఆర్‌తాళ్లవలస, మద్దిలో కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు చంద్రశేఖర్, ఏపీ తూర్పుకాపు కార్పొరేషన్ డైరెక్టరు కె. లీలావతి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కె. దామోదరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు కె. రమణ, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు నగేష్‌కుమార్, మద్ది, లింగన్నపేట సర్పంచులు సన్యాసమ్మ సూర్యనారాయణ, భీమిలి మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ పిన్నింటి జగన్నాథం, డైరెక్టరు రమణ పాల్గొన్నారు.



కల్యాణం చేస్తున్న అర్చకులు

కమనీయం..

అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి ఆర్జిత నిత్య కల్యాణం సోమ వారం కమనీయంగా సాగింది. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులను శోభాయమానంగా తీర్చిదిద్ది వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించిన అనంతరం స్వామివారి కల్యాణ క్రతువు జరిపారు.

బార్‌లకు స్పందన నిల్

... 5వ పేజీ తరువాయి

గడువు ఇచ్చింది. అయితే జిల్లాలో ఇప్పటి వరకు 17 బార్లకు 51 దరఖాస్తులు మాత్రమే రావడంతో అధికారులు అవాక్కయ్యారు. మంగళవారంతో గడువు ముగియనుంది. చివరి రోజు భారీగా దరఖాస్తులు వస్తాయనే ఆశాబావంతో ఉన్నారు. బార్‌ల నిర్వహణ లాభసాటిగా లేకపోవడంతో వ్యాపారులు ఆసక్తి చూపడం లేదని అధికారులు చెబుతున్నారు. బార్‌లకు లైసెన్స్ ఫీజు గతంతో పోల్చితే తగ్గించినప్పటికీ మద్యం దుకాణాల కంటే తక్కువ మార్జిన్ ఇస్తుండడం, నిర్వహణ ఖర్చులు తడిసిమోపెడవుతుండడంతో చాలా మంది బార్‌లను వదులుకునేందుకు సిద్ధపడుతున్నారని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

క్వాంటం కంప్యూటింగ్‌దే భవిష్యత్తు



సదస్సులో మాట్లాడుతున్న ఆచార్య మూర్తి

సాగర్‌నగర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : కంప్యూటర్ రంగంలో భవిష్యత్‌ను శాసించేది క్వాంటమ్ కంప్యూటింగ్ అని గాయత్రి విద్యా పరిషత్ ప్రిన్సిపాల్ ఆచార్య కేఎస్ బోస్, సీఎస్‌ఈ విభాగాధిపతి ఆచార్య జీఆర్‌ఎస్ మూర్తి అన్నారు. రుషికొండ గాయత్రి విద్యా పరిషత్ డిగ్రీ అండ్ పీజీ కోర్సుల కళాశాల సీఎస్‌ఈ విభాగం ఆధ్వర్యంలో ఏఐసీటీఈ సహకారంతో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎఫ్‌డీపీ)ను సోమవారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బోధనా సిబ్బంది క్వాంటమ్ కంప్యూటింగ్‌లో సాంకేతిక నైపుణ్యాన్ని మరింతగా పెంచుకోవడం వల్ల సమాజానికి ప్రతిభావంతులైన విద్యార్థులను అందించడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్‌సీహెచ్‌ఈ ప్రిన్సిపాల్ డాక్టర్ పి. అనిల్‌కుమార్, డైరెక్టర్ ఆచార్య పీవీ వినయ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్‌ఎస్‌కు ఏడు వినతులు

భీమునిపట్నం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఏడు వినతులు అందాయి. జడ్పీ అయ్యప్పనాయుడు ఆధ్వర్యంలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ ఈ కార్యక్రమం జరిగింది. రెవెన్యూ, ఇంజనీరింగ్, యూసీడీ విభాగాలకు ఒక్కొక్కటి చొప్పున, పట్టణ ప్రణాళికా విభాగానికి నాలుగు అర్జీలు అందాయని, వాటిని ఆయా శాఖాధిపతులకు పంపించామని అధికారులు చెప్పారు. కాగా పట్టణంలో నిరుపయోగంగా ఉన్న మునిసిపల్ మహాత్మాగాంధీ కల్యాణ మండపాన్ని వినియోగంలోకి తీసుకురావాలని వినియోగదారుల సంక్షేమ సంఘం సభ్యులు కోరారు. ఈమేరకు వారు అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కేఎస్ నాయుడు, పీఆర్‌పీ వర్మ, తదితరులు పాల్గొన్నారు.

సాగుదారుల గుర్తింపునకు సర్వే



రైతులు సాగు చేసిన భూములను సర్వే చేస్తున్న అధికారులు

పద్మనాభం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కృష్ణాపురంలో ఎంఎస్‌ఎంఈ పార్కు కోసం కేటాయించిన భూముల్లో సాగుదారులను గుర్తించడానికి రెవెన్యూ అధికారులు సోమవారం సర్వే చేపట్టారు. ఎన్నో ఏళ్ల నుంచి సాగు చేసుకొని జీడి, నీలగిరి, టేకు వంటి మొక్కలు పెంచుకుని జీవిస్తున్న తమ భూములను అధికారులు ఎంఎస్‌ఎంఈ పార్కునకు తీసుకోవడంతో రైతులు ఆరు రోజులుగా నిరసన చేపట్టారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానిక రెవెన్యూ అధికారులు ఈ భూములను సాగు చేస్తున్న రైతులను గుర్తించడానికి సర్వే చేపట్టారు. కార్యక్రమంలో ఆర్‌ఐ శ్యామల, మండల సర్వేయర్ రామకృష్ణ, వీఆర్వో పార్థసారధి, తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ

ఎండాడ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : వినాయక చవితి నాడు ప్రతిఒక్కరూ మట్టి ప్రతిమలను పూజించి, పర్యావరణాన్ని కాపాడాలని జనసేన పార్టీ 8వ వార్డు అధ్యక్షుడు శాఖరీ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. సోమవారం ఆయన ఎండాడలోని పార్టీ కార్యాలయంలో స్థానికులకు మట్టి వినాయక ప్రతిమలతో పాటు పూజా పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జన సైనికులు, వీర మహిళలు పాల్గొన్నారు.

మధురవాడ : పర్యావరణ హితమైన మట్టి ప్రతిమలతో గణేశ్ ఉత్సవాలు జరుపుకోవడం ఉత్తమమని ఏడో వార్డు కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ అన్నారు. వార్డు పరిధిలోని ఆయుష్ ఆసుపత్రి యాజమాన్యం ఆధ్వర్యంలో మిథిలాపురి వుడాకాలనీలో ఆమె స్థానికులకు మట్టి వినాయక ప్రతిమలను అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ ఆసుపత్రి యాజమాన్య ప్రతినిధులు, టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి పిళ్లా వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.



ప్రతిమలను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ మంగమ్మ



ప్రతిమలను తయారు చేస్తున్న గీతం విద్యార్థినులు

కొమ్మాది : పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయక ప్రతిమలను పూజించాలని పీఎంపాలెం సీఐ బాలకృష్ణ, జోన్-1 కమిషనర్ కనక మహాలక్ష్మి అన్నారు. సోమవారం వారు శిల్పారామం వద్ద సామాజిక కార్యకర్త రమణ ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. అలాగే ఏపీడబ్ల్యూజే ఆధ్వర్యంలో కొమ్మాది జంక్షన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలోనూ మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు.

సాగర్‌నగర్ : గీతం డీమ్డ్ యూనివర్సిటీలో పలు విభాగాల విద్యార్థులు సోమవారం మట్టి వినాయక ప్రతిమ లను పంపిణీ చేశారు. ఏటా వర్సిటీ సైన్స్ ఏక్టివిటీ సెంటర్ (గుసాక్) ఆధ్వర్యంలో ఎకోఫ్రెండ్లీ వినాయకులను తయారు చేసి సిబ్బందికి పంపిణీ చేస్తుంటారు. ఈసారి కూడా ప్రతిమలను తయారు చేసి, పంపిణీ చేయనున్నారు.

నేడు టీడీపీ పార్లమెంటరీ కమిటీపై అభిప్రాయ సేకరణ

విశాఖపట్నం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): టీడీపీ విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గం కమిటీ నియామకంపై మంగళవారం అభిప్రాయసేకరణ చేపట్టనున్నారు. అధిష్ఠానం నియమించిన ముగ్గురు సభ్యులు నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, కుడిపూడి సత్తిబాబు పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించనున్నారు. కొత్త కమిటీ ఎంపికకు అభిప్రాయ సేకరణ నేపథ్యంలో ఎమ్మెల్యేలతో మంగళవారం ఎంపీ శ్రీభరత్ తొలుత చర్చించనున్నారు. తరువాత ఏడు నియోజకవర్గ నాయకులు, ముఖ్య నేతల నుంచి ముగ్గురు సభ్యులు అభిప్రాయాలు తీసుకుని అధినేతకు నివేదిక అందిస్తారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ సీఎం రమేశ్

డబుల్ ఇంజన్ సర్కార్‌తో అభివృద్ధి

పెందుర్తి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : డబుల్ ఇంజన్ సర్కార్‌తో రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతోందని అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ అన్నారు. టీడీపీ ఇన్‌చార్జి గండి బాబ్జీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన స్త్రీశక్తి పథకం విజయోత్సవ ర్యాలీలో ఆయన మాట్లాడుతూ మోదీ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ద్వయంతో ఆంధ్రప్రదేశ్ సుభిక్షంగా ఉందన్నారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పిస్తున్న బిల్లుకు ఎన్‌డీఏ సర్కార్ చట్టబద్ధత కల్పించిందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం విప్లవాత్మకమైన నిర్ణయమని పేర్కొన్నారు. ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ స్త్రీశక్తి పథకం ద్వారా మహిళలకు ఆర్థిక భరోసా, భద్రత కల్పించామన్నారు. రాష్ట్రంలో ఉన్న మహిళలు, పురుషులు పనిచేస్తేనే ఆర్థికాభివృద్ధి సాధించవచ్చన్నారు.

ఉక్కులో ఆర్‌ఎంహెచ్‌పీ అస్తవ్యస్తం

... 5వ పేజీ తరువాయి

పనిచేసే వారికి వ్యక్తిగత భద్రతా పరికరాలు (పీపీఈలు) ఇవ్వాలని, ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది.

అక్కడ ఏమి జరుగుతున్నదంటే...?

ఆర్‌ఎంహెచ్‌పీకి గూడ్సు రైళ్ల (ర్యాక్‌లు) ద్వారా ఐరన్‌ఓర్, బొగ్గు, లైమ్ స్టోన్ వంటివి వస్తాయి. వాటిని 'ట్రిప్లింగ్' విధానంలో అన్‌లోడింగ్ చేయాలి. వచ్చిన ర్యాక్‌లను ఎనిమిది గంటల్లో ఖాళీ చేసి వెనక్కి పంపాలి. అంతకు మించి ర్యాక్‌లు ఉండిపోతే వాటికి రైల్వే డెమరేజ్ చార్జీలు వసూలు చేస్తుంది. కొత్తగా వచ్చిన కాంట్రాక్ట్ వర్కర్లు ట్రిప్లింగ్ చేయలేకపోతున్నారు. దాంతో వ్యాగన్ల నుంచి సరుకును మాన్యువల్‌గా అన్‌లోడింగ్ చేస్తున్నారు. మనుషులతో అన్‌లోడింగ్ చేయించడం వల్ల ఒక్కో ర్యాక్ 30 నుంచి 40 గంటలు అక్కడే ఉండిపోతోంది. దాంతో రైల్వేకు డెమరేజ్ కింద నెలకు రూ.15 కోట్లు వరకు కడుతున్నారు. అంటే సరకును దించడానికి నెలకు అదనంగా రూ.కోట్లు వెచ్చిస్తున్నారు. ఇంత చేసినా ముడిపదార్థాలు ఆయా విభాగాలకు అందడం లేదు. కన్వేయర్ల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ఆ పనులు కూడా వారు చేయలేకపోతున్నారు. ఎస్‌ఎంఎస్ విభాగానికి లైమ్ స్టోన్ సరఫరా ఆగిపోయిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఆ పనులు కూడా చేయడానికి నైపుణ్యం కలిగిన సిబ్బందిని పంపాలని సీఎండీ ఆదేశించారు. చక్కగా పనిచేస్తున్న వారిని అడ్డగోలుగా తొలగించారు. ఇప్పుడు ఉత్పత్తి సాధించలేక చతికిల పడ్డారు. యుద్ధ ప్రాతిపదికన తరలించే ఉద్యోగులను ఎన్నాళ్లు అక్కడ డిప్యుటేషన్‌పై పనిచేయిస్తారు. ఇంకెంత కాలం 12 గంటలు డ్యూటీ చేయిస్తారో యాజమాన్యం ఇప్పుడైనా స్పష్టత ఇవ్వాల్సి ఉంది. దీనిపై స్థానిక ప్రజా ప్రతినిధులు కూడా సీఎండీని ప్రశ్నించాల్సిన అవసరం ఉంది.

చెరువులనే రాసిచ్చేస్తారా!?

... 5వ పేజీ తరువాయి

సామూహిక ఆస్తిగా ఉన్న చెరువునకు తహశీల్దారు నిబంధనలను అతిక్రమించి ఖాతా నెంబరు 1249 ద్వారా 5.30 ఎకరాల విస్తీర్ణానికి పోలిశెట్టి శ్రీనివాస్‌కు అనుకూలంగా పట్టాదారు పాస్‌పుస్తకం జారీ చేశారని నివేదికలో పేర్కొన్నారు. ఎఫ్‌ఎంబీ రికార్డుల ప్రకారం వంద సంవత్సరాల నుంచి ఈ చెరువు సాగుభూములకు నీటిని అందిస్తోందని, 20 ఏళ్లుగా ఉపాధి హామీ పథకం నిధులతో చెరువు అభివృద్ధి పనులు చేపడుతున్నట్టు విచారణలో తేలింది. అలాగే పొట్నూరు గ్రామంలోని సర్వే నంబరు 107లో ఉన్న సాగునీటి చెరువుకు ఖాతా నంబరు 5698 ద్వారా 10 ఎకరాల విస్తీర్ణానికి మంచుకొండ వెంకట జగన్నాథం అనే వ్యక్తికి పట్టాదారు పాస్‌పుస్తకం జారీ చేశారు. ఇక్కడ కూడా తహశీల్దారు ఇనాం రద్దు చట్టం-1964ను పరిగణనలోకి తీసుకోలేదు. దీంతో కలెక్టర్ తదుపరి చర్యల నిమిత్తం ప్రభుత్వానికి నివేదిక పంపించారు. ఇందులో లోకేశ్వరరావు తన అధికారాలను దుర్వినియోగం చేశారని, చట్టబద్ధమైన విధులు నిర్వర్తించడంలో విఫలమయ్యారని, ప్రజా సేవకుడికి తగని విధంగా, ప్రతిష్ఠకు భంగం కలిగించే విధంగా వ్యవహరించారని, ఏపీ పౌర సేవల (ప్రవర్తన) నియమావళిని ఉల్లంఘించారని గుర్తించారు. లోకేశ్వరరావు ఇచ్చే లిఖితపూర్వక వివరణ మేరకు క్రమశిక్షణ చర్యలు తీసుకోవడానికి ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది.

రౌడీషీటర్లపై డేగ కన్ను

... 5వ పేజీ తరువాయి

కొట్లాటలు జరిగే అవకాశాలున్నట్టు భావించిన సీపీ అప్రమత్తమయ్యారు. క్రియాశీలకంగా ఉన్న రౌడీషీటర్లను గుర్తించి, వారిపై నిఘా పెంచాలని సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులకు సూచించారు. ప్రతి స్టేషన్ పరిధిలోనూ యాక్టివ్‌గా ఉండే రౌడీషీటర్ల జాబితా సిద్ధం చేసుకుని, వారి ఇళ్లలో ఆకస్మిక సోదాలు చేపట్టాలని ఆదేశించారు. ఈ మేరకు ఇటీవల భీమిలి పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్ల ఇళ్లలో పోలీసులు సోదాలు చేయగా ఒక రౌడీషీటర్ ఇంట్లో రెండు కత్తులు లభ్యమయ్యాయి. దీంతో అతడిని అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. వినాయక చవితి ఉత్సవాలు ముగిసేవరకు రౌడీషీటర్లపై ప్రత్యేక దృష్టిపెట్టాలని, దీనివల్ల శాంతిభద్రతల సమస్య తలెత్తదని సీపీ ఆదేశించినట్టు తెలిసింది. పోలీసుల తాజా వ్యూహంతో నగరంలో యాక్టివ్‌గా ఉండే రౌడీషీటర్లలో గుబులు మొదలైంది.

నగరంపాలెంలో చెరువు కబ్జా!

... 5వ పేజీ తరువాయి

కొంత వరకూ ఆగేవారు. కానీ చెరువు ఎందుకు పనికిరాదని అధికారులు భావించారేమో దాని రక్షణకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. దీంతో కూటమి పార్టీలకు చెందిన నేతల అండదండలతో కబ్జాదారులు చెరువులో కల్యాణ మండపం నిర్మిస్తామని కొత్త ప్రతిపాదన తీసుకువచ్చారు. చెరువులో కల్యాణ మండపం నిర్మాణానికి అనుమతులు ఎలా ఇస్తారు?...అన్నది పట్టించుకోకుండా ఇటీవల రాత్రిపూట చెరువును పూర్తిగా పూడ్చే పనిచేస్తున్నారు. ఇప్పటికే మధురవాడ ప్రాంతంలో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. వర్షాకాలంలోనే బోర్లు ఎండిపోతున్నాయి. భూగర్భ జలాలు పెంచేందుకు దోహదం చేసే చెరువులు కబ్జాకు గురవుతున్నా అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పట్టించుకోకపోవడం గమనార్హం. దీనిపై మధురవాడ రెవెళ్లపాలేనికి చెందిన సంతోష్‌కుమార్ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి చెరువును కాపాడాలని కోరారు.

వీఆర్‌ఎస్ ఉద్యోగులకు ఆర్‌ఎంహెచ్‌పీ డ్యూటీ

... 5వ పేజీ తరువాయి

చేయాలి. వీరిలో 90 శాతం మందికి రెండు రోజుల క్రితం వీఆర్‌ఎస్ ఆమోదించారు. ఈ నోటీసులు ఇచ్చిన నెల రోజుల్లో వారికి సెటిల్‌మెంట్ చేసి ఇంటికి పంపించాల్సి ఉంది. ఇప్పుడు ఆర్‌ఎంహెచ్‌పీ డ్యూటీ వేయడం వల్ల వారికి సెలవు కూడా దొరకని పరిస్థితి ఏర్పడింది. వీరంతా నెల రోజుల తరువాత వెళ్లిపోతారని, అప్పుడు ఎవరితో పనిచేయిస్తారని ఉద్యోగ వర్గాలు ప్రశ్నిస్తున్నాయి. సిబ్బంది ఎక్కువ ఉన్నారని వందల సంఖ్యలో తొలగించడం, సమస్య వచ్చిందని కింద మీద పడడం ఏ రకమైన యాజమాన్య విధానమని కార్మికులు నిలదీస్తున్నారు.



రోగిని పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

వాకర్స్‌కు వైద్య పరీక్షలు

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఎంవీపీ కాలనీలోని అళ్వార్‌దాస్ మైదానంలో రోజూ వచ్చే నడకదారులకు సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో వాకర్స్‌కు ఉచిత బీపీ, బ్లడ్ షుగర్ పరీక్షలు నిర్వహించారు. వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పర్యవేక్షించారు.

నాయీ బ్రాహ్మణుల వినతి

ఆరిలోవ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): సెలూన్లపై ఆధారపడి జీవనం సాగిస్తున్న నాయీ బ్రాహ్మణులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను అందిస్తూ ప్రభుత్వం జీవీఓ విడుదల చేయాలని జిల్లా భారతీయ జనతా పార్టీ వైద్యవిభాగం ప్రతినిధి కె. వెంకటేశ్వరావు బృందం సోమవారం కలెక్టరును కలిసి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణుల సంక్షేమ డైరెక్టర్ కోట నరేశ్, మల్లువలస శ్రీను, చిగురువలస పోలారావు, తదితరులు పాల్గొన్నారు.

టెన్నీకాయిట్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

ఆరిలోవ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణాపురంలోని అంబేడ్కర్ గురుకులం విద్యార్థులు నలుగురు రాష్ట్ర స్థాయి టెన్నీకాయిట్ పోటలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రత్నవల్లి తెలిపారు. విశాఖ జిల్లా టెన్నీకాయిట్ అసోసియేషన్ జిల్లా బృందాలను ఎంపిక చేశారు. వీరు సెప్టెంబరు మొదటివారంలో కోనసీమ జిల్లాలో జరగనున్న పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. పదో తరగతి, ఇంటర్ విద్యార్థులు కార్తీక్, చింటూ, రాహుల్, మోహన్‌లు ఎంపికయ్యారని తెలిపారు. విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ రత్నవల్లి, పీడీ విద్యాసాగర్, పీఈటీ వివేక్ అభినందించారు.

ఉత్సవాలకు సన్నాహాలు



వాకర్స్‌కు వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

వెంకోజీపాలెం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : : ఆబాలగోపాలం సంతోషంగా కలిసిమెలిసి చేసుకునే ఉత్సవం వినాయక చవితి. దీన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు వాడవాడలా యువకులు సన్నాహాలు చేస్తున్నారు. మండపాల నిర్మాణం దాదాపుగా పూర్తయ్యాయి. పందిరి లోపల భక్తులను ఆకట్టుకునేలా అలంకరిస్తున్నారు. 2 నుంచి 12 అడుగుల విగ్రహాల వరకు 15, 16 వార్డులలో ఏర్పాటు చేసేందుకు యువకులు, మహిళలు సిద్ధమౌతున్నారు. పాత వెంకోజీపాలెంలోని సీతారామ సేవా సంఘం యూత్ ఆధ్వర్యంలోనూ, హెచ్‌బీకాలనీ హౌసింగ్ బోర్డు కార్యాలయం వద్ద, రజక వీధి గెడ్డ పక్కన, వీధులలో ఇప్పటికే మండపాలను నిర్మించారు.

సినిమా గైడ్

- **పరదా** : శారద, శ్రీకన్య లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య-2 (గాజువాక)
- **మేఘాలు చెప్పిన ప్రేమకథ** : రమాదేవి, మోహిని (గాజువాక)
- **బన్ బట్టర్ జామ్** : రమాదేవి, నరసింహ (గోపాలపట్నం), శ్రీ కన్య హెవెన్ (గాజువాక)
- **యూనివర్సిటీ** : శ్రీకాంతి
- **వార్-2** : జగదాంబ, రమాదేవి, మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శరత్, కామేశ్వరి, సుకన్య (గోపాలపట్నం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **కూలీ** : సంగం, వెంకటేశ్వర-1, లీలామహల్, కిన్నెర, శ్రీరామా, గోకుల్, సౌజన్య (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ), లిఖిత (శ్రీహరిపురం),
- **సార్, మేడమ్** : మౌర్య (గోపాలపట్నం),
- **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా),

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 24, టమాటా 50, వంకాయలు (తెలుపు) 32, వంకాయలు (నలుపు) 30, బెండకాయలు 40, పచ్చిమిర్చి 50, కాకరకాయలు 30, బీరకాయలు 48, ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 20, క్యారెట్ 46, దొండకాయలు 32, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె) 10, మునక్కాడలు (కిలో) 46, అల్లం (పాతది) 74, బరబాటి 36, ముల్లంగి 32, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 50, దోస కాయలు 32, వెల్లుల్లి (పెద్దవి) 75, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 110, కీరదోస 32, కాప్సికమ్ 62, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 34, చిలగడదుంపలు 46, కంద 40, దేముడు చిక్కుడు 70, గోరు చిక్కుడు 36, కూర పెండలం 26, బ్రకోలి 45, పనస పొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 34, జామ కాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్)	(వంద - రూ.లలో)
విశాఖపట్నం	535
విజయనగరం	539
శ్రీకాకుళం	539

చికెన్ ధరలు	బ్యాగ్
రైతు ధర	108
లైవ్ ధర	128
విత్ స్కిన్	226
స్కిన్‌లెస్	236



స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, కార్పొరేటరు మంగవేణి, తదితరులు



ఆరిలోవలో కార్డులు అందిస్తున్న కూటమి నాయకులు

మెరుగైన పంపిణీ వ్యవస్థ కోసమే స్మార్ట్‌కార్డులు

కలెక్టర్ హరేంధిర ప్రసాద్, తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 18వ వార్డులోని ఎంవీపీకాలనీ 201 రేషన్ డిపోలో సోమవారం స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ హరేంధిర ప్రసాద్, తూర్పు శాసనసభ్యుడు వెలగపూడి రామకృష్ణబాబు పాల్గొన్నారు. కార్పొరేటరు గొలగాని మంగవేణి తొలుత రేషన్ కార్డుదారులకు స్మార్ట్ కార్డులు అందచేశారు. రేషన్ పంపిణీలో అవకతవకల నిరోధానికి,మరింత సరళమైన పంపిణీ వ్యవస్థ కోసం ఈ కార్డులను ప్రభుత్వం ప్రవేశపెట్టిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్డులోని క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా కుటుంబ సభ్యుల వివరాలు తెలుస్తాయని కలెక్టర్ అన్నారు. ఇళ్లకు వెళ్లి సచివాలయ సిబ్బంది కార్డులు అందచేస్తారని తెలిపారు. జిల్లా పౌరసరఫరాల అధికారి భాస్కర్, ఏఎస్‌ఓ కల్యాణి, భారతీయ జనతా పార్టీ నాయకులు సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

15వ వార్డులో...

వెంకోజీపాలెం : రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన స్మార్ట్ రేషన్ కార్డులను 15వ వార్డులోని 212, 213 రేషన్ దుకాణాల వద్ద సోమవారం వీఆర్వోలు, టీడీపీ నాయకులు పాల్గొని కార్డుదారులకు పంపిణీ చేశారు. ఏటీఎం కార్డు తరహాలో ఉండే ఈ స్మార్ట్ రేషన్ కార్డులపై నాయకుల ఫొటోలు కాకుండా ప్రభుత్వ అధికారిక చిహ్నం, కుటుంబ పెద్ద ఫోటో, క్యూఆర్‌కోడ్ ఉంది. దీని ద్వారా లబ్ధిదారులు కార్డులోని కుటుంబ సభ్యుల వివరాలు, ఈకేవైసీ స్థితి, రేషన్ కేటాయింపు, పరిమాణం, రేషన్ తీసుకున్న వివరాలు, దుకాణం వివరాలను తెలుసుకునేలా రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్డులను రూపొందించిందని 15వ వార్డు టీడీపీ అధ్యక్షుడు బుగత సత్యనారాయణ, గవర కార్పొరేషన్ డైరెక్టర్ మళ్ల రవికుమార్‌లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు శివకుమార్, హైమావతి, టీడీపీ 15వ వార్డు మహిళా అధ్యక్షురాలు వరలక్ష్మి, కర్రి గౌరీ, సోమేశ్వరి, సన్యాసమ్మ, మళ్ల వెంకట్, ఎం. కనకరాజు, సత్యనారాయణ, జనసేన 15వ వార్డు అధ్యక్షురాలు యడ్ల కళావతి, రేషన్ డీలర్లు కాళ్ల అప్పలరాజు, పాండు తదితరులు పాల్గొన్నారు.

రామ్‌నగర్‌లో...

రామ్‌నగర్ : నియోజకవర్గం 28వ వార్డులో సోమవారం ఇంటింటికీ వెళ్లి స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. తెలుగుదేశం పార్టీ వార్డు ఇన్‌చార్జి నక్కా కనకరాజు ఆధ్వర్యంలో రామ్‌నగర్, బానోజీ నగర్, పితాని దిబ్బ, జై సంతోషిమాత కాలనీలలో 169, 170, 172, 175 రేషన్ డిపోలకు చెందిన కార్డుదారుల ఇళ్లకు వెళ్లి వీటిని అందజేశారు. ఆర్‌ఐ అశోక్‌కుమార్, సచివాలయ సిబ్బంది రేషన్ డీలర్లు, కూటమి నాయకులు ఉరుకూటి పైడిరాజు, నడిగట్ల శంకరరావు, డిల్లీశ్వరి, శ్యామలా, లక్ష్మి , శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆరిలోవలో...

ఆరిలోవ : రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా రూపొందించిన డిజిటల్ రేషన్ కార్డులను సోమవారం రేషన్ డిపోల వద్ద టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహన కార్యదర్శి ఒమ్మి సన్యాసిరావు పంపిణీ చేశారు. 221, 223, 228 రేషన్‌షాపుల పరిధిలోని కార్డుదారులకు వీటిని అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఇంటికి వచ్చి సచివాలయ సిబ్బంది, డీలర్లు పాత రేషన్ కార్డు తీసుకొని డిజిటల్ కార్డులు అందిస్తారని, ఎటువంటి రుసుము చెల్లించనవసరం లేదని తెలిపారు. 12వ వార్డు టీడీపీ అధ్యక్షుడు గాడిసత్యం, ఒమ్మి పోలారావు, ఏడువాక సన్యాసిరావు పాల్గొన్నారు. పదో వార్డులో కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి ఆధ్వర్యంలో 227వ డిపో వినియోగదారులకు డిజిటల్ కార్డులను అందించారు. టీడీపీ వార్డు అధ్యక్షుడు గాడు అప్పలనాయుడు, దొంతల రమణ, బండి రాజారమేష్, మద్దిల రాజేష్ పాల్గొన్నారు. 13వ వార్డులో కార్పొరేటర్ కెల్ల సునీత సత్యనారాయణ ఆధ్వర్యంలోనూ, 9వ వార్డులో వార్డు ఇన్‌చార్జి బుడుమూరు గోవింద్ ఆధ్వర్యంలో డిజిటల్ కార్డుల పంపిణీ జరిగింది.

రేపటి నుంచి వినాయక చవితి ఉత్సవాలు

- ముస్తాబైన సంపత్ వినాయగర్ ఆలయం
- తొమ్మిది రోజులు వివిధ అలంకరణలలో స్వామివారి దర్శనం
- భక్తులందరికీ ఉచిత దర్శనాలు
- ఆలయ ఈవో డీవీవీ ప్రసాదరావు

సిరిపురం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : దేవదాయ శాఖ సంపత్ వినాయగర్ దేవాలయంలోని వినాయక నవరాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఈ నెల 27 నుంచి సెప్టెంబరు 4 వరకు ప్రత్యేక పూజాది కార్యక్రమాలు ఆలయంలో జరగనున్నాయి. ప్రతీ ఉదయం 4 గంటల నుంచి గణపతి హోమం, నాదస్వర కచేరి, ఉభయదాతలతో ప్రత్యేక అభిషేకాలు,సాంస్కృతిక కార్యక్రమాలు, మధ్యాహ్నం 12 నుంచి నారాయణ సేవ జరగనుంది. సాయంత్రం 4 గంటల నుంచి నాదస్వర కచేరీ, సాంస్కృతిక కార్యక్రమాలు, ఆధ్యాత్మిక ప్రసంగం, ప్రత్యేక అలంకరణలతో స్వామివారి దర్శనం, ప్రసాద వితరణ చేపట్టనున్నారు.

ప్రత్యేక అలంకరణలతో దర్శనం

ఈ నెల 27న సంపత్ వినాయగర్, 28న బాల గణపతి, 29న నాగాశన గణపతి, 30న మయూరేశ గణపతి, 31న నర్తన గణపతి, సెప్టెంబరు 1న మూషిక వాహన గణపతి, 2న రాజగణపతి, 3న యోగ గణపతి, 4న అయోధ్య బాలరామ గణపతిగా ప్రత్యేక అలంకరణలలో స్వామివారు దర్శనమివ్వనున్నారు.

విద్యుత్ కాంతులతో ఆలయం ధగధగ

వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా విద్యుత్ కాంతులతో స్వామివారి ఆలయాన్ని ముస్తాబు చేశారు. స్వామివారిని అలంకరించేందుకు ప్రత్యేక పూలదండలతో డిజైన్స్ తయారు చేయించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా మంచినీటి సదుపాయాన్ని క్యూలైన్స్ మధ్యలో ఇచ్చేలా చర్యలు తీసుకున్నారు.

ఏర్పాట్లు పూర్తి చేశాం : ఆలయ ఈవో

సంపత్ వినాయగర్ ఆలయంలోని నవరాత్రి మహోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేసినట్టు ఆలయ ఈవో డీవీవీ ప్రసాదరావు తెలిపారు. రోజూ ప్రత్యేక అభిషేకాలతో పాటు భక్తులందరూ దర్శించుకునేందుకు క్యూలైన్లు ఏర్పాటు చేశామన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా క్యూలైన్లు ఏర్పాటు చేశామన్నారు. భక్తులందరికీ ఉచిత దర్శనం కల్పిస్తామన్నారు.



ఆలయంలో క్యూలైన్ల ఏర్పాటు

రజకవీధిలో 17 అడుగుల విగ్రహం

పెదవాల్తేరు : రజకవీధిలో బాల గణేష్ కల్చరల్ క్లబ్ ఆధ్వర్యంలో భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారు. మహారాష్ట్ర నమూనా వన్‌గ్రామ్ గోల్డ్‌తో చేసిన 17 అడుగుల విగ్రహం ఆగమనం కార్యక్రమంలో తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి, ఆయన తనయుడు ప్రతాప్ రుద్ర, ప్రసాద్, హేమంత్, భాను, రవి, అభి, 21వ వార్డు టీడీపీ అధ్యక్షుడు అమరేంద్ర పాల్గొన్నారు.

ముగిసిన కరాటే సెమినార్...

విశాఖపట్నం స్పోర్ట్స్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): డ్రాగన్ ఫోర్స్ మార్షల్ అకాడమీ నిర్వహించిన కరాటే సెమినార్ ముగిసింది. ఇందులో రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 250 మంది క్రీడాకారులు పాల్గొని కరాటే క్రీడాంశానికి సంబంధించి పలు అంశాలపై అవగాహన పొందడమే కాకుండా బెల్ట్ గ్రేడ్ టెస్టులో ఉత్తీర్ణత సాధించిన క్రీడాకారులు ధ్రువపత్రాలు పొందారు. సెమినార్ చీఫ్ ఆర్గనైజర్ చిగురుపల్లి సతీష్‌కుమార్ మాట్లాడుతూ కరాటే క్రీడాంశాలలో మెలకువల ప్రదర్శనతోపాటు కరాటే సాధనతో ప్రయోజనాలను వరల్డ్ కరాటే ఫెడరేషన్ జడ్జి రాజేష్ అగర్వాల్ వివరించారన్నారు. కరాటేకు తగిన ప్రాధాన్యం, ప్రాచుర్యం పెంపొందించడంతో ప్రపంచవ్యాప్తంగా మారుతున్న కొత్త నిబంధనలు, మెలకువలను ఇన్‌స్ట్రక్టర్లు, కోచ్‌లకు అవగాహన కల్పించడమే సెమినార్ ఉద్దేశమని పేర్కొన్నారు.

ప్రవీణ్ కుమార్‌కు స్వర్ణ పతకాలు



మర్రిపాలెం,ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : ది ఐసీఎన్ ఇండియా హైదరాబాద్ డెక్కన్ దేహదారుఢ్య (బాడీ బిల్డింగ్) పోటీల్లో విశాఖ యువకుడు సత్తా చాటాడు. హైదరాబాద్‌లో ఇటీవల జాతీయ స్థాయిలో నిర్వహించిన పోటీల్లో విశాఖపట్నం జీవీఎంసీ పరిధి 53వ వార్డు మర్రిపాలెం జాకీర్ హుస్సేన్ నగర్ ప్రాంతానికి చెందిన రాయి ప్రవీణ్‌కుమార్ (18) నాలుగు కేటగిరీలలో మూడు స్వర్ణాలు, ఒక కాంస్య పతకాన్ని సాధించాడు. ఐటీఐ పూర్తిచేసిన ప్రవీణ్ కుమార్ చిన్నతనం నుంచి వ్యాయామంపై ఆసక్తితో నిరంతరం శ్రమించి మంచి బాడీబిల్డర్‌గా జాతీయస్థాయిలో పత కాలు సాధిస్తున్నాడు. తన తండ్రి కూలీ పనులు చేస్తూ వచ్చిన ఆదాయంతోనే కుటుం బం జీవనం సాగిస్తోంది. ఆర్థికంగా వెనుకబడిన తనకు కోచ్ పవన్ అందిస్తున్న సహకారం తోనే ఐసీఎన్ స్థాయికి చేరానన్నాడు. దాతలు చేయూత అందిస్తే ఉన్నత శిక్షణ పొంది అం తర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించగలనని ప్రవీణ్‌కుమార్ విశ్వాసం వ్యక్తం చేశాడు.

మానసిక దివ్యాంగులకు అభినందనలు

పెదవాల్తేరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): జేసీఐ వైజాగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీల్లో పెదవాల్తేరులోని హిడెన్ స్ప్రౌట్స్ స్పెషల్ స్కూల్ విద్యార్థులు అద్భుతంగా రాణించి చాంపియన్‌షిప్ ట్రోఫీని గెలుపొందారు. ఈ సందర్భంగా సోమవారం తూర్పు శాసన సభ్యుడు వెలగ పూడి రామకృష్ణబాబు వారిని అభినందించారు. ఆయన మాట్లాడుతూ మానసిక దివ్యాంగుల ప్రతిభను వెలికి తీయడంలో హిడెన్ స్ప్రౌట్స్ స్కూల్ చేస్తున్న కృషిని అభినందించారు. కండిపిల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ జేసీఐ వైజాగ్ నిర్వహించిన స్పెషల్ ఒలింపిక్స్ ఆటల పోటీలలో తమ పాఠశాల విద్యార్థుల్లో ప్రతిభ, సత్తా బయటపడ్డాయన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరికి తీవ్ర గాయాలు

మద్దిలపాలెం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : మూడో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం అర్ధరాత్రి జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. కొత్తవలసకు చెందిన అప్పలరాజు (26) పెదవాల్తేరులోని సోదరి ఇంట్లో ఉంటూ స్విగ్గీ డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం అర్ధరాత్రి ఫుడ్ డెలివరీ రావడంతో తీసుకోవడానికి బయలుదేరాడు. ఏయూ ఇంజనీరింగ్ రోడ్డులో బైక్‌పై వస్తుండగా, అదే రోడ్డులో బైక్‌పై మరో యువకుడు వస్తూ ఇరువురూ ఢీకొట్టుకున్నారు. ఈ ప్రమాదంలో అప్పలరాజుకు తీవ్ర గాయాలయ్యాయి. మరో ప్రమాదంలో శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఎస్. బాలరాజు ఆదివారం అర్ధరాత్రి 1.45 గంటల సమయంలో అశీల్‌మెట్ట సంపత్ వినాయక ఆలయం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వైపు బైక్‌పై వస్తుండగా డివైడర్‌ను ఢీకొట్టాడు. దీంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదాలపై త్రీటౌన్ ట్రాఫిక్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



విగ్రహాలను పంపిణీ చేస్తున్న స్వాతి ప్రమోటర్స్ ఎండీ కృష్ణారెడ్డి



మట్టి ప్రతిమలు అందిస్తున్న వంశీకృష్ణ శ్రీనివాస్

'మట్టి ప్రతిమలను పూజిద్దాం'

వెంకోజీపాలెం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు మట్టి విగ్రహాలను పూజించాలని, తద్వారా పర్యావరణాన్ని కాపాడాలని స్వాతి ప్రమోటర్స్ ఎండీ కృష్ణారెడ్డి సూచించారు.సోమవారం పాత వెంకోజీపాలెంలోని సీతారామ సేవా సంఘం రామాలయం వద్ద భక్తులకు మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో స్వాతి ప్రమోటర్స్ డీజీఎం పీల సుబ్రహ్మణ్యం, సీతారామా సేవా సంఘం గౌరవ అధ్యక్షుడు మళ్ల పోలిరాజు, అధ్యక్షుడు కర్రి వెంకట సూర్య అప్పారావు, కార్యవర్గ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఎంవీపీ కాలనీ : శివాజీపార్కు ఆవరణలో సోమవారం వినాయకుని మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. గొడుగు వాకర్స్ అసోసియేషన్, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో 200 మట్టి విగ్రహాలను సందర్శకులకు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

రామ్‌నగర్ : తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ చేతుల మీదుగా 2000 వేల విగ్రహాలను పంపిణీ చేశారు, అలాగే రామ్‌నగర్‌లోని ఒక సమావేశ మందిరంలో సదరన్ ఇంటర్‌నేషనల్ మేనేజ్‌మెంట్ అకాడమీ ఆధ్వర్యంలో విద్యార్థులకు మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. ప్రజలు మట్టి గణపతులను పూజించి పర్యావరణాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సతీష్‌తో పాటు విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు.



ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఆధ్యాత్మికవేత్త పీవీ శర్మ, తదితరులు

భగవద్గీత నిత్యజీవితానికి మార్గదర్శి

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : భగవద్గీత నిత్య జీవితానికి మార్గదర్శి అని ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త పీవీ శర్మ అన్నారు. ఎంవీపీ కాలనీలోని గాయత్రి విద్యా పరిషత్ కళాశాలలో మానవీయ ఆధ్యాత్మిక విలువల సర్టిఫికెట్ కోర్సును సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. యోగ సాధన విద్యార్థుల వక్తిత్వ వికాసానికి బలమైన పునాది అని, ఇది శరీరాన్ని సుదృఢం చేసి, మనసును స్థిరపరుస్తుందన్నారు. కళాశాల డైరెక్టర్ గిరిధర్, సభ్యులు కామేశ్వరరావు, ప్రిన్సిపల్ ఆచార్య కేఏస్ బోస్ తదితరులు ప్రసంగించారు. యోగ అధ్యాపకులు కృష్ణవేణి, ఆస్ట్రాలజీ, తెలుగు భాష విభాగాధిపతి డాక్టర్ యూవీఎస్ఎస్ శాస్త్రి, ఆంగ్ల భాష విభాగాధిపతి డాక్టర్ విజయలక్ష్మి, ఫిజిక్స్ విభాగాధిపతి డాక్టర్ లావణ్య, అధ్యాపకులు రాధిక, శైలజ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 114 వినతులు



వినతులు స్వీకరిస్తున్న ఏడీసీ వర్మ, సీపీ మీనాకుమారి

వెంకోజీపాలెం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 114 వినతులు వచ్చాయి. అదనపు కమిషనర్ ఎస్.ఎస్.వర్మ, సిటీ ప్లానర్ మీనా కుమారితో కలిసి నిర్వహించిన ఈ కార్యక్రమంలో నగర వ్యాప్తంగా వచ్చిన వినతులను స్వీకరించారు. విభాగాధిపతులు ఈ అర్జీలను ప్రతి రోజూ పరిశీలిస్తూ, నిర్ణీత సమయంలో పరిష్కరించాలని ఆదేశించారు. అధికారులు వెంటనే స్పందించి కార్యాచరణ చేపట్టాలని, ప్రతివారం అదే ఫిర్యాదులు తిరిగి ప్రజలు సమర్పించకుండా సమస్యలను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని అదనపు కమిషనర్ ఆదేశించారు. పలు విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి



మొక్కలు నాటుతున్న నిరంకారీ మిషన్ సభ్యులు

విశాఖపట్నం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి) : వన్‌నెస్ వాన్ ప్రాజెక్టు కార్యక్రమంలో భాగంగా సంత్ నిరంకారీ మిషన్ సభ్యులు సోమవారం కాన్వెంట్ జంక్షన్‌లోని బరియల్ గ్రౌండ్‌లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జిల్లా సంత్‌నిరంకారీ మిషన్ అధ్యక్షుడు ప్రేమ్ మీర్పురి మాట్లాడుతూ ప్రకృతిని పరిరక్షించడం కూడా నిస్వార్థ సేవలో ఒక అంశమన్నారు. ప్రకృతి ప్రకోపిస్తే పరిస్థితులు ఎలా ఉంటాయన్న విషయం అనేక మార్లు చవిచూశామన్నారు. వీటి నుంచి మనల్ని మనం కాపాడుకునేందుకు పర్యావరణాన్ని సమతుల్యంలో ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎఆర్ రాజు, సంచాలకులు రాజ్‌వీర్, రీతాజీ, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

రిమాండ్‌కు అత్యాచార నిందితుడు

భీమునిపట్నం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో బాలికపై అత్యాచారానికి పాల్పడిన ఆటో డ్రైవర్ ఇరుపిల్లి సాయికుమార్ (29)ను పోలీసులు రిమాండ్‌కు తరలించారు. స్థానికంగా ఉన్న ఒక కాలనీలో నివశిస్తున్న సాయికుమార్ మద్యం మత్తులో శనివారం రాత్రి పద మూడేళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడిన విషయం తెలిసిందే. పోలీసులు నిందితుడ్ని అదుపులోకి తీసుకుని విచారించారు. అనంతరం కోర్టులో హాజరుపరచగా జడ్జి రిమాండ్ విధించారు. సీఐ తిరుమలరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సంపత్ వినాయగర్ హుండీ లెక్కింపు

- 18 రోజులకు రూ.11,22,766 ఆదాయం



హుండీ ఆదాయం లెక్కిస్తున్న దృశ్యం

సిరిపురం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): సంపత్ వినాయగర్ దేవాలయంలో హుండీలను సోమవారం లెక్కించారు. గడిచిన 18 రోజులకు రూ.11,22,766 ఆదాయం సమకూరినట్టు ఆలయ ఈవో డీవీవీ ప్రసాదరావు, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ టీ.ఆర్.చోళన్ తెలిపారు. బంగారం 000-017-220 గ్రాములు, వెండి 000.004.200 గ్రాములు వచ్చాయన్నారు. యూఎస్ డాలర్స్ 116, సౌదీ రియల్స్ 10, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ 30 లభించాయని తెలిపారు. దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రీధర్ పర్యవేక్షించగా శ్రీ వెంకటేశ్వరసేవా సంఘం సభ్యులు, ఆలయ సిబ్బంది లెక్కించారని తెలిపారు. వీఆర్ఓ ఎల్.కృష్ణచైతన్య, దేవాలయ సిబ్బంది జి.గోవిందరెడ్డి, బీఎన్ మూర్తి, డీఎస్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారని తెలిపారు.



మ(క్రి)పాలెం సాయినగర్ కాలనీవాసులకు మట్టి గణపతి ప్రతిమలు అందజేస్తున్న ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, జనసేన ఇన్‌చార్జి ఉషాకిరణ్ తదితరులు



జీవీఎంసీ ఉద్యోగులకు మట్టి ప్రతిమ అందజేస్తున్న జోన్-4 జడ్పీ మల్లయ్యనాయుడు



అబిద్‌నగర్‌లో మట్టి గణపతులను అందిస్తున్న ఉషోదయ చారిటబుల్ ట్రస్ట్ కన్వీనర్ నవ్య తదితరులు

మట్టి వినాయక ప్రతిమలనే పూజిద్దాం

మద్రిపాలెం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ మట్టి వినాయకుని ప్రతిమలను పూజించి పర్యావరణాన్ని పరిరక్షించాలని ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు పిలుపునిచ్చారు. సోమవారం 53వ వార్డు పరిధి సాయినగర్ కాలనీవాసులు, జనసేన నాయకుడు నీరుకొండ దివాకర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, జనసేన ఉత్తర నియోజకవర్గ కన్వీనర్ పసుపులేటి ఉషాకిరణ్ పాల్గొని భక్తులకు ప్రతిమలను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు తమవంతు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో 53, 54 వార్డుల జనసేన అధ్యక్షులు తాటిపాకల మాణిక్యాలరావు, వింజుమూరి భాస్కరరావు, సాయినగర్‌కాలనీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

మహరాణిపేట: జీవీఎంసీ జోన్-4 ఉద్యోగులకు జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడు ఉచితంగా మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. సూర్యాబాగ్‌లోని జోన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మట్టితో తయారు చేసిన ప్రతిమలతో పండుగ జరుపుకోవటం వినాయకుడిపైనే కాకుండా ప్రకృతి పట్ల నిజమైన భక్తి ప్రతిబింబిస్తుందని

» ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు పిలుపు

అన్నారు. అందరూ పర్యావరణ అనుకూల పద్ధతులు పాటించాలని పిలుపునిచ్చారు. ఉద్యోగులు బి.వి.అశోక్‌కుమార్, బి.వి.బంగారు రాజు, వార్డు పరిపాలన కార్యదర్శుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.జె.గణేష్‌కుమార్, ఎం.రమేష్ రెడ్డి, పూర్ణిమా తదితరులు పాల్గొన్నారు.

అక్కయ్యపాలెం: ఉషోదయ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం అబిద్‌నగర్‌లో మట్టి వినాయక విగ్రహాలను ట్రస్ట్ కన్వీనర్ కొయిలాడ నవ్య పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ పీవోపీ, రసాయనాలతో తయారు చేసిన వినాయక విగ్రహాలను కాకుండా కేవలం మట్టితో రూపొందించిన ప్రతిమలనే పూజించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్. భవాని, కె.సునీత, ఎ.మాధవి, ఆర్.దేవకి, ఆర్.మృదుభాషిణి పాల్గొన్నారు.

సాయి ధ్యానమందిరంలో......

వినాయక చవితి సందర్భంగా రైల్వే ఎగ్జిబిషన్ మైదానం ఎదురుగా ఉన్న షిర్డీ సాయిధ్యానమందిరం ఆధ్వర్యంలో స్వాతి ప్రమోటర్స్ అధినేత కృష్ణారెడ్డి భక్తులకు మట్టి విగ్రహాలు పంపిణీ చేశారు. సంస్థ ఏజీఎం సంతోష్



మురళీనగర్ వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో...

కుమార్, ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు నూకల శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

మాధవధార: మురళీనగర్ వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం విఘ్నేశ్వరుని మట్టి ప్రతిమల్ని స్థానికులకు అందజేశారు. జి.చక్రధర్ ఆర్థిక సాయంతో 500 ప్రతిమలు, పూజా వ్రతకల్పం పుస్తకాల్ని క్లబ్ ఆవరణలో భక్తులకు అందజేశారు. పర్యావరణ పరిరక్షణకు సహకరించే ప్రతిమల్ని ఏటా స్థానికులకు అందించడం ఆనవాయితీగా పాటిస్తున్నామని క్లబ్ అధ్యక్షుడు ఎస్.భానుప్రకాష్ తెలిపారు. క్లబ్ కార్యవర్గం, దాతలు, పూర్వ కమిటీ సభ్యులు ఏటా ఈ కార్యక్రమం నిర్వహణకు కలసికట్టుగా తమ మద్దతు అందిస్తున్నారని అన్నారు. వాకర్స్‌క్లబ్ వ్యవస్థాపకుడు ఎన్.బుచ్చయ్య, క్లబ్ కార్యదర్శి సిహెచ్.ఎస్ఎస్‌వి.ప్రసాదరావు హాజరయ్యారు.

మండపాల నిర్వాహకులు నిబంధనలు పాటించాలి



సీఐ డి.వెంకటరమణ

సీతంపేట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవ నిర్వాహకులు నగర పోలీసు కమిషనర్ చేసిన సూచనలు, నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, లేకుంటే అనుమతులు ఇవ్వబోమని ద్వారకా పోలీసు స్టేషన్ సీఐ డి.వెంకటరమణ స్పష్టంచేశారు. మండపాల్లో విద్యుత్ కనెక్షన్లు సరిగా తీసుకోవాలని, ఊరేగింపులు, నిమజ్జన స్థలాల్లో సరైన బారికేడింగ్, లైటింగ్, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్, సీసీ కెమెరాలు, జనరేటర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. అధికారికంగా గుర్తించిన ప్రదేశాల్లో మాత్రమే విగ్రహాల నిమజ్జనం జరపాలన్నారు. మండపాల్లో పేలుడు పదార్థాలు ఉంచకూడదని, నూనెదీపాలు వెలిగించేటప్పుడు అత్యంత జాగ్రత్త వహించాలన్నారు. సమీపంలో నీరు, ఇసుక తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలని సూచించారు. మైకుల వినియోగంలో పీసీబీ పరిమితులను అతిక్రమించరాదన్నారు, రాత్రి 10 నుంచి ఉదయం 6 గంటల వరకు మైకుల వినియోగం నిషేధమన్నారు. ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా సంబరాలు జరుపుకోవాలని, బలవంతంగా విరాళాలు వసూలు చేయడం, లక్కీ డిప్స్, లాటరీలు నిషేధమని సీఐ వెంకటరమణ సూచించారు.

దుమ్మురేగుతున్న రోడ్లతో ప్రయాణ ఇబ్బందులు



మాధవధార ఉడాకాలనీ దారిలో పేరుకుపోయిన మట్టి

మాధవధార, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 51వవార్డు మాధవధార ఉడాకాలనీ నివాసిత ప్రాంతంలో రోడ్లు సిమెంట్ క్రషర్, మట్టితో దుమ్మురేగుతోంది. ఇటీవల కురిసిన వర్షాలకు కొండ ప్రాంతాల నుంచి, నిర్మాణ భవనాల నుంచి సిమెంట్ క్రషర్, ఇసుక వీధుల్లో మేటలు వేసింది. కాలనీ అనుసంధాన మార్గాలన్నీ దాదాపు నిర్మాణ వ్యర్థాలతో పేరుకుపోవడంతో ప్రయాణ ఇబ్బందులు తప్పడం లేదు. వాహనదారులు, పాదచారులు జారి పడుతున్నారు. రోడ్డు మలుపుల్లో మట్టి అంగుళం మేర పేరుకుపోయింది. మాధవధార ఉడాకాలనీ ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా రోడ్లన్నీ నిర్మాణ సామగ్రితో నింపేస్తుండటంతో సమస్యగా మారిందని స్థానికులు వాపోతున్నారు. సచివాలయ సిబ్బంది నుంచి శానిటరీ అధికారులకు ఎన్నిమార్లు ఫిర్యాదు చేస్తున్నా ఫలితం కానరావడం లేదని మాధవధార ఉడాకాలనీ నివాసితులు వాపోతున్నారు. చర్యలు చేపట్టి రోడ్డు మార్గాల్ని సురక్షితంగా తీర్చిదిద్దాలని కోరుతున్నారు.

వీఆర్ఎస్ ఉద్యోగులకు ఆర్ఎంహెచ్‌పీ డ్యూటీ

... 5వ పేజీ తరువాయి

చేయాలి. వీరిలో 90 శాతం మందికి రెండు రోజుల క్రితం వీఆర్ఎస్ ఆమోదించారు. ఈ నోటీసులు ఇచ్చిన నెల రోజుల్లో వారికి సెటిల్‌మెంట్ చేసి ఇంటికి పంపించాల్సి ఉంది. ఇప్పుడు ఆర్ఎంహెచ్‌పీ డ్యూటీ వేయడం వల్ల వారికి సెలవు కూడా దొరకని పరిస్థితి ఏర్పడింది. వీరంతా నెల రోజుల తరువాత వెళ్లిపోతారని, అప్పుడు ఎవరితో పనిచేయిస్తారని ఉద్యోగ వర్గాలు ప్రశ్నిస్తున్నాయి. సిబ్బంది ఎక్కువ ఉన్నారని వందల సంఖ్యలో తొలగించడం, సమస్య వచ్చిందని కింద మీద పడడం ఏ రకమైన యాజమాన్య విధానమని కార్మికులు నిలదీస్తున్నారు.

రౌడీషీటర్లపై డేగ కన్ను

... 5వ పేజీ తరువాయి

కొట్లాటలు జరిగే అవకాశాలున్నట్టు భావించిన సీపీ అప్రమత్తమయ్యారు. క్రియాశీలకంగా ఉన్న రౌడీషీటర్లను గుర్తించి, వారిపై నిఘా పెంచాలని సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులకు సూచించారు. ప్రతి స్టేషన్ పరిధిలోనూ యాక్టివ్‌గా ఉండే రౌడీషీటర్ల జాబితా సిద్ధం చేసుకుని, వారి ఇళ్లలో ఆకస్మిక సోదాలు చేపట్టాలని ఆదేశించారు. ఈ మేరకు ఇటీవల భీమిలి పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్ల ఇళ్లలో పోలీసులు సోదాలు చేయగా ఒక రౌడీషీటర్ ఇంట్లో రెండు కత్తులు లభ్యమయ్యాయి. దీంతో అతడిని అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. వినాయక చవితి ఉత్సవాలు ముగిసేవరకు రౌడీషీటర్లపై ప్రత్యేక దృష్టిపెట్టాలని, దీనివల్ల శాంతిభద్రతల సమస్య తలెత్తదని సీపీ ఆదేశించినట్టు తెలిసింది. పోలీసుల తాజా వ్యూహంతో నగరంలో యాక్టివ్‌గా ఉండే రౌడీషీటర్లలో గుబులు మొదలైంది.

బార్‌లకు స్పందన నిల్

... 5వ పేజీ తరువాయి

గడువు ఇచ్చింది. అయితే జిల్లాలో ఇప్పటివరకు 17 బార్లకు 51 దరఖాస్తులు మాత్రమే రావడంతో అధికారులు అవాక్కయ్యారు. మంగళవారంతో గడువు ముగియనుంది. చివరిరోజు భారీగా దరఖాస్తులు వస్తాయనే ఆశాభావంతో ఉన్నారు. బార్‌ల నిర్వహణ లాభసాటిగా లేకపోవడంతో వ్యాపారులు ఆసక్తిచూపడం లేదని అధికారులు చెబుతున్నారు. బార్‌లకు లైసెన్స్ ఫీజు గతంతో పోల్చితే తగ్గించినప్పటికీ మద్యం దుకాణాల కంటే తక్కువ మార్జిన్ ఇస్తుండడం, నిర్వహణ ఖర్చులు తడిసిమోపెడవుతుండడంతో చాలా మంది బార్‌లను వదలుకునేందుకు సిద్ధపడుతున్నారని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

రేపటి నుంచి బనారస్ ఎక్స్‌ప్రెస్ తాత్కాలిక రద్దు

విశాఖపట్నం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఆగ్నేయ రైల్వే జోన్ పరిధిలో నాన్ ఇంటర్ లాకింగ్ పనులు చేపడుతున్న నేపథ్యంలో విశాఖ-బనారస్ మధ్య నడుస్తున్న ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఈ నెల 27 నుంచి కొద్ది రోజులు తాత్కాలికంగా రద్దు చేశామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ఈ నెల 27, 31, సెప్టెంబరు 9, 10 తేదీల్లో విశాఖ-బనారస్ ఎక్స్‌ప్రెస్ (18523), తిరుగు ప్రయాణంలో బనారస్-విశాఖ ఎక్స్‌ప్రెస్ (18524) ఈ నెల 28, సెప్టెంబరు 1, 8, 11 తేదీల్లో రద్దు చేశామని పేర్కొన్నారు.

నేడు టీడీపీ పార్లమెంటరీ కమిటీపై అభిప్రాయసేకరణ

విశాఖపట్నం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గం కమిటీ నియామకంపై మంగళవారం అభిప్రాయసేకరణ చేపట్టనున్నారు. అధిష్ఠానం నియమించిన ముగ్గురు సభ్యులు నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, కుడిపూడి సత్తిబాబు పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించనున్నారు. కొత్త కమిటీ ఎంపికకు అభిప్రాయసేకరణ నేపథ్యంలో ఎమ్మెల్యేలతో మంగళవారం ఎంపీ శ్రీభరత్ తొలుత చర్చించనున్నారు. ఆ తరువాత ఏడు నియోజకర్గ నాయకులు, ముఖ్యనేతల నుంచి ముగ్గురు సభ్యులు అభిప్రాయాలు తీసుకుని అధినేతకు నివేదిక అందిస్తారు.

పోలీసు కమిషనరేట్‌కు 115 ఫిర్యాదులు

మహరాణిపేట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పోలీసు కమిషనరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 115 ఫిర్యాదులు వచ్చాయి. సోమవారం నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి బాధితుల నుంచి స్వయంగా ఫిర్యాదులు స్వీకరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత పోలీసు స్టేషన్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతూ తమకు అందిన ఫిర్యాదులపై చట్టప్రకారం చర్యలు తీసుకొని సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

30, 31 తేదీల్లో అంతర్జాతీయ ఫిడే రేటింగ్ చెస్ టోర్నీ

విశాఖపట్నం స్పోర్ట్స్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఆలిండియా చెస్ ఫెడరేషన్ నేతృత్వంలో ఆంధ్ర చెస్ సంఘం నిర్వహించనున్న అంతర్జాతీయ ఫిడే రేటింగ్ ర్యాపిడ్, బ్లిట్జ్ ఓపెన్ చెస్ టోర్నీ ఈ నెల 30, 31 తేదీల్లో జరగనుంది. వాల్తేరు క్లబ్ వేదికగా జరగనున్న ఈ టోర్నీలో పాల్గొనేవారికి తప్పనిసరిగా ఆలిండియా చెస్ ఫెడరేషన్ గుర్తింపు కార్డు ఉండాలని ఆల్ విశాఖ చెస్ సంఘం కార్యదర్శి మణికంఠరావు స్పష్టం చేశారు. అన్ని వయసుల క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించవచ్చని, అయితే ఈ టోర్నీలో ప్రాతినిధ్యం వహించిన 15 ఏళ్ల వారందరికీ పతకాలతోపాటు ఇ-సర్టిఫికెట్లు లభిస్తాయని పేర్కొన్నారు. విజేతలకు రూ.2 లక్షల వరకు నగదు బహుమతులు అందజేస్తామని, రేటింగ్ మెరుగుపడేందుకు దోహదపడుతుందన్నారు.

ఐటీఐ ప్రవేశాల దరఖాస్తు గడువు ముగింపు నేడు

కంచరపాలెం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ/ప్రైవేటు ఐటీఐల్లో మూడో విడత ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి మంగళవారం సాయంత్రం 5 గంటలతో గడువు ముగుస్తుందని ఐటీఐల జిల్లా కన్వీనర్ జె.శ్రీకాంత్ పేర్కొన్నారు. అభ్యర్థులు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో సమర్పించాలని సూచించారు. మొదటి, రెండు విడతల్లో మిగిలిపోయిన సీట్లకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకుంటేనే కౌన్సెలింగ్‌కు అనుమతిస్తామన్నారు. ప్రభుత్వ పాత ఐటీఐలో పలు ట్రేడుల్లో మిగిలిన సీట్లకు తక్కువగా దరఖాస్తులు అందాయన్నారు. అభ్యర్థి ఏ ఐటీఐలో చేరదలచుకుంటే సదరు ఐటీఐనకు మాత్రమే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. వారు సమీపంలో గల ప్రభుత్వ ఐటీఐలో ధ్రువపత్రాలు పరిశీలన చేయించుకోవాల్సి ఉంటుంది. ఈ నెల 29న ఉదయం 10 గంటలకు కౌన్సెలింగ్ చేపట్టి సీట్లు భర్తీ చేస్తామన్నారు.

మహరాణిపేట సీఐగా దివాకర్

విశాఖపట్నం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మహరాణిపేట పోలీస్‌స్టేషన్ సీఐగా దివాకర్ యాదవ్‌ను నియమిస్తూ సీపీ శంఖబ్రత బాగ్చి సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. దివాకర్ యాదవ్ మెరైన్ విభాగం నుంచి ఇటీవలే నగర పోలీస్ కమిషనరేట్‌కు బదిలీపై వచ్చారు. మహరాణిపేట సీఐగా పనిచేస్తున్న బి.భాస్కరరావును సీటీవీఆర్-1కి బదిలీ చేశారు.

వరల్డ్ ట్రాన్స్‌ప్లాంట్ క్రీడల్లో రాణిస్తున్న రమణయ్య



టెన్నిస్ పోటీలో పాల్గొన్న రమణయ్య

విశాఖపట్నం స్పోర్ట్స్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): జర్మనీలో జరుగుతున్న వరల్డ్ ట్రాన్స్‌ప్లాంట్ క్రీడల్లో భారత్ నుంచి ప్రాతినిధ్యం వహించిన నగరానికి చెందిన రమణయ్య అద్భుతంగా రాణిస్తున్నారు. సోమవారం జరిగిన పురుషుల 60 ప్లస్ ఏజ్ గ్రూప్ టెన్నిస్ టోర్నీలో పాల్గొని సింగిల్స్ విభాగంలో క్వార్టర్ ఫైనల్స్‌కు చేరగా, డబుల్స్ విభాగంలో జర్మనీకి చెందిన ప్లేయర్‌తో జతగా ఆడి ప్రతిభ ప్రదర్శించి క్వార్టర్ ఫైనల్స్‌కు చేరారు. ప్రత్యర్థుల నుంచి గట్టిపోటీ ఎదురవుతున్నా నైపుణ్య ప్రదర్శనతో ముందుకు సాగుతున్నారు. టెన్నిస్ క్రీడాంశంలోనే కాకుండా వాలీబాల్ పోటీల్లో పాల్గొని సత్తా నిరూపించుకోవడం విశేషం. వాలీబాల్ టోర్నీలో క్వార్టర్ ఫైనల్స్‌లో ఇటలీపై అనూహ్య ఓటమి చెందింది.

అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు



అభివృద్ధి పనులకు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, మేయర్ పీలా తదితరులు

కంచరపాలెం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 55వ వార్డు పరిధి ధర్మానగర్, జోగారావు నగర్‌లలో పలు అభివృద్ధి పనులకు ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు నగర మేయర్ పీలా శ్రీనివాసరావుతె కలిసి సోమవారం శంకుస్థాపన చేశారు. ఆయా ప్రాంతాల్లో మూడు పార్కుల నిర్మాణం, అభివృద్ధి, సామాజిక భవనాల నిర్మాణం కోసం రూ.1.3 కోట్లతో పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపట్టామన్నారు. పేదలకు మరిన్ని సౌకర్యాలు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. అన్ని వార్డుల్లో పార్కులు, డ్రైన్లు, సామాజిక భవనాల నిర్మాణం, రోడ్లు ఏర్పాటు తదితర పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ శశికళ, శ్యామలాదీపిక, కణితి విజయలక్ష్మి, ఈతలపాక సుజాత, జడ్పీ రాము, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

అల్లిపురంలో సీసీ కాలువల పనులకు శ్రీకారం



శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ కందుల నాగరాజు, జడ్పీ మల్లయ్యనాయుడు

అల్లిపురం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): అల్లిపురం దేవాంగుల వీధిలో సుమారు రూ.11 లక్షలతో సీసీ కాలువల నిర్మాణ పనులను సోమవారం కార్పొరేటర్ కందుల నాగరాజు ప్రారంభించారు. దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ సహకారంతో వార్డులో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు, ఈఈ కేజీఎస్ నర్సింగరావు, కూటమి నాయకులు కందుల కృష్ణ, మంత్రి శాలివాహన, కుందుల బద్రీ, కేదార్‌నాథ్ పాల్గొన్నారు.

జిల్లాలో నేత్రదాన పక్షోత్సవాలు ప్రారంభం



నేత్రదాన పక్షోత్సవాల ప్రారంభ కార్యక్రమానికి జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు

సీతంపేట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): నేత్రదానం చాలా గొప్ప విషయమని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా 40వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలను సోమవారం ఆయన ప్రారంభించారు. సెప్టెంబరు 8 వరకు జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో కార్యక్రమాలు నిర్వహిస్తూ నేత్రదానాన్ని ప్రోత్సహిస్తుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ పి.జగదీశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడుతూ నేత్రదానంపై ప్రజల్లో ఉన్న అపోహలు తొలగించడానికి జిల్లా అంధత్వ నివారణ సంస్థ కృషిచేస్తోందన్నారు. ప్రాంతీయ నేత్ర వైద్యశాల సూపరింటెండెంట్, జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ డాక్టర్ పి.మీనాక్షి మాట్లాడుతూ వివిధ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జ్యోతిర్మయి, డాక్టర్ ఏవీ రమణ, డాక్టర్ మాధవి, ఆర్ఎంవో నవీన్‌కుమార్, పోస్ట్ గ్రాడ్యుయేట్‌లు, పారా మెడికల్ ఆప్తాల్మిక్ అధికారులు ఉమా శ్రీనివాస్, ఆర్.సురేష్, నేత్రదాన కౌన్సిలర్లు పూర్ణిమ, సుజాత, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

చెరువులనే రాసిచ్చేస్తారా!?

... 5వ పేజీ తరువాయి

సామూహిక ఆస్తిగా ఉన్న చెరువునకు తహసీల్దారు నిబంధనలను అతిక్రమించి ఖాతా నెంబరు 1249 ద్వారా 5.30 ఎకరాల విస్తీర్ణానికి పోలిశెట్టి శ్రీనివాస్‌కు అనుకూలంగా పట్టాదారు పాస్‌పుస్తకం జారీ చేశారని నివేదికలో పేర్కొన్నారు. ఎఫ్ఎంబీ రికార్డుల ప్రకారం వంద సంవత్సరాల నుంచి ఈ చెరువు సాగుభూములకు నీటిని అందిస్తోందని, 20 ఏళ్లుగా ఉపాధి హామీ పథకం నిధులతో చెరువు అభివృద్ధి పనులు చేపడుతున్నట్టు విచారణలో తేలింది. అలాగే పొట్నూరు గ్రామంలోని సర్వే నంబరు 107లో ఉన్న సాగునీటి చెరువుకు ఖాతా నంబరు 5698 ద్వారా 10 ఎకరాల విస్తీర్ణానికి మంచుకొండ వెంకట జగన్నాథం అనే వ్యక్తికి పట్టాదారు పాస్‌పుస్తకం జారీ చేశారు. ఇక్కడ కూడా తహసీల్దారు ఇనాం రద్దు చట్టం-1964ను పరిగణనలోకి తీసుకోలేదు. దీంతో కలెక్టర్ తదుపరి చర్యల నిమిత్తం ప్రభుత్వానికి నివేదిక పంపించారు. ఇందులో లోకేశ్వరరావు తన అధికారాలను దుర్వినియోగం చేశారని, చట్టబద్ధమైన విధులు నిర్వర్తించడంలో విఫలమయ్యారని, ప్రజా సేవకుడికి తగని విధంగా, ప్రతిష్ఠకు భంగం కలిగించే విధంగా వ్యవహరించారని, ఏపీ పౌర సేవల (ప్రవర్తన) నియమావళిని ఉల్లంఘించారని గుర్తించారు. లోకేశ్వరరావు ఇచ్చే లిఖితపూర్వక వివరణ మేరకు క్రమశిక్షణ చర్యలు తీసుకోవడానికి ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది.

నగరంపాలెంలో చెరువు కబ్జా!

... 5వ పేజీ తరువాయి

కొంత వరకూ ఆగేవారు. కానీ చెరువు ఎందుకు పనికిరాదని అధికారులు భావించారేమో దాని రక్షణకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. దీంతో కూటమి పార్టీలకు చెందిన నేతల అండదండలతో కబ్జాదారులు చెరువులో కల్యాణ మండపం నిర్మిస్తామని కొత్త ప్రతిపాదన తీసుకువచ్చారు. చెరువులో కల్యాణ మండపం నిర్మాణానికి అనుమతులు ఎలా ఇస్తారు?...అన్నది పట్టించుకోకుండా ఇటీవల రాత్రిపూట చెరువును పూర్తిగా పూడ్చే పనిచేస్తున్నారు. ఇప్పటికే మధురవాడ ప్రాంతంలో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. వర్షాకాలంలోనే బోర్లు ఎండిపోతున్నాయి. భూగర్భ జలాలు పెంచేందుకు దోహదం చేసే చెరువులు కబ్జాకు గురవుతున్నా అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పట్టించుకోకపోవడం గమనార్హం. దీనిపై మధురవాడ రెవెళ్లపాలేనికి చెందిన సంతోష్‌కుమార్ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి చెరువును కాపాడాలని కోరారు.

ఉక్కులో ఆర్ఎంహెచ్‌పీ అస్తవ్యస్తం


... 5వ పేజీ తరువాయి

పనిచేసే వారికి వ్యక్తిగత భద్రతా పరికరాలు (పీపీఈలు) ఇవ్వాలని, ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది.


అక్కడ ఏమి జరుగుతున్నదంటే...?

ఆర్ఎంహెచ్‌పీకి గూడ్సు రైళ్ల (ర్యాక్‌లు) ద్వారా ఐరన్‌ఓర్, బొగ్గు, లైమ్ స్టోన్ వంటివి వస్తాయి. వాటిని 'ట్రిప్లింగ్' విధానంలో అన్‌లోడింగ్ చేయాలి. వచ్చిన ర్యాక్‌లను ఎనిమిది గంటల్లో ఖాళీ చేసి వెనక్కి పంపాలి. అంతకు మించి ర్యాక్‌లు ఉండిపోతే వాటికి రైల్వే డెమరేజ్ చార్జీలు వసూలు చేస్తుంది. కొత్తగా వచ్చిన కాంట్రాక్ట్ వర్కర్లు ట్రిప్లింగ్ చేయలేకపోతున్నారు. దాంతో వ్యాగన్ల నుంచి సరుకును మాన్యువల్‌గా అన్‌లోడింగ్ చేస్తున్నారు. మనుషులతో అన్‌లోడింగ్ చేయించడం వల్ల ఒక్కో ర్యాక్ 30 నుంచి 40 గంటలు అక్కడే ఉండిపోతోంది. దాంతో రైల్వేకు డెమరేజ్ కింద నెలకు రూ.15 కోట్లు వరకు కడుతున్నారు. అంటే సరకును దించడానికి నెలకు అదనంగా రూ.కోట్లు వెచ్చిస్తున్నారు. ఇంత చేసినా ముడిపదార్థాలు ఆయా విభాగాలకు అందడం లేదు. కన్వేయర్ల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ఆ పనులు కూడా వారు చేయలేకపోతున్నారు. ఎస్ఎంఎస్ విభాగానికి లైమ్ స్టోన్ సరఫరా ఆగిపోయిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఆ పనులు కూడా చేయడానికి నైపుణ్యం కలిగిన సిబ్బందిని పంపాలని సీఎండీ ఆదేశించారు. చక్కగా పనిచేస్తున్న వారిని అడ్డగోలుగా తొలగించారు. ఇప్పుడు ఉత్పత్తి సాధించలేక చతికిల పడ్డారు. యుద్ధ ప్రాతిపదికన తరలించే ఉద్యోగులను ఎన్నాళ్లు అక్కడ డిప్యుటేషన్‌పై పనిచేయిస్తారు. ఇంకెంత కాలం 12 గంటలు డ్యూటీ చేయిస్తారో యాజమాన్యం ఇప్పుడైనా స్పష్టత ఇవ్వాల్సి ఉంది. దీనిపై స్థానిక ప్రజా ప్రతినిధులు కూడా సీఎండీని ప్రశ్నించాల్సిన అవసరం ఉంది.


వార్డులలో సందడిగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



స్మార్ట్ రేషన్‌కార్డులు అందజేస్తున్న కార్పొరేటర్ శ్రావణి



ఐటీఐ జంక్షన్ వద్ద కార్డులు అందజేస్తున్న కూటమి నాయకులు



జ్ఞానాపురంలో టీడీపీ నేత మధుబాబు తదితరులు

సీతమ్మధార, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): సీతమ్మధార బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో గల బీజేపీ కార్యాలయంలో పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు నూతన స్మార్ట్ రేషన్ కార్డులను సోమవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకురాలు శ్యామల దీపిక, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎండి నజీర్, కూటమి పార్టీల వార్డు అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

జ్ఞానాపురం: స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని జీవీఎంసీ 41వ వార్డు పరిధిలో సోమవారం ప్రారంభించారు. టీడీపీ వార్డు అధ్యక్షుడు ఐతి మధుబాబు కార్డుదారులకు వీటిని అందజేశారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సంక్షేమాన్ని ప్రజల ముంగిటకే తీసుకువస్తుందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, యువతకు ఇంటి నుంచే ఉపాధి కల్పించే కౌశల్యం కార్యక్రమం ప్రారంభించారని, ఇప్పుడు సాంకేతికతను ఉపయోగించి రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్నారన్నారు. వీఆర్ఓ నజీర్, కార్యదర్శులు నారాయణరావు, యశస్విని, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

అక్కయ్యపాలెం: గ్రేటర్ 26వ వార్డు 129వ నెంబరు సచివాలయం పరిధిలో స్మార్ట్ రేషన్ కార్డులను కార్పొరేటర్ ముక్కా శ్రావణి, వార్డు టీడీపీ అధ్యక్షుడు ముక్కా కిశోర్‌కుమార్‌లు సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఏటీఎం కార్డుల మాదిరి స్మార్ట్ రేషన్ కార్డులను రూపొందించిందన్నారు. గ్రేటర్ 44వ వార్డులోని సచివాలయాల్లో స్మార్ట్ రేషన్ కార్డులను బీజేపీ వార్డు అధ్యక్షురాలు మళ్ల లక్ష్మి పంపిణీ చేశారు. సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

కంచరపాలెం: రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా రూపొందించిన రేషన్ కార్డులను జీవీఎంసీ 54, 57 వార్డుల్లో కూటమి నాయకులు సోమవారం పంపిణీ చేశారు. ఐటీఐ జంక్షన్ వద్ద గల 52వ డిపో, సుభాష్ నగర్ 61వ డిపోల వద్ద కూటమి నాయకులు పాల్గొని నూతన స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఏటీఎం కార్డు మాదిరి సులభంగా ఉండడంతో కార్డుదారులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు పెంటకోట అజయ్‌బాబు, గిరి రాజు, జనసేన నాయకులు రాము, గౌరీ, బీజేపీ నాయకులు మహేంద్ర, రమణ, డీలర్లు గోపి, రమణ, నాగుల అప్పలరాజు పాల్గొన్నారు.


రోగిని పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

వాకర్స్‌కు వైద్య పరీక్షలు

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఎంవీపీ కాలనీలోని ఆళ్వార్‌దాస్ మైదానంలో రోజూ వచ్చే నడకదారులకు సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో వాకర్స్‌కు ఉచిత బీపీ, బ్లడ్ షుగర్ పరీక్షలు నిర్వహించారు. వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పర్యవేక్షించారు.

నాయీ బ్రాహ్మణుల వినతి

ఆరిలోవ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): సెలూన్లపై ఆధారపడి జీవనం సాగిస్తున్న నాయీ బ్రాహ్మణులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను అందిస్తూ ప్రభుత్వం జీవీఓ విడుదల చేయాలని జిల్లా భారతీయ జనతా పార్టీ వైద్యవిభాగం ప్రతినిధి కె. వెంకటేశ్వరావు బృందం సోమవారం కలెక్టరును కలిసి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణుల సంక్షేమ డైరెక్టర్ కోట నరేశ్, మల్లువలస శ్రీను, చిగురువలస పోలారావు, తదితరులు పాల్గొన్నారు.

టెన్నీకాయిట్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

ఆరిలోవ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణాపురంలోని అంబేడ్కర్ గురుకులం విద్యార్థులు నలుగురు రాష్ట్ర స్థాయి టెన్నీకాయిట్ పోటలకు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ రత్నవల్లి తెలిపారు. విశాఖ జిల్లా టెన్నీకాయిట్ అసోసియేషన్ జిల్లా బృందాలను ఎంపిక చేశారు. వీరు సెప్టెంబరు మొదటివారంలో కోనసీమ జిల్లాలో జరగనున్న పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. పదో తరగతి, ఇంటర్ విద్యార్థులు కార్తీక్, చింటూ, రాహుల్, మోహన్‌లు ఎంపికయ్యారని తెలిపారు. విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ రత్నవల్లి, పీడీ విద్యాసాగర్, పీఈటీ వివేక్ అభినందించారు.

ఉత్సవాలకు సన్నాహాలు


వాకర్స్‌కు వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

వెంకోజీపాలెం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : : ఆబాలగోపాలం సంతోషంగా కలిసిమెలిసి చేసుకునే ఉత్సవం వినాయక చవితి. దీన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు వాడవాడలా యువకులు సన్నాహాలు చేస్తున్నారు. మండపాల నిర్మాణం దాదాపుగా పూర్తయ్యాయి. పందిరి లోపల భక్తులను ఆకట్టుకునేలా అలంకరిస్తున్నారు. 2 నుంచి 12 అడుగుల విగ్రహాల వరకు 15, 16 వార్డులలో ఏర్పాటు చేసేందుకు యువకులు, మహిళలు సిద్ధమౌతున్నారు. పాత వెంకోజీపాలెంలోని సీతారామ సేవా సంఘం యూత్ ఆధ్వర్యంలోనూ, హెచ్‌బీకాలనీ హౌసింగ్ బోర్డు కార్యాలయం వద్ద, రజక వీధి గెడ్డ పక్కన, వీధులలో ఇప్పటికే మండపాలను నిర్మించారు.

సినిమా గైడ్

- **పరదా** : శారద, శ్రీకన్య లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య-2 (గాజువాక)
- **మేఘాలు చెప్పిన ప్రేమకథ** : రమాదేవి, మోహిని (గాజువాక)
- **బన్ బట్టర్ జామ్** : రమాదేవి, నరసింహ (గోపాలపట్నం), శ్రీ కన్య హెవెన్ (గాజువాక)
- **యూనివర్సిటీ** : శ్రీకాంతి
- **వార్-2** : జగదాంబ, రమాదేవి, మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శరత్, కామేశ్వరి, సుకన్య (గోపాలపట్నం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **కూలీ** : సంగం, వెంకటేశ్వర-1, లీలామహల్, కిన్నెర, శ్రీరామా, గోకుల్, సౌజన్య (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ), లిఖిత (శ్రీహరిపురం),
- **సార్, మేడమ్** : మౌర్య (గోపాలపట్నం),
- **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా),

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 24, టమాటా 50, వంకాయలు (తెలుపు) 32, వంకాయలు (నలుపు) 30, బెండకాయలు 40, పచ్చిమిర్చి 50, కాకరకాయలు 30, బీరకాయలు 48, ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 20, క్యారెట్ 46, దొండకాయలు 32, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె) 10, మునక్కాడలు (కిలో) 46, అల్లం (పాతది) 74, బరబాటి 36, ముల్లంగి 32, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 50, దోస కాయలు 32, వెల్లుల్లి (పెద్దవి) 75, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 110, కీరదోస 32, కాప్సికమ్ 62, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 34, చిలగడదుంపలు 46, కంద 40, దేముడు చిక్కుడు 70, గోరు చిక్కుడు 36, కూర పెండలం 26, బ్రకోలి 45, పనస పొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్)	(వంద - రూ.లలో)
విశాఖపట్నం	535
విజయనగరం	539
శ్రీకాకుళం	539

చికెన్ ధరలు	బ్యాగ్
రైతు ధర	108
లైవ్ ధర	128
విత్ స్కిన్	226
స్కిన్‌లెస్	236


స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, కార్పొరేటరు మంగవేణి, తదితరులు


ఆరిలోవలో కార్డులు అందిస్తున్న కూటమి నాయకులు

మెరుగైన పంపిణీ వ్యవస్థ కోసమే స్మార్ట్‌కార్డులు

కలెక్టర్ హరేంధిర ప్రసాద్, తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 18వ వార్డులోని ఎంవీపీకాలనీ 201 రేషన్ డిపోలో సోమవారం స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ హరేంధిర ప్రసాద్, తూర్పు శాసనసభ్యుడు వెలగపూడి రామకృష్ణబాబు పాల్గొన్నారు. కార్పొరేటరు గొలగాని మంగవేణి తొలుత రేషన్ కార్డుదారులకు స్మార్ట్ కార్డులు అందచేశారు. రేషన్ పంపిణీలో అవకతవకల నిరోధానికి,మరింత సరళమైన పంపిణీ వ్యవస్థ కోసం ఈ కార్డులను ప్రభుత్వం ప్రవేశపెట్టిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్డులోని క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా కుటుంబ సభ్యుల వివరాలు తెలుస్తాయని కలెక్టర్ అన్నారు. ఇళ్లకు వెళ్లి సచివాలయ సిబ్బంది కార్డులు అందచేస్తారని తెలిపారు. జిల్లా పౌరసరఫరాల అధికారి భాస్కర్, ఏఎస్‌ఒ కల్యాణి, భారతీయ జనతా పార్టీ నాయకులు సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

15వ వార్డులో...

వెంకోజీపాలెం : రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన స్మార్ట్ రేషన్ కార్డులను 15వ వార్డులోని 212, 213 రేషన్ దుకాణాల వద్ద సోమవారం వీఆర్వోలు, టీడీపీ నాయకులు పాల్గొని కార్డుదారులకు పంపిణీ చేశారు. ఏటీఎం కార్డు తరహాలో ఉండే ఈ స్మార్ట్ రేషన్ కార్డులపై నాయకుల ఫొటోలు కాకుండా ప్రభుత్వ అధికారిక చిహ్నం, కుటుంబ పెద్ద ఫొటో, క్యూఆర్‌కోడ్ ఉంది. దీని ద్వారా లబ్ధిదారులు కార్డులోని కుటుంబ సభ్యుల వివరాలు, ఈకేవైసీ స్థితి, రేషన్ కేటాయింపు, పరిమాణం, రేషన్ తీసుకున్న వివరాలు, దుకాణం వివరాలను తెలుసుకునేలా రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్డులను రూపొందించిందని 15వ వార్డు టీడీపీ అధ్యక్షుడు బుగత సత్యనారాయణ, గవర కార్పొరేషన్ డైరెక్టర్ మళ్ల రవికుమార్‌లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు శివకుమార్, హైమావతి, టీడీపీ 15వ వార్డు మహిళా అధ్యక్షురాలు వరలక్ష్మి, కర్రి గౌరీ, సోమేశ్వరి, సన్యాసమ్మ, మళ్ల వెంకట్, ఎం. కనకరాజు, సత్యనారాయణ, జనసేన 15వ వార్డు అధ్యక్షురాలు యడ్ల కళావతి, రేషన్ డీలర్లు కాళ్ల అప్పలరాజు, పాండు తదితరులు పాల్గొన్నారు.

రామ్‌నగర్‌లో...

రామ్‌నగర్ : నియోజకవర్గం 28వ వార్డులో సోమవారం ఇంటింటికీ వెళ్లి స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. తెలుగుదేశం పార్టీ వార్డు ఇన్‌చార్జి నక్కా కనకరాజు ఆధ్వర్యంలో రామ్‌నగర్, బానోజీ నగర్, పితాని దిబ్బ, జై సంతోషిమాత కాలనీలలో 169, 170, 172, 175 రేషన్ డిపోలకు చెందిన కార్డుదారుల ఇళ్లకు వెళ్లి వీటిని అందజేశారు. ఆర్ఐ అశోక్‌కుమార్, సచివాలయ సిబ్బంది రేషన్ డీలర్లు, కూటమి నాయకులు ఉరుకూటి పైడిరాజు, నడిగట్ల శంకరరావు, డిల్లీశ్వరి, శ్యామలా, లక్ష్మి , శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆరిలోవలో...

ఆరిలోవ : రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా రూపొందించిన డిజిటల్ రేషన్ కార్డులను సోమవారం రేషన్ డిపోల వద్ద టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహన కార్యదర్శి ఒమ్మి సన్యాసిరావు పంపిణీ చేశారు. 221, 223, 228 రేషన్‌షాపుల పరిధిలోని కార్డుదారులకు వీటిని అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఇంటికి వచ్చి సచివాలయ సిబ్బంది, డీలర్లు పాత రేషన్ కార్డు తీసుకొని డిజిటల్ కార్డులు అందిస్తారని, ఎటువంటి రుసుము చెల్లించనవసరం లేదని తెలిపారు. 12వ వార్డు టీడీపీ అధ్యక్షుడు గాడిసత్యం, ఒమ్మి పోలారావు, ఏడువాక సన్యాసిరావు పాల్గొన్నారు. పదో వార్డులో కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి ఆధ్వర్యంలో 227వ డిపో వినియోగదారులకు డిజిటల్ కార్డులను అందించారు. టీడీపీ వార్డు అధ్యక్షుడు గాడు అప్పలనాయుడు, దొంతల రమణ, బండి రాజారమేష్, మద్దిల రాజేష్ పాల్గొన్నారు. 13వ వార్డులో కార్పొరేటర్ కెల్ల సునీత సత్యనారాయణ ఆధ్వర్యంలోనూ, 9వ వార్డులో వార్డు ఇన్‌చార్జి బుడుమూరు గోవింద్ ఆధ్వర్యంలో డిజిటల్ కార్డుల పంపిణీ జరిగింది.

రేపటి నుంచి వినాయక చవితి ఉత్సవాలు

- ముస్తాబైన సంపత్ వినాయగర్ ఆలయం
- తొమ్మిది రోజులు వివిధ అలంకరణలలో స్వామివారి దర్శనం
- భక్తులందరికీ ఉచిత దర్శనాలు
- ఆలయ ఈవో డీవీవీ ప్రసాదరావు

సిరిపురం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : దేవదాయ శాఖ సంపత్ వినాయగర్ దేవాలయంలోని వినాయక నవరాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఈ నెల 27 నుంచి సెప్టెంబరు 4 వరకు ప్రత్యేక పూజాది కార్యక్రమాలు ఆలయంలో జరగనున్నాయి. ప్రతీ ఉదయం 4 గంటల నుంచి గణపతి హోమం, నాదస్వర కచేరి, ఉభయదాతలతో ప్రత్యేక అభిషేకాలు,సాంస్కృతిక కార్యక్రమాలు, మధ్యాహ్నం 12 నుంచి నారాయణ సేవ జరగనుంది. సాయంత్రం 4 గంటల నుంచి నాదస్వర కచేరీ, సాంస్కృతిక కార్యక్రమాలు, ఆధ్యాత్మిక ప్రసంగం, ప్రత్యేక అలంకరణలతో స్వామివారి దర్శనం, ప్రసాద వితరణ చేపట్టనున్నారు.

ప్రత్యేక అలంకరణలతో దర్శనం

ఈ నెల 27న సంపత్ వినాయగర్, 28న బాల గణపతి, 29న నాగాశన గణపతి, 30న మయూరేశ గణపతి, 31న నర్తన గణపతి, సెప్టెంబరు 1న మూషిక వాహన గణపతి, 2న రాజగణపతి, 3న యోగ గణపతి, 4న అయోధ్య బాలరామ గణపతిగా ప్రత్యేక అలంకరణలలో స్వామివారు దర్శనమివ్వనున్నారు.

విద్యుత్ కాంతులతో ఆలయం ధగధగ

వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా విద్యుత్ కాంతులతో స్వామివారి ఆలయాన్ని ముస్తాబు చేశారు. స్వామివారిని అలంకరించేందుకు ప్రత్యేక పూలదండలతో డిజైన్స్ తయారు చేయించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా మంచినీటి సదుపాయాన్ని క్యూలైన్స్ మధ్యలో ఇచ్చేలా చర్యలు తీసుకున్నారు.

ఏర్పాట్లు పూర్తి చేశాం : ఆలయ ఈవో

సంపత్ వినాయగర్ ఆలయంలోని నవరాత్రి మహోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేసినట్టు ఆలయ ఈవో డీవీవీ ప్రసాదరావు తెలిపారు. రోజూ ప్రత్యేక అభిషేకాలతో పాటు భక్తులందరూ దర్శించుకునేందుకు క్యూలైన్లు ఏర్పాటు చేశామన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా క్యూలైన్లు ఏర్పాటు చేశామన్నారు. భక్తులందరికీ ఉచిత దర్శనం కల్పిస్తామన్నారు.


ఆలయంలో క్యూలైన్ల ఏర్పాటు

రజకవీధిలో 17 అడుగుల విగ్రహం

పెదవాల్తేరు : రజకవీధిలో బాల గణేష్ కల్చరల్ క్లబ్ ఆధ్వర్యంలో భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారు. మహారాష్ట్ర నమూనా వన్‌గ్రామ్ గోల్డ్‌తో చేసిన 17 అడుగుల విగ్రహం ఆగమనం కార్యక్రమంలో తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి, ఆయన తనయుడు ప్రతాప్ రుద్ర, ప్రసాద్, హేమంత్, భాను, రవి, అభి, 21వ వార్డు టీడీపీ అధ్యక్షుడు అమరేంద్ర పాల్గొన్నారు.

ముగిసిన కరాటే సెమినార్...

విశాఖపట్నం స్పోర్ట్స్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): డ్రాగన్ ఫోర్స్ మార్షల్ అకాడమీ నిర్వహించిన కరాటే సెమినార్ ముగిసింది. ఇందులో రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 250 మంది క్రీడాకారులు పాల్గొని కరాటే క్రీడాంశానికి సంబంధించి పలు అంశాలపై అవగాహన పొందడమే కాకుండా బెల్ట్ గ్రేడ్ టెస్టులో ఉత్తీర్ణత సాధించిన క్రీడాకారులు ధ్రువపత్రాలు పొందారు. సెమినార్ చీఫ్ ఆర్గనైజర్ చిగురుపల్లి సతీష్‌కుమార్ మాట్లాడుతూ కరాటే క్రీడాంశాలలో మెలకువల ప్రదర్శనతోపాటు కరాటే సాధనతో ప్రయోజనాలను వరల్డ్ కరాటే ఫెడరేషన్ జడ్జి రాజేష్ అగర్వాల్ వివరించారన్నారు. కరాటేకు తగిన ప్రాధాన్యం, ప్రాచుర్యం పెంపొందించడంతో ప్రపంచవ్యాప్తంగా మారుతున్న కొత్త నిబంధనలు, మెలకువలను ఇన్‌స్ట్రక్టర్లు, కోచ్‌లకు అవగాహన కల్పించడమే సెమినార్ ఉద్దేశమని పేర్కొన్నారు.

ప్రవీణ్ కుమార్‌కు స్వర్ణ పతకాలు



మర్రిపాలెం,ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : ది ఐసీఎన్ ఇండియా హైదరాబాద్ డెక్కన్ దేహదారుఢ్య (బాడీ బిల్డింగ్) పోటీల్లో విశాఖ యువకుడు సత్తా చాటాడు. హైదరాబాద్‌లో ఇటీవల జాతీయ స్థాయిలో నిర్వహించిన పోటీల్లో విశాఖపట్నం జీవీఎంసీ పరిధి 53వ వార్డు మర్రిపాలెం జాకీర్ హుస్సేన్ నగర్ ప్రాంతానికి చెందిన రాయి ప్రవీణ్‌కుమార్ (18) నాలుగు కేటగిరీలలో మూడు స్వర్ణాలు, ఒక కాంస్య పతకాన్ని సాధించాడు. ఐటీఐ పూర్తిచేసిన ప్రవీణ్ కుమార్ చిన్నతనం నుంచి వ్యాయామంపై ఆసక్తితో నిరంతరం శ్రమించి మంచి బాడీబిల్డర్‌గా జాతీయస్థాయిలో పత కాలు సాధిస్తున్నాడు. తన తండ్రి కూలీ పనులు చేస్తూ వచ్చిన ఆదాయంతోనే కుటుం బం జీవనం సాగిస్తోంది. ఆర్థికంగా వెనుకబడిన తనకు కోచ్ పవన్ అందిస్తున్న సహకారం తోనే ఐసీఎన్ స్థాయికి చేరానన్నాడు. దాతలు చేయూత అందిస్తే ఉన్నత శిక్షణ పొంది అం తర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించగలనని ప్రవీణ్‌కుమార్ విశ్వాసం వ్యక్తం చేశాడు.

మానసిక దివ్యాంగులకు అభినందనలు

పెదవాల్తేరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): జేసీఐ వైజాగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీల్లో పెదవాల్తేరులోని హిడెన్ స్ప్రౌట్స్ స్పెషల్ స్కూల్ విద్యార్థులు అద్భుతంగా రాణించి చాంపియన్‌షిప్ ట్రోఫీని గెలుపొందారు. ఈ సందర్భంగా సోమవారం తూర్పు శాసన సభ్యుడు వెలగ పూడి రామకృష్ణబాబు వారిని అభినందించారు. ఆయన మాట్లాడుతూ మానసిక దివ్యాంగుల ప్రతిభను వెలికి తీయడంలో హిడెన్ స్ప్రౌట్స్ స్కూల్ చేస్తున్న కృషిని అభినందించారు. కండిపిల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ జేసీఐ వైజాగ్ నిర్వహించిన స్పెషల్ ఒలింపిక్స్ ఆటల పోటీలలో తమ పాఠశాల విద్యార్థుల్లో ప్రతిభ, సత్తా బయటపడ్డాయన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరికి తీవ్ర గాయాలు

మద్దిలపాలెం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : మూడో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం అర్ధరాత్రి జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. కొత్తవలసకు చెందిన అప్పలరాజు (26) పెదవాల్తేరులోని సోదరి ఇంట్లో ఉంటూ స్విగ్గీ డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం అర్ధరాత్రి ఫుడ్ డెలివరీ రావడంతో తీసుకోవడానికి బయలుదేరాడు. ఏయూ ఇంజనీరింగ్ రోడ్డులో బైక్‌పై వస్తుండగా, అదే రోడ్డులో బైక్‌పై మరో యువకుడు వస్తూ ఇరువురూ ఢీకొట్టుకున్నారు. ఈ ప్రమాదంలో అప్పలరాజుకు తీవ్ర గాయాలయ్యాయి. మరో ప్రమాదంలో శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఎస్. బాలరాజు ఆదివారం అర్ధరాత్రి 1.45 గంటల సమయంలో అశీల్‌మెట్ట సంపత్ వినాయక ఆలయం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వైపు బైక్‌పై వస్తుండగా డివైడర్‌ను ఢీకొట్టాడు. దీంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదాలపై త్రీటౌన్ ట్రాఫిక్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.


విగ్రహాలను పంపిణీ చేస్తున్న స్వాతి ప్రమోటర్స్ ఎండీ కృష్ణారెడ్డి


మట్టి ప్రతిమలు అందిస్తున్న వంశీకృష్ణ శ్రీనివాస్

'మట్టి ప్రతిమలను పూజిద్దాం'

వెంకోజీపాలెం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు మట్టి విగ్రహాలను పూజించాలని, తద్వారా పర్యావరణాన్ని కాపాడాలని స్వాతి ప్రమోటర్స్ ఎండీ కృష్ణారెడ్డి సూచించారు.సోమవారం పాత వెంకోజీపాలెంలోని సీతారామ సేవా సంఘం రామాలయం వద్ద భక్తులకు మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో స్వాతి ప్రమోటర్స్ డీజీఎం పీల సుబ్రహ్మణ్యం, సీతారామ సేవా సంఘం గౌరవ అధ్యక్షుడు మళ్ల పోలిరాజు, అధ్యక్షుడు కర్రి వెంకట సూర్య అప్పారావు, కార్యవర్గ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఎంవీపీ కాలనీ : శివాజీపార్కు ఆవరణలో సోమవారం వినాయకుని మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. గొడుగు వాకర్స్ అసోసియేషన్, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో 200 మట్టి విగ్రహాలను సందర్శకులకు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

రామ్‌నగర్ : తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ చేతుల మీదుగా 2000 వేల విగ్రహాలను పంపిణీ చేశారు, అలాగే రామ్‌నగర్‌లోని ఒక సమావేశ మందిరంలో సదరన్ ఇంటర్‌నేషనల్ మేనేజ్‌మెంట్ అకాడమీ ఆధ్వర్యంలో విద్యార్థులకు మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. ప్రజలు మట్టి గణపతులను పూజించి పర్యావరణాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సతీష్‌తో పాటు విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు.


ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఆధ్యాత్మికవేత్త పీవీ శర్మ, తదితరులు

భగవద్గీత నిత్యజీవితానికి మార్గదర్శి

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : భగవద్గీత నిత్య జీవితానికి మార్గదర్శి అని ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త పీవీ శర్మ అన్నారు. ఎంవీపీ కాలనీలోని గాయత్రి విద్యా పరిషత్ కళాశాలలో మానవీయ ఆధ్యాత్మిక విలువల సర్టిఫికెట్ కోర్సును సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. యోగ సాధన విద్యార్థుల వక్తిత్వ వికాసానికి బలమైన పునాది అని, ఇది శరీరాన్ని సుదృఢం చేసి, మనసును స్థిరపరుస్తుందన్నారు. కళాశాల డైరెక్టర్ గిరిధర్, సభ్యులు కామేశ్వరరావు, ప్రిన్సిపల్ ఆచార్య కేఎస్ బోస్ తదితరులు ప్రసంగించారు. యోగ అధ్యాపకులు కృష్ణవేణి, ఆస్త్రాలజీ, తెలుగు భాష విభాగాధిపతి డాక్టర్ యూవీఎస్ఎస్ శాస్త్రి, ఆంగ్ల భాష విభాగాధిపతి డాక్టర్ విజయలక్ష్మి, ఫిజిక్స్ విభాగాధిపతి డాక్టర్ లావణ్య, అధ్యాపకులు రాధిక, శైలజ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 114 వినతులు


వినతులు స్వీకరిస్తున్న ఏడీసీ వర్మ, సీపీ మీనాకుమారి

వెంకోజీపాలెం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 114 వినతులు వచ్చాయి. అదనపు కమిషనర్ ఎస్.ఎస్.వర్మ, సిటీ ప్లానర్ మీనా కుమారితో కలిసి నిర్వహించిన ఈ కార్యక్రమంలో నగర వ్యాప్తంగా వచ్చిన వినతులను స్వీకరించారు. విభాగాధిపతులు ఈ అర్జీలను ప్రతి రోజూ పరిశీలిస్తూ, నిర్ణీత సమయంలో పరిష్కరించాలని ఆదేశించారు. అధికారులు వెంటనే స్పందించి కార్యాచరణ చేపట్టాలని, ప్రతివారం అదే ఫిర్యాదులు తిరిగి ప్రజలు సమర్పించకుండా సమస్యలను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని అదనపు కమిషనర్ ఆదేశించారు. పలు విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి



మొక్కలు నాటుతున్న నిరంకారీ మిషన్ సభ్యులు

విశాఖపట్నం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి) : వన్‌నెస్ వాన్ ప్రాజెక్టు కార్యక్రమంలో భాగంగా సంత్ నిరంకారీ మిషన్ సభ్యులు సోమవారం కాన్వెంట్ జంక్షన్‌లోని బరియల్ గ్రౌండ్‌లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జిల్లా సంత్‌నిరంకారీ మిషన్ అధ్యక్షుడు ప్రేమ్ మీర్చురి మాట్లాడుతూ ప్రకృతిని పరిరక్షించడం కూడా నిస్వార్థ సేవలో ఒక అంశమన్నారు. ప్రకృతి ప్రకోపిస్తే పరిస్థితులు ఎలా ఉంటాయన్న విషయం అనేక మార్లు చవిచూశామన్నారు. వీటి నుంచి మనల్ని మనం కాపాడుకునేందుకు పర్యావరణాన్ని సమతుల్యంలో ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఏఆర్ రాజు, సంచాలకులు రాజ్‌వీర్, రీతాజీ, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

రిమాండ్‌కు అత్యాచార నిందితుడు

భీమునిపట్నం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో బాలికపై అత్యాచారానికి పాల్పడిన ఆటో డ్రైవర్ ఇరుపిల్లి సాయికుమార్ (29)ను పోలీసులు రిమాండ్‌కు తరలించారు. స్థానికంగా ఉన్న ఒక కాలనీలో నివశిస్తున్న సాయి కుమార్ మద్యం మత్తులో శనివారం రాత్రి పద మూడేళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడిన విషయం తెలిసిందే. పోలీసులు నిందితుడ్ని అదుపులోకి తీసుకుని విచారించారు. అనంతరం కోర్టులో హాజరుపరచగా జడ్జి రిమాండ్ విధించారు. సీఐ తిరుమలరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సంపత్ వినాయగర్ హుండీ లెక్కింపు

18 రోజులకు రూ.11,22,766 ఆదాయం


హుండీ ఆదాయం లెక్కిస్తున్న దృశ్యం

సిరిపురం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): సంపత్ వినాయగర్ దేవాలయంలో హుండీలను సోమవారం లెక్కించారు. గడిచిన 18 రోజులకు రూ.11,22,766 ఆదాయం సమకూరినట్టు ఆలయ ఈవో డీవీవీ ప్రసాదరావు, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ టి.ఆర్.చోళన్ తెలిపారు. బంగారం 000-017-220 గ్రాములు, వెండి 000.004.200 గ్రాములు వచ్చాయన్నారు. యూఎస్ డాలర్స్ 116, సౌదీ రియల్స్ 10, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ 30 లభించాయని తెలిపారు. దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రీధర్ పర్యవేక్షించగా శ్రీ వెంకటేశ్వరసేవా సంఘం సభ్యులు, ఆలయ సిబ్బంది లెక్కించారని తెలిపారు. వీఆర్‌ఓ ఎల్.కృష్ణచైతన్య, దేవాలయ సిబ్బంది జి.గోవిందరెడ్డి, బీఎన్ మూర్తి, డీఎస్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారని తెలిపారు.


మద్రిపాలెం సాయినగర్ కాలనీవాసులకు మట్టి గణపతి ప్రతిమలు అందజేస్తున్న ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, జనసేన ఇన్‌చార్జి ఉషాకిరణ్ తదితరులు


జీవీఎంసీ ఉద్యోగులకు మట్టి ప్రతిమ అందజేస్తున్న జోన్-4 జడ్సీ మల్లయ్యనాయుడు


అబిద్‌నగర్‌లో మట్టి గణపతులను అందిస్తున్న ఉషోదయ చారిటబుల్ ట్రస్ట్ కన్వీనర్ నవ్య తదితరులు

మట్టి వినాయక ప్రతిమలనే పూజిద్దాం

మద్రిపాలెం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ మట్టి వినాయకుని ప్రతిమలను పూజించి పర్యావరణాన్ని పరిరక్షించాలని ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు పిలుపునిచ్చారు. సోమవారం 53వ వార్డు పరిధి సాయినగర్ కాలనీవాసులు, జనసేన నాయకుడు నీరుకొండ దివాకర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, జనసేన ఉత్తర నియోజకవర్గ కన్వీనర్ పసుపులేటి ఉషాకిరణ్ పాల్గొని భక్తులకు ప్రతిమలను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు తమవంతు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో 53, 54 వార్డుల జనసేన అధ్యక్షులు తాటిపాకల మాణిక్యాలరావు, వింజుమూరి భాస్కరరావు, సాయినగర్‌కాలనీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

మహారాణిపేట: జీవీఎంసీ జోన్-4 ఉద్యోగులకు జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడు ఉచితంగా మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. సూర్యాబాగ్‌లోని జోన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మట్టితో తయారు చేసిన ప్రతిమలతో పండుగ జరుపుకోవటం వినాయకుడిపైనే కాకుండా ప్రకృతి పట్ల నిజమైన భకి ప్రతిబింబిస్తుందని

▸ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు పిలుపు

అన్నారు. అందరూ పర్యావరణ అనుకూల పద్ధతులు పాటించాలని పిలుపునిచ్చారు. ఉద్యోగులు బి.వి.అశోక్‌కుమార్, బి.వి.బంగారు రాజు, వార్డు పరిపాలన కార్యదర్శుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.జె.గణేష్‌కుమార్, ఎం.రమేష్ రెడ్డి, పూర్ణిమా తదితరులు పాల్గొన్నారు.

అక్కయ్యపాలెం: ఉషోదయ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం అబిద్‌నగర్‌లో మట్టి వినాయక విగ్రహాలను ట్రస్ట్ కన్వీనర్ కొయిలాడ నవ్య పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ పీవోపీ, రసాయనాలతో తయారు చేసిన వినాయక విగ్రహాలను కాకుండా కేవలం మట్టితో రూపొందించిన ప్రతిమలనే పూజించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్. భవాని, కె.సునీత, ఎ.మాధవి, ఆర్.దేవకి, ఆర్.మృదుభాషిణి పాల్గొన్నారు.

సాయి ధ్యానమందిరంలో......

వినాయక చవితి సందర్భంగా రైల్వే ఎగ్జిబిషన్ మైదానం ఎదురుగా ఉన్న షిర్డీ సాయిధ్యానమందిరం ఆధ్వర్యంలో స్వాతి ప్రమోటర్స్ అధినేత కృష్ణారెడ్డి భక్తులకు మట్టి విగ్రహాలు పంపిణీ చేశారు. సంస్థ ఏజీఎం సంతోష్


మురళీనగర్ వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో...

కుమార్, ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు నూకల శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

మాధవధార: మురళీనగర్ వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం విఘ్నేశ్వరుని మట్టి ప్రతిమల్ని స్థానికులకు అందజేశారు. జి.చక్రధర్ ఆర్థిక సాయంతో 500 ప్రతిమలు, పూజా వ్రతకల్పం పుస్తకాల్ని క్లబ్ ఆవరణలో భక్తులకు అందజేశారు. పర్యావరణ పరిరక్షణకు సహకరించే ప్రతిమల్ని ఏటా స్థానికులకు అందించడం ఆనవాయితీగా పాటిస్తున్నామని క్లబ్ అధ్యక్షుడు ఎస్.భానుప్రకాష్ తెలిపారు. క్లబ్ కార్యవర్గం, దాతలు, పూర్వ కమిటీ సభ్యులు ఏటా ఈ కార్యక్రమం నిర్వహణకు కలసికట్టుగా తమ మద్దతు అందిస్తున్నారని అన్నారు. వాకర్స్‌క్లబ్ వ్యవస్థాపకుడు ఎన్.బుచ్చయ్య, క్లబ్ కార్యదర్శి సిహెచ్.ఎస్ఎస్‌వి.ప్రసాదరావు హాజరయ్యారు.

మండపాల నిర్వాహకులు నిబంధనలు పాటించాలి


సీఐ డి.వెంకటరమణ

సీతంపేట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవ నిర్వాహకులు నగర పోలీసు కమిషనర్ చేసిన సూచనలు, నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, లేకుంటే అనుమతులు ఇవ్వబోమని ద్వారకా పోలీసు స్టేషన్ సీఐ డి.వెంకటరమణ స్పష్టంచేశారు. మండపాల్లో విద్యుత్ కనెక్షన్లు సరిగా తీసుకోవాలని, ఊరేగింపులు, నిమజ్జన స్థలాల్లో సరైన బారికేడింగ్, లైటింగ్, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్, సీసీ కెమెరాలు, జనరేటర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. అధికారికంగా గుర్తించిన ప్రదేశాల్లో మాత్రమే విగ్రహాల నిమజ్జనం జరపాలన్నారు. మండపాల్లో పేలుడు పదార్థాలు ఉంచకూడదని, నూనెదీపాలు వెలిగించేటప్పుడు అత్యంత జాగ్రత్త వహించాలన్నారు. సమీపంలో నీరు, ఇసుక తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలని సూచించారు. మైకుల వినియోగంలో పీసీబీ పరిమితులను అతిక్రమించరాదన్నారు, రాత్రి 10 నుంచి ఉదయం 6 గంటల వరకు మైకుల వినియోగం నిషేధమన్నారు. ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా సంబరాలు జరుపుకోవాలని, బలవంతంగా విరాళాలు వసూలు చేయడం, లక్కీ డిప్స్, లాటరీలు నిషేధమని సీఐ వెంకటరమణ సూచించారు.

రేపటి నుంచి బనారస్ ఎక్స్‌ప్రెస్ తాత్కాలిక రద్దు

విశాఖపట్నం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఆగ్నేయ రైల్వే జోన్ పరిధిలో నాన్ ఇంటర్‌లాకింగ్ పనులు చేపడుతున్న నేపథ్యంలో విశాఖ-బనారస్ మధ్య నడుస్తున్న ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఈ నెల 27 నుంచి కొద్ది రోజులు తాత్కాలికంగా రద్దు చేశామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ఈ నెల 27, 31, సెప్టెంబరు 9, 10 తేదీల్లో విశాఖ-బనారస్ ఎక్స్‌ప్రెస్ (18523), తిరుగు ప్రయాణంలో బనారస్-విశాఖ ఎక్స్‌ప్రెస్ (18524) ఈ నెల 28, సెప్టెంబరు 1, 8, 11 తేదీల్లో రద్దు చేశామని పేర్కొన్నారు.

ఐటీఐ ప్రవేశాల దరఖాస్తు గడువు ముగింపు నేడు

కంచరపాలెం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ/ప్రైవేటు ఐటీఐల్లో మూడో విడత ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి మంగళవారం సాయంత్రం 5 గంటలతో గడువు ముగుస్తుందని ఐటీఐల జిల్లా కన్వీనర్ జె.శ్రీకాంత్ పేర్కొన్నారు. అభ్యర్థులు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో సమర్పించాలని సూచించారు. మొదటి, రెండు విడతల్లో మిగిలిపోయిన సీట్లకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకుంటేనే కౌన్సెలింగ్‌కు అనుమతిస్తామన్నారు. ప్రభుత్వ పాత ఐటీఐలో పలు ట్రేడుల్లో మిగిలిన సీట్లకు తక్కువగా దరఖాస్తులు అందాయన్నారు. అభ్యర్థి ఏ ఐటీఐలో చేరదలచుకుంటే సదరు ఐటీఐకు మాత్రమే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. వారు సమీపంలో గల ప్రభుత్వ ఐటీఐలో ధ్రువపత్రాలు పరిశీలన చేయించుకోవాల్సి ఉంటుంది. ఈ నెల 29న ఉదయం 10 గంటలకు కౌన్సెలింగ్ చేపట్టి సీట్లు భర్తీ చేస్తామన్నారు.

మహారాణిపేట సీఐగా దివాకర్

విశాఖపట్నం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మహారాణిపేట పోలీస్‌స్టేషన్ సీఐగా దివాకర్ యాదవ్‌ను నియమిస్తూ సీపీ శంఖబ్రత బాగ్చి సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. దివాకర్ యాదవ్ మెరైన్ విభాగం నుంచి ఇటీవలే నగర పోలీస్ కమిషనరేట్‌కు బదిలీపై వచ్చారు. మహారాణిపేట సీఐగా పనిచేస్తున్న బి.భాస్కరరావును సీటీవీఆర్-1కి బదిలీ చేశారు.

వరల్డ్ ట్రాన్స్‌ప్లాంట్ క్రీడల్లో రాణిస్తున్న రమణయ్య


టెన్నిస్ పోటీలో పాల్గొన్న రమణయ్య

విశాఖపట్నం స్పోర్ట్సు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): జర్మనీలో జరుగుతున్న వరల్డ్ ట్రాన్స్‌ప్లాంట్ క్రీడల్లో భారత్ నుంచి ప్రాతినిధ్యం వహించిన నగరానికి చెందిన రమణయ్య అద్భుతంగా రాణిస్తున్నారు. సోమవారం జరిగిన పురుషుల 60 ప్లస్ ఏజ్ గ్రూప్ టెన్నిస్ టోర్నీలో పాల్గొని సింగిల్స్ విభాగంలో క్వార్టర్ ఫైనల్స్‌కు చేరగా, డబుల్స్ విభాగంలో జర్మనీకి చెందిన ప్లేయర్‌తో జతగా ఆడి ప్రతిభ ప్రదర్శించి క్వార్టర్ ఫైనల్స్‌కు చేరారు. ప్రత్యర్థుల నుంచి గట్టిపోటీ ఎదురవుతున్నా నైపుణ్య ప్రదర్శనతో ముందుకు సాగుతున్నారు. టెన్నిస్ క్రీడాంశంలోనే కాకుండా వాలీబాల్ పోటీల్లో పాల్గొని సత్తా నిరూపించుకోవడం విశేషం. వాలీబాల్ టోర్నీలో క్వార్టర్ ఫైనల్స్‌లో ఇటలీపై అనూహ్య ఓటమి చెందింది.

నేడు టీడీపీ పార్లమెంటరీ కమిటీపై అభిప్రాయసేకరణ

విశాఖపట్నం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గం కమిటీ నియామకంపై మంగళవారం అభిప్రాయసేకరణ చేపట్టనున్నారు. అధిష్ఠానం నియమించిన ముగ్గురు సభ్యులు నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, కుడిపూడి సత్తిబాబు పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించనున్నారు. కొత్త కమిటీ ఎంపికకు అభిప్రాయసేకరణ నేపథ్యంలో ఎమ్మెల్యేలతో మంగళవారం ఎంపీ శ్రీభరత్ తొలుత చర్చించనున్నారు. ఆ తరువాత ఏడు నియోజకర్గ నాయకులు, ముఖ్యనేతల నుంచి ముగ్గురు సభ్యులు అభిప్రాయాలు తీసుకుని అధినేతకు నివేదిక అందిస్తారు.

పోలీసు కమిషనరేట్‌కు 115 ఫిర్యాదులు

మహారాణిపేట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పోలీసు కమిషనరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 115 ఫిర్యాదులు వచ్చాయి. సోమవారం నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి బాధితుల ను ంచి స్వయంగా ఫిర్యాదులు స్వీకరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత పోలీసు స్టేషన్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతూ తమకు అందిన ఫిర్యాదులపై చట్టప్రకారం చర్యలు తీసుకొని సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు


అభివృద్ధి పనులకు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, మేయర్ పీలా తదితరులు

కంచరపాలెం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 55వ వార్డు పరిధి ధర్మానగర్, జోగారావు నగర్‌లలో పలు అభివృద్ధి పనులకు ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు నగర మేయర్ పీలా శ్రీనివాసరావుతో కలిసి సోమవారం శంకుస్థాపన చేశారు. ఆయా ప్రాంతాల్లో మూడు పార్కుల నిర్మాణం, అభివృద్ధి, సామాజిక భవనాల నిర్మాణం కోసం రూ.1.3 కోట్లతో పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపట్టామన్నారు. పేదలకు మరిన్ని సౌకర్యాలు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. అన్ని వార్డుల్లో పార్కులు, డ్రైన్లు, సామాజిక భవనాల నిర్మాణం, రోడ్లు ఏర్పాటు తదితర పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ శశికళ, శ్యామలాదీపిక, కణితి విజయలక్ష్మి, ఈతలపాక సుజాత, జడ్సీ రాము, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

అల్లిపురంలో సీసీ కాలువల పనులకు శ్రీకారం


శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ కందుల నాగరాజు, జడ్సీ మల్లయ్యనాయుడు

అల్లిపురం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): అల్లిపురం దేవాంగుల వీధిలో సుమారు రూ.11 లక్షలతో సీసీ కాలువల నిర్మాణ పనులను సోమవారం కార్పొరేటర్ కందుల నాగరాజు ప్రారంభించారు. దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ సహకారంతో వార్డులో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు, ఈఈ కేజీఎస్ నర్సింగరావు, కూటమి నాయకులు కందుల కృష్ణ, మంత్రి శాలివాహన, కుందుల బద్రీ, కేదార్‌నాథ్ పాల్గొన్నారు.

30, 31 తేదీల్లో అంతర్జాతీయ ఫిడే రేటింగ్ చెస్ టోర్నీ

విశాఖపట్నం స్పోర్ట్సు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఆలిండియా చెస్ ఫెడరేషన్ నేతృత్వంలో ఆంధ్ర చెస్ సంఘం నిర్వహించనున్న అంతర్జాతీయ ఫిడే రేటింగ్ ర్యాపిడ్, బ్లిట్జ్ ఓపెన్ చెస్ టోర్నీ ఈ నెల 30, 31 తేదీల్లో జరగనుంది. వాల్తేరు క్లబ్ వేదికగా జరగనున్న ఈ టోర్నీలో పాల్గొనేవారికి తప్పనిసరిగా ఆలిండియా చెస్ ఫెడరేషన్ గుర్తింపు కార్డు ఉండాలని ఆల్ విశాఖ చెస్ సంఘం కార్యదర్శి మణికంఠరావు స్పష్టం చేశారు. అన్ని వయసుల క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించవచ్చని, అయితే ఈ టోర్నీలో ప్రాతినిధ్యం వహించిన 15 ఏళ్ల వారందరికీ పతకాలతోపాటు ఇ-సర్టిఫికెట్లు లభిస్తాయని పేర్కొన్నారు. విజేతలకు రూ.2 లక్షల వరకు నగదు బహుమతులు అందజేస్తామని, రేటింగ్ మెరుగుపడేందుకు దోహదపడుతుందన్నారు.

జిల్లాలో నేత్రదాన పక్షోత్సవాలు ప్రారంభం


నేత్రదాన పక్షోత్సవాల ప్రారంభ కార్యక్రమానికి జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు

సీతంపేట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): నేత్రదానం చాలా గొప్ప విషయమని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా 40వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలను సోమవారం ఆయన ప్రారంభించారు. సెప్టెంబరు 8 వరకు జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో కార్యక్రమాలు నిర్వహిస్తూ నేత్రదానాన్ని ప్రోత్సహిస్తుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ పి.జగదీశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడుతూ నేత్రదానంపై ప్రజల్లో ఉన్న అపోహలు తొలగించడానికి జిల్లా అంధత్వ నివారణ సంస్థ కృషిచేస్తోందన్నారు. ప్రాంతీయ నేత్ర వైద్యశాల సూపరింటెండెంట్, జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ డాక్టర్ పి.మీనాక్షి మాట్లాడుతూ వివిధ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జ్యోతిర్మయి, డాక్టర్ ఏవీ రమణ, డాక్టర్ మాధవి, ఆర్ఎంవో నవీన్‌కుమార్, పోస్ట్ గ్రాడ్యుయేట్‌లు, పారా మెడికల్ ఆప్తాల్మిక్ అధికారులు ఉమా శ్రీనివాస్, ఆర్.సురేష్, నేత్రదాన కౌన్సిలర్లు పూర్ణిమ, సుజాత, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

వార్డులలో సందడిగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ


స్మార్ట్ రేషన్‌కార్డులు అందజేస్తున్న కార్పొరేటర్ శ్రావణి


ఐటీఐ జంక్షన్ వద్ద కార్డులు అందజేస్తున్న కూటమి నాయకులు


జ్ఞానాపురంలో టీడీపీ నేత మధుబాబు తదితరులు

సీతమ్మధార, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): సీతమ్మధార బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో గల బీజేపీ కార్యాలయంలో పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు నూతన స్మార్ట్ రేషన్ కార్డులను సోమవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకురాలు శ్యామల దీపిక, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎండి నజీర్, కూటమి పార్టీల వార్డు అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

జ్ఞానాపురం: స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని జీవీఎంసీ 41వ వార్డు పరిధిలో సోమవారం ప్రారంభించారు. టీడీపీ వార్డు అధ్యక్షుడు ఐతి మధుబాబు కార్డుదారులకు వీటిని అందజేశారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సంక్షేమాన్ని ప్రజల ముంగిటకే తీసుకువస్తుందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, యువతకు ఇంటి నుంచే ఉపాధి కల్పించే కౌశల్యం కార్యక్రమం ప్రారంభించారని, ఇప్పుడు సాంకేతికతను ఉపయోగించి రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్నారన్నారు. వీఆర్‌ఓ నజీర్, కార్యదర్శులు నారాయణరావు, యశస్విని, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

అక్కయ్యపాలెం: గ్రేటర్ 26వ వార్డు 129వ నెంబరు సచివాలయం పరిధిలో స్మార్ట్ రేషన్ కార్డులను కార్పొరేటర్ ముక్కా శ్రావణి, వార్డు టీడీపీ అధ్యక్షుడు ముక్కా కిశోర్‌కుమార్‌లు సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఏటీఎం కార్డుల మాదిరి స్మార్ట్ రేషన్ కార్డులను రూపొందించిందన్నారు. గ్రేటర్ 44వ వార్డులోని సచివాలయాల్లో స్మార్ట్ రేషన్ కార్డులను బీజేపీ వార్డు అధ్యక్షురాలు మళ్ల లక్ష్మి పంపిణీ చేశారు. సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

కంచరపాలెం: రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా రూపొందించిన రేషన్ కార్డులను జీవీఎంసీ 54, 57 వార్డుల్లో కూటమి నాయకులు సోమవారం పంపిణీ చేశారు. ఐటీఐ జంక్షన్ వద్ద గల 52వ డిపో, సుభాష్ నగర్ 61వ డిపోల వద్ద కూటమి నాయకులు పాల్గొని నూతన స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఏటీఎం కార్డు మాదిరి సులభంగా ఉండడంతో కార్డుదారులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు పెంటకోట అజయ్‌బాబు, గిరి రాజు, జనసేన నాయకులు రాము, గౌరీ, బీజేపీ నాయకులు మహేంద్ర, రమణ, డీలర్లు గోపి, రమణ, నాగుల అప్పలరాజు పాల్గొన్నారు.

దుమ్మురేగుతున్న రోడ్లతో ప్రయాణ ఇబ్బందులు


మాధవధార ఉడాకాలనీ దారిలో పేరుకుపోయిన మట్టి

మాధవధార, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 51వవార్డు మాధవధార ఉడాకాలనీ నివాసిత ప్రాంతంలో రోడ్లు సిమెంట్ క్రషర్, మట్టితో దుమ్మురేగుతోంది. ఇటీవల కురిసిన వర్షాలకు కొండ ప్రాంతాల నుంచి, నిర్మాణ భవనాల నుంచి సిమెంట్ క్రషర్, ఇసుక వీధుల్లో మేటలు వేసింది. కాలనీ అనుసంధాన మార్గాలన్నీ దాదాపు నిర్మాణ వ్యర్థాలతో పేరుకుపోవడంతో ప్రయాణ ఇబ్బందులు తప్పడం లేదు. వాహనదారులు, పాదచారులు జారి పడుతున్నారు. రోడ్డు మలుపుల్లో మట్టి అంగుళం మేర పేరుకుపోయింది. మాధవధార ఉడాకాలనీ ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా రోడ్లన్నీ నిర్మాణ సామగ్రితో నింపేస్తుండటంతో సమస్యగా మారిందని స్థానికులు వాపోతున్నారు. సచివాలయ సిబ్బంది నుంచి శానిటరీ అధికారులకు ఎన్నిమార్లు ఫిర్యాదు చేస్తున్నా ఫలితం కానరావడం లేదని మాధవధార ఉడాకాలనీ నివాసితులు వాపోతున్నారు. చర్యలు చేపట్టి రోడ్డు మార్గాల్ని సురక్షితంగా తీర్చిదిద్దాలని కోరుతున్నారు.

వీఆర్ఎస్ ఉద్యోగులకు ఆర్ఎంహెచ్‌పీ డ్యూటీ

... 5వ పేజీ తరువాయి

చేయాలి. వీరిలో 90 శాతం మందికి రెండు రోజుల క్రితం వీఆర్ఎస్ ఆమోదించారు. ఈ నోటీసులు ఇచ్చిన నెల రోజుల్లో వారికి సెటిల్‌మెంట్ చేసి ఇంటికి పంపించాల్సి ఉంది. ఇప్పుడు ఆర్ఎంహెచ్‌పీ డ్యూటీ వేయడం వల్ల వారికి సెలవు కూడా దొరకని పరిస్థితి ఏర్పడింది. వీరంతా నెల రోజుల తరువాత వెళ్లిపోతారని, అప్పుడు ఎవరితో పనిచేయిస్తారని ఉద్యోగ వర్గాలు ప్రశ్నిస్తున్నాయి. సిబ్బంది ఎక్కువ ఉన్నారని వందల సంఖ్యలో తొలగించడం, సమస్య వచ్చిందని కింద మీద పడడం ఏ రకమైన యాజమాన్య విధానమని కార్మికులు నిలదీస్తున్నారు.

రౌడీషీటర్లపై డేగ కన్ను

... 5వ పేజీ తరువాయి

కొట్లాటలు జరిగే అవకాశాలున్నట్టు భావించిన సీపీ అప్రమత్తమయ్యారు. క్రియాశీలకంగా ఉన్న రౌడీషీటర్లను గుర్తించి, వారిపై నిఘా పెంచాలని సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులకు సూచించారు. ప్రతి స్టేషన్ పరిధిలోనూ యాక్టివ్‌గా ఉండే రౌడీషీటర్ల జాబితా సిద్ధం చేసుకుని, వారి ఇళ్లలో ఆకస్మిక సోదాలు చేపట్టాలని ఆదేశించారు. ఈ మేరకు ఇటీవల భీమిలి పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్ల ఇళ్లలో పోలీసులు సోదాలు చేయగా ఒక రౌడీషీటర్ ఇంట్లో రెండు కత్తులు లభ్యమయ్యాయి. దీంతో అతడిని అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. వినాయక చవితి ఉత్సవాలు ముగిసేవరకు రౌడీషీటర్లపై ప్రత్యేక దృష్టిపెట్టాలని, దీనివల్ల శాంతిభద్రతల సమస్య తలెత్తదని సీపీ ఆదేశించినట్టు తెలిసింది. పోలీసుల తాజా వ్యూహంతో నగరంలో యాక్టివ్‌గా ఉండే రౌడీషీటర్లలో గుబులు మొదలైంది.

బార్‌లకు స్పందన నిల్

... 5వ పేజీ తరువాయి

గడువు ఇచ్చింది. అయితే జిల్లాలో ఇప్పటివరకు 17 బార్లకు 51 దరఖాస్తులు మాత్రమే రావడంతో అధికారులు అవాక్కయ్యారు. మంగళవారంతో గడువు ముగియనుంది. చివరిరోజు భారీగా దరఖాస్తులు వస్తాయనే ఆశాభావంతో ఉన్నారు. బార్‌ల నిర్వహణ లాభసాటిగా లేకపోవడంతో వ్యాపారులు ఆసక్తిచూపడం లేదని అధికారులు చెబుతున్నారు. బార్‌లకు లైసెన్స్ ఫీజు గతంతో పోల్చితే తగ్గించినప్పటికీ మద్యం దుకాణాల కంటే తక్కువ మార్జిన్ ఇస్తుండడం, నిర్వహణ ఖర్చులు తడిసిమోపెడవుతుండడంతో చాలా మంది బార్‌లను వదలుకునేందుకు సిద్ధపడుతున్నారని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

చెరువులనే రాసిచ్చేస్తారా!?

... 5వ పేజీ తరువాయి

సామూహిక ఆస్తిగా ఉన్న చెరువునకు తహశీల్దారు నిబంధనలను అతిక్రమించి ఖాతా నెంబరు 1249 ద్వారా 5.30 ఎకరాల విస్తీర్ణానికి పోలిశెట్టి శ్రీనివాస్‌కు అనుకూలంగా పట్టాదారు పాస్‌పుస్తకం జారీ చేశారని నివేదికలో పేర్కొన్నారు. ఎఫ్ఎంబీ రికార్డుల ప్రకారం వంద సంవత్సరాల నుంచి ఈ చెరువు సాగుభూములకు నీటిని అందిస్తోందని, 20 ఏళ్లుగా ఉపాధి హామీ పథకం నిధులతో చెరువు అభివృద్ధి పనులు చేపడుతున్నట్టు విచారణలో తేలింది. అలాగే పొట్నూరు గ్రామంలోని సర్వే నంబరు 107లో ఉన్న సాగునీటి చెరువుకు ఖాతా నంబరు 5698 ద్వారా 10 ఎకరాల విస్తీర్ణానికి మంచుకొండ వెంకట జగన్నాథం అనే వ్యక్తికి పట్టాదారు పాస్‌పుస్తకం జారీ చేశారు. ఇక్కడ కూడా తహశీల్దారు ఇనాం రద్దు చట్టం-1964ను పరిగణనలోకి తీసుకోలేదు. దీంతో కలెక్టర్ తదుపరి చర్యల నిమిత్తం ప్రభుత్వానికి నివేదిక పంపించారు. ఇందులో లోకేశ్వరరావు తన అధికారాలను దుర్వినియోగం చేశారని, చట్టబద్ధమైన విధులు నిర్వర్తించడంలో విఫలమయ్యారని, ప్రజా సేవకుడికి తగని విధంగా, ప్రతిష్ఠకు భంగం కలిగించే విధంగా వ్యవహరించారని, ఏపీ పౌర సేవల (ప్రవర్తన) నియమావళిని ఉల్లంఘించారని గుర్తించారు. లోకేశ్వరరావు ఇచ్చే లిఖితపూర్వక వివరణ మేరకు క్రమశిక్షణ చర్యలు తీసుకోవడానికి ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది.

నగరంపాలెంలో చెరువు కబ్జా!

... 5వ పేజీ తరువాయి

కొంత వరకూ ఆగేవారు. కానీ చెరువు ఎందుకు పనికిరాదని అధికారులు భావించారేమో దాని రక్షణకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. దీంతో కూటమి పార్టీలకు చెందిన నేతల అండదండలతో కబ్జాదారులు చెరువులో కల్యాణ మండపం నిర్మిస్తామని కొత్త ప్రతిపాదన తీసుకువచ్చారు. చెరువులో కల్యాణ మండపం నిర్మాణానికి అనుమతులు ఎలా ఇస్తారు?...అన్నది పట్టించుకోకుండా ఇటీవల రాత్రిపూట చెరువును పూర్తిగా పూడ్చే పనిచేస్తున్నారు. ఇప్పటికే మధురవాడ ప్రాంతంలో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. వర్షాకాలంలోనే బోర్లు ఎండిపోతున్నాయి. భూగర్భ జలాలు పెంచేందుకు దోహదం చేసే చెరువులు కబ్జాకు గురవుతున్నా అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పట్టించుకోకపోవడం గమనార్హం. దీనిపై మధురవాడ రెవెళ్లపాలేనికి చెందిన సంతోష్‌కుమార్ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి చెరువును కాపాడాలని కోరారు.

ఉక్కులో ఆర్ఎంహెచ్‌పీ అస్తవ్యస్తం

... 5వ పేజీ తరువాయి

పనిచేసే వారికి వ్యక్తిగత భద్రతా పరికరాలు (పీపీఈలు) ఇవ్వాలని, ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది.

అక్కడ ఏమి జరుగుతున్నదంటే...?

ఆర్ఎంహెచ్‌పీకి గూడ్సు రైళ్ల (ర్యాక్‌లు) ద్వారా ఐరన్‌ఓర్, బొగ్గు, లైమ్ స్టోన్ వంటివి వస్తాయి. వాటిని 'ట్రిప్లింగ్' విధానంలో అన్‌లోడింగ్ చేయాలి. వచ్చిన ర్యాక్‌లను ఎనిమిది గంటల్లో ఖాళీ చేసి వెనక్కి పంపాలి. అంతకు మించి ర్యాక్‌లు ఉండిపోతే వాటికి రైల్వే డెమరేజ్ చార్జీలు వసూలు చేస్తుంది. కొత్తగా వచ్చిన కాంట్రాక్ట్ వర్కర్లు ట్రిప్లింగ్ చేయలేకపోతున్నారు. దాంతో వ్యాగన్ల నుంచి సరుకును మాన్యువల్‌గా అన్‌లోడింగ్ చేస్తున్నారు. మనుషులతో అన్‌లోడింగ్ చేయించడం వల్ల ఒక్కో ర్యాక్ 30 నుంచి 40 గంటలు అక్కడే ఉండిపోతోంది. దాంతో రైల్వేకు డెమరేజ్ కింద నెలకు రూ.15 కోట్లు వరకు కడుతున్నారు. అంటే సరకును దించడానికి నెలకు అదనంగా రూ.కోట్లు వెచ్చిస్తున్నారు. ఇంత చేసినా ముడిపదార్థాలు ఆయా విభాగాలకు అందడం లేదు. కన్వేయర్ల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ఆ పనులు కూడా వారు చేయలేకపోతున్నారు. ఎస్ఎంఎస్ విభాగానికి లైమ్ స్టోన్ సరఫరా ఆగిపోయిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఆ పనులు కూడా చేయడానికి నైపుణ్యం కలిగిన సిబ్బందిని పంపాలని సీఎండీ ఆదేశించారు. చక్కగా పనిచేస్తున్న వారిని అడ్డగోలుగా తొలగించారు. ఇప్పుడు ఉత్పత్తి సాధించలేక చతికిల పడ్డారు. యుద్ధ ప్రాతిపదికన తరలించే ఉద్యోగులను ఎన్నాళ్లు అక్కడ డిప్యుటేషన్‌పై పనిచేయిస్తారు. ఇంకెంత కాలం 12 గంటలు డ్యూటీ చేయిస్తారో యాజమాన్యం ఇప్పుడైనా స్పష్టత ఇవ్వాల్సి ఉంది. దీనిపై స్థానిక ప్రజా ప్రతినిధులు కూడా సీఎండీని ప్రశ్నించాల్సిన అవసరం ఉంది.



తీర ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సౌత్ ఏసీపీ శ్రీనివాసరావు, తదితరులు

అప్పికొండ సముద్ర తీరాన్ని పరిశీలించిన సౌత్ ఏసీపీ

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవాల తరువాత విగ్రహాలను నిమజ్జనం చేయనున్న అప్పికొండ సముద్ర తీర ప్రాంతాలను సౌత్ ఏసీపీ వై.శ్రీనివాసరావు సోమవారం దువ్వాడ సీఐ మల్లేశ్వరరావుతో కలిసి పరిశీలించారు. వినాయక నిమజ్జనం ప్రాంతాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. నిమజ్జనాల సమయంలో తీరంలో గజ ఈతగాళ్లను ఏర్పాటు చేస్తామని, వివిధ ప్రాంతాల నుంచి నిమజ్జనాలకు విచ్చేసే ఉత్సవ నిర్వాహకులు కూడా తగిన జాగ్రత్తలను పాటించాలన్నారు. ఈ నేపథ్యంలో తీరం వద్ద ప్రత్యేక గస్తీని ఏర్పాటు చేస్తున్నామని, కొన్ని ప్రత్యేక రోజుల్లో అదనపు సిబ్బందిని ఇక్కడ నియమిస్తామని ఏసీపీ తెలిపారు.

మతిస్థిమితం లేని యువతి తల్లిదండ్రులకు అప్పగింత

కూర్మన్నపాలెం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి తప్పిపోయిన మతిస్థిమితం లేని యువతి ఆచూకీని కేవలం ఐదు గంటల్లో కనుగొని తల్లిదండ్రుల చెంతకు చేర్చామని దువ్వాడ సీఐ కె.మల్లేశ్వరరావు తెలిపారు. 86వ వార్డు రాజీవ్‌నగర్‌కు చెందిన వడ్డే అరుణ కుమారి (19) అనే యువతి ఈ నెల 23వ తేదీ రాత్రి ఇంటి నుంచి తప్పిపోయిందంటూ ఆమె తల్లిదండ్రులు తమకు ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు సిబ్బందిని మూడు బృందాలుగా ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చర్యలు చేపట్టి ఐదు గంటల్లో అరుణకుమారిని పట్టుకుని తల్లిదండ్రులకు అప్పగించామని పేర్కొన్నారు.

కిడ్నీ బాధితునికి ఆర్థిక సాయం

గాజువాక, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న 86వ వార్డు రాసాలమ్మ కాలనీకి చెందిన పైల యశ్వంత్‌కు గాజువాక లయన్స్‌క్లబ్ ప్రతినిధులు ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు చేతుల మీదుగా సోమవారం ఆర్థిక సాయం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వ్యాధిగ్రస్తునికి ఆర్థిక సహాయం చేయడం మంచి విషయమన్నారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు నల్లూరు సూర్యనారాయణ, నాయకులు రమేశ్, జగదీష్, గణపతి, తదితరులు పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరం

పెదగంట్యాడ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వ విద్యాలయం కొత్త గాజువాక శాఖ ఆధ్వర్యంలో సోమవారం మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సాగిన కార్యక్రమంలో పలువురు యువత రక్తదానం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరాజు, గాజువాక వర్తక సంఘం అధ్యక్షుడు తిప్పల నితీశ్ రెడ్డి, 'బ్రహ్మకుమారీస్' కొత్త గాజువాక శాఖ ఇన్‌చార్జి బీకే మణి, సభ్యులు సింధు, భవానీ, ప్రమీల, అండిబోయిన లక్ష్మి ఇందు, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

● **వార్-2** : జగదాంబ, రమాదేవి, మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శ్రీకన్య, శరత్, కామేశ్వరి, లక్ష్మీనరసింహ-1, 2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నరసింహ (గోపాలపట్నం), కన్య, హెవెన్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
● **కూలీ** : సంగం, వెంకటేశ్వర-1, లీలామహల్, కిన్నెర, శారద, శ్రీరామా, గోకుల్, సౌజన్య (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ), లిఖిత (శ్రీహరిపురం),
● **సార్, మేడమ్** : మౌర్య (గోపాలపట్నం),
● **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక),


రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 24, టమాటా 44, వంకాయలు (తెలుపు) 32, వంకాయలు (నలుపు) 46, బెండకాయలు 40, పచ్చిమిర్చి 50, కాకరకాయలు 30, బీరకాయలు 48, ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 20, క్యారెట్ 40, దొండకాయలు 34, బంగాళ దుంపలు 18, అరటి కాయ (పె)10, మునక్కాడలు (కిలో) 46, అల్లం (పాతది) 74, బరబాటి 36, ముల్లంగి 32, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 50, దోస కాయలు 32, వెల్లుల్లి (పెద్దవి) 75, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 110, కీరదోస 32, కాప్సికమ్ 62, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 36, చిలగడ దుంపలు 50, కంద 40, దేముడు చిక్కుడు 70, గోరు చిక్కుడు 30, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	535
విజయనగరం	539
శ్రీకాకుళం	539

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	108
లైవ్ ధర	128
విత్ స్కిన్	222
స్కిన్‌లెస్	236

పెందుర్తి జోన్‌లో విలీనంపై మండిపాటు



అగనంపూడి వ్యూ..

- తీవ్రంగా వ్యతిరేకిస్తున్న 79, 85 వార్డుల ప్రజలు
- పాలనా సౌలభ్యం కోసం తమను ఇబ్బందులకు గురి చేస్తారా?
- ఈ అంశంపై జీవీఎంసీ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పునరాలోచించాలని డిమాండ్

అగనంపూడి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మహా విశాఖ నగర పాలక సంస్థ (జీవీఎంసీ) 79, 85 వార్డుల్లో విస్తరించి ఉన్న అగనంపూడి, లంకెలపాలెం, దేశపాత్రునిపాలెం ప్రాంతాలను పెందుర్తి జోన్‌లో విలీనం చేయడం సమంజసం కాదని స్థానికులు మండిపడుతున్నారు. అధికారుల పాలనా సౌలభ్యం పేరుతో నియోజకవర్గాల వారీగా జోన్లను ఏర్పాటు చేసి జీవీఎంసీ కౌన్సిల్లో తీర్మానం చేసి రాష్ట్ర ప్రభుత్వ ఆమోదానికి పంపిన సంగతి తెలిసిందే. దీంతో ప్రస్తుతం 8 జోన్లుగా ఉన్న జీవీఎంసీ పది జోన్లుగా మారనన్నది. ఈ క్రమంలో గాజువాక, పెందుర్తి నియోజకవర్గాల పరిధిలో విస్తరించివున్న 79, 85 వార్డులను పెందుర్తి జోన్‌లో విలీనం చేశారు. జోన్ల విస్తరణకు ప్రభుత్వ ఆమోదం లభిస్తే ఈ రెండు వార్డుల ప్రజలు వివిధ సేవల నిమిత్తం పెందుర్తిలో గల జోనల్ కార్యాలయానికి వెళ్లాల్సి ఉంటుంది. 79, 85 వార్డుల పరిధి 70 శాతం ఏరియా గాజువాకలో ఉండగా, కేవలం 30 శాతం మాత్రమే పెందుర్తి నియోజకవర్గ పరిధిలో ఉంది. లంకెలపాలెం, గంజిపేట, మంత్రిపాలెం, దేశపాత్రునిపాలెం ప్రాంతాల్లో సచివాలయాలు పెందుర్తి పరిధిలో, ప్రశాంతినగర్, కొండయ్యవలస, దిబ్బపాలెం, పెదమడక, చినమడక, బీసీ కాలనీ, ఫార్మాసిటీ కాలనీ ప్రాంతాల్లో గల సచివాలయాలు గాజువాక నియోజకవర్గంలో ఉన్నాయి. ప్రస్తుతం ఈ సచివాలయాలన్నీ గాజువాక జోనల్ కార్యాలయానికి 3 నుంచి 10 కిలోమీటర్ల దూరంలోనే ఉండడంతో ప్రజలకు ఎంతో సౌలభ్యంగా ఉంది. పెందుర్తి జోన్‌లో ఈ రెండు వార్డులను విలీనం చేస్తే 30 కిలోమీటర్ల దూరంలో గల పెందుర్తి జోనల్ కార్యాలయానికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంటుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. క్షేత్ర స్థాయిలో ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా పాలనా సౌలభ్యం పేరుతో అధికారులు తమ ప్రాంతాన్ని ఏ విధంగా పెందుర్తి జోన్‌లో విలీనం చేస్తారని ప్రశ్నిస్తున్నారు. నియోజవర్గాలుగా జోన్‌లను ఏర్పాటు చేస్తే గాజువాక పరిధిలో ఉన్న ప్రాంతాన్ని పెందుర్తి జోన్‌లోకి ఎలా మారుస్తారని పేర్కొంటున్నారు. అవగాహన లేమితో జోన్లను ఏర్పాటు చేయ డం తగదని మండిపడుతున్నారు. అందువల్ల జీవీఎంసీ ఉన్న తాధికారులు, ప్రజాప్రతినిధులు పునరాలోచించి ఈ ప్రాంతాన్ని గాజువాక జోన్‌లోనే ఉండేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

నిజ నిర్ధారణ కమిటీ వేయాలి

-రౌతు శ్రీనివాస్, 79 వార్డు కార్పొరేటర్



గాజువాక నియోజకవర్గ పరిధిలో ఉన్న ప్రాంతాలను పెందుర్తి జోన్‌లో విలీనం చేయడం తగదు. ఈ అంశాన్ని జీవీఎంసీ కౌన్సిల్‌లో వ్యతిరేకించాను. ఎలాంటి అభిప్రాయ సేకరణ లేకుండా అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. కొంతమంది అధికారులు తప్పుదోవ పట్టిస్తున్నారు. ఈ అంశంపై ఉన్నాతాధికారులు నిజ నిర్ధారణ కమిటీ వేయాలి. తప్పు చేసిన అధికారులను సస్పెండ్ చేయాలి.

ఇదేనా పాలనా సౌలభ్యం?

-బలిరెడ్డి నాగేశ్వరరావు, అగనంపూడి



అగనంపూడి ప్రాంతానికి పెందుర్తి నియోజకవర్గానికి ఎలాంటి సంబంధం లేకుండా పెందుర్తి జోన్‌లో ఏ విధంగా ఇక్కడి వార్డులను విలీనం చేస్తారు. ప్రస్తుతం పౌర సేవల కోసం కూతవేటు దూరంలో ఉన్న గాజువాక జోనల్ కార్యాలయానికి వెళుతున్నాం. ఈ ప్రాంతాన్ని పెందుర్తిలో విలీనం చేస్తే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడతారు. అందువల్ల అధికారులు పునరాలోచించాలి.

పలుచోట్ల స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



స్మార్ట్ రేషన్ కార్డులను చూపుతున్న నల్లూరు సూర్యనారాయణ, తదితరులు

కూర్మన్నపాలెం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజల సౌలభ్యం కోసం సాంకేతికత వినియోగంతో స్మార్ట్ రేషన్ కార్డులను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని టీడీపీ 86వ వార్డు అధ్యక్షుడు నల్లూరు సూర్యనారాయణ అన్నారు. వార్డులోని భరత్ నగర్, రాజీవ్ నగర్, వుడా నగర్ సచావాలయాల పరిధిలో సోమవారం ఆయన స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కాద శ్రీను, వేగుంట శ్రీనివాస్, రమేశ్, గణపతి, జగదీశ్, సుబ్బయ్య, నాగార్జున, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69 వార్డు పరిధిలోని తుంగ్లాం, నాతయ్యపాలెం సచివాలయాల్లో స్మార్ట్ రేషన్ కార్డులను ప్రజలకు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి పంపిణీ చేశారు. జనసేన వార్డు అధ్యక్షుడు సంద్రాన భాస్కర్, నాయకులు భాస్కర్, ఎస్.సాయి ప్రమీల, ఎస్.వరహాలరాజు, రాము, తదితరులు పాల్గొన్నారు. అలాగే 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం సచివాలయంలో కార్పొరేటర్ గుడివాడ అనూష స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేయగా, నాయకులు సంద్రాన నూకరాజు, ఎన్.సత్యవతి, పూడి శాంతి, తదితరులు పాల్గొన్నారు.

పెదగంట్యాడ: గ్రేటర్ 75వ వార్డులోని పలు రేషన్ డిపోల పరిధిలో గల లబ్ధిదారులకు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. కూటమి నాయకులు పులి వెంకటరమణారెడ్డి, కె.ముసలయ్య, ఎస్.శ్రీనివాసరావు, కె.అప్పలరాజు, డి.సోమునాయుడు, బి.అప్పలరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భారీ వాహనాల రాకపోకలకు అడ్డుకట్ట

- కాపుజగ్గరాజుపేట రోడ్డులో హైట్‌గేజ్ ఎత్తు తగ్గింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



హైట్‌గేజ్ ఎత్తును తగ్గిస్తున్న దృశ్యం

కూర్మన్నపాలెం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): భారీ వాహనాల నిషేధం ఉన్నప్పటికీ దువ్వాడ రైల్వే స్టేషన్ నుంచి కాపుజగ్గరాజుపేట రోడ్డులో ఇష్టానుసారంగా రాకపోకలు సాగిస్తుండడంతో కళాశాలల విద్యార్థులు, వీఎస్‌ఈజడ్, ఆటోనగర్‌లోని పలు పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్టు ఈ నెల 23న 'ఆంధ్రజ్యోతి'లో 'అసలే ఇరుకు రోడ్డు... పైగా భారీ వాహనాలు' శీర్షికతో కథనం ప్రచురితమవ్వడంతో ట్రాఫిక్ పోలీసులు స్పందించారు. ఈ మేరకు దువ్వాడ ట్రాఫిక్ సీఐ కె.వెంకటరావు, ఎస్ఐ ఎస్.లింగన్నదొర ఆ మార్గాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ జీవీఎంసీ పైప్‌లైన్ పనులు జరుగుతున్నందున రహదారిపై పైపులను గుట్టగా వేయడంతో ఇరుకుగా మారిందన్నారు. అలాగే భూగర్భ కేబుల్ పనులను మరో వారంలో పూర్తి చేసి గోతులను పూడుస్తామని ఏపీఎస్ఈబీ ఏడీఈ తెలిపారన్నారు. ముఖ్యంగా ఈ మార్గంలోకి భారీ వాహనాలు ప్రవేశించకుండా హైట్‌గేజ్ ఎత్తును తగ్గించినట్టు సీఐ పేర్కొన్నారు. రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ నియంత్రణకు పోలీసు సిబ్బందిని నియమిస్తామని తెలిపారు.

సాహువాలా సిలిండర్ల కంపెనీ వద్ద ఆందోళన

- బాధిత కుటుంబానికి న్యాయం చేయాలంటూ పకీరుతఖ్యా గ్రామస్తుల డిమాండ్

కూర్మన్నపాలెం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో గాయపడిన వ్యక్తిని గాలికొదిలి వేయడంతో సోమవారం పకీరుతఖ్యా గ్రామస్తులు సాహువాలా సిలిండర్ల కంపెనీ వద్ద ఆందోళన చేశారు. సోమవారం ఉదయం పకీరుతఖ్యాకు చెందిన మహిళలు, యువకులు అధిక సంఖ్యలో కంపెనీ వద్దకు చేరుకుని బైఠాయించారు. విధులకు కార్మికులెవరూ వెళ్లకుండా గేట్లు మూయించి అడ్డుకున్నారు. ఈ విషయం ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు దృష్టికి తీసుకు వెళ్లారు. ఆందోళనకారులకు టీడీపీ, జనసేన, వైసీపీ నాయకులు మద్దతు పలకడంతో స్థానికంగా కాసేపు ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకొంది. దువ్వాడ సీఐ కె. మల్లేశ్వరరావు, ఎస్ఐ శ్రీనివాసరావులు సిబ్బందితో అక్కడకు చేరుకుని ఇరువర్గాలతో చర్చలకు అవకాశం కల్పించారు. కాగా పకీరుతఖ్యాకు చెందిన రహమత్ అలీ (21) రెండు నెలలు క్రితం సాహువాలా కంపెనీలో సీలింగ్ పని చేస్తూ కింద పడిపోయాడు. దీంతో కాళ్లు, వెన్నుముఖ, పక్కటెముకలు విరిగిపోయాయి. అప్పట్లో సంస్థ యాజమాన్యం అలీ వైద్య ఖర్చుల భరిస్తామని హామీ ఇచ్చినా అది కార్యరూపం దాల్చకపోవడంతో ఆందోళనకు దిగారు. చర్చల్లో నాయకులు ఎం.కనకరాజు, శ్రీనివాసరావు, బి.శ్రీనివాసరాజు, తదితరులు సంస్థ యాజమాన్య ప్రతినిధులతో చర్చలు జరుపుతున్నారు.

పర్యావరణ హితం కోసం మట్టి వినాయక విగ్రహాలనే పూజించాలి

- 76వ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు
- పలు ప్రాంతాల్లో మట్టి గణేశుల ప్రతిమల పంపిణీ



గణేశుని విగ్రహాలను పంపిణీ చేస్తున్న గంధం శ్రీనివాసరావు

పెదగంట్యాడ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ కోసం అందరూ వినాయక చవితికి మట్టి విగ్రహాలనే పూజించాలని 76వ వార్డు కార్పొరేటర్, గ్రేటర్ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ గంధం శ్రీనివాసరావు కోరారు. ఇక్కడి టీడీపీ కార్యాలయ ఆవరణలో సోమవారం ఆయన ప్రజలకు మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు జిత్తుక రాజు, బి.కృష్ణప్రసాద్, బి.సత్యారావు, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు. బాలచెరువుకాలనీ జంక్షన్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరశురామరాజు మట్టి గణేశుల విగ్రహాలను పంపిణీ చేశారు. నాయకులు జీలకర్ర రమణ, రవిరాజు, భువనేశ్వరీదేవి, పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ హేమలత పాల్గొన్నారు.

అక్కిరెడ్డిపాలెం: ప్రజలందరూ మట్టి వినాయక ప్రతిమలను పూజించి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని 68వ వార్డు కార్పొరేటర్ గుడివాడ అనూష కోరారు. అక్కిరెడ్డిపాలెంలో ఆమె మట్టి వినాయక ప్రతిమలను ప్రజలకు పంపిణీ చేశారు. నాయకులు సంద్రాన నూకరాజు, జి.సత్యవతి, పి.శాంతి, ఎస్.లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

అగనంపూడి: పర్యావరణాన్ని కాపాడేందుకు అందరూ మట్టి వినాయకుడిని పూజించాలని షిర్డీ సాయి సేవా సమితి అధ్యక్షుడు కొయ్య వెంకటరమణారెడ్డి అన్నారు. దాతలు కృష్ణారెడ్డి, శారద సమకూర్చిన మట్టి వినాయక విగ్రహాలను ఆయన పంపిణీ చేశారు. సమితి ప్రతినిధులు వ్యాసశర్మ, రాజు, సత్యనారాయణ, సూరీడమ్మ, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌గా అవగడ్డ జ్యోతి ప్రమాణ స్వీకారం



మార్కెట్ కమిటీ చైర్మన్ అవగడ్డ జ్యోతికి అభినందనలు తెలుపుతున్న ఎంపీ భరత్

పెందుర్తి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా అవగడ్డ జ్యోతి అప్పలనాయుడు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఎంపీ భరత్, అనకాపల్లి ఎంపీ సీఎం.రమేశ్, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ కార్యక్రమానికి హాజరై మార్కెట్ కమిటీ చైర్మన్ జ్యోతి అప్పలనాయుడు దంతులకు అభినందనలు తెలిపి, సత్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో ఉండి రాజకీయంగా అపార అనుభవం ఉన్న అవగడ్డ కుటుంబానికి చెందిన మహిళకు చైర్మన్ పదవి దక్కడం సంతోషంగా ఉన్నదని అన్నారు. ఈ సందర్భంగా అవగడ్డ జ్యోతి ప్రసంగించారు. అంతకముందు అవగడ్డ జ్యోతి అప్పలనాయుడు పులగాలిపాలెం నుంచి పెందుర్తి మీదుగా ర్యాలీ నిర్వహించి సభాప్రాంగణానికి చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ పీలా శ్రీనివాసరావు, కార్పొరేటర్ సేనాపతి వసంత, మాజీ జడ్పీటీసీ రెడ్డి నారాయణరావు, బీజేపీ ఇన్‌చార్జి గొర్లె రామునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

జనసేన మార్కెట్ కమిటీ డైరెక్టర్లు గైరుహాజరు

మార్కెట్ కమిటీ చైర్మన్, పాలకవర్గ ప్రమాణ స్వీకారానికి జనసేనకు చెందిన మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు గొరపల్లి సోమునాయుడుతో పాటు ఆ పార్టీకి చెందిన ఆరుగురు కమిటీ డైరెక్టర్లు సభకు హాజరు కాలేదు.

నాటకం ద్వారా సీజనల్ వ్యాధులపై అవగాహన

ఎన్.ఎ.డి.జంక్షన్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 52వ వార్డు మర్రిపాలెం రైతుబజారులో సోమవారం మలేరియా విభాగం ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధుల పట్ల భద్రం ఫౌండేషన్ కళాకారులు ప్రదర్శించిన వీధి నాటకం ప్రజలను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఒక కళాకారుడు దోమ వేషధారణలో ఉండి వాటి వల్ల జరిగే పరిణామాలను వివరించారు. దోమల వృద్ధికి నీటి నిల్వలే ప్రధాన కారణమని, వాటిని నియంత్రించడానికి ప్రతి శుక్రవారం 'డ్రైడే' పాటించాలని వివరించారు. ఇదే విధంగా జాకీర్ హుస్సేన్ నగర్, ఎన్ఏడీ కొత్తరోడ్డులోని ఈ ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో బయాలజిస్టులు సాంబమూర్తి, ప్రసాద్ రెడ్డి, మలేరియా ఇన్‌స్పెక్టర్ ఎన్.శ్రీనివాసరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

మల్కాపురం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఇంటక్ ఆధ్వర్యంలో షిప్‌యార్డు కాలనీలోని ప్రజలకు సంస్థ జనరల్ మేనేజర్ మహాపాత్ర, డీజీఎం (సెక్యూరిటీ) సుశీల కుమార్, గుర్తింపు యూనియన్ ప్రధాన కార్యదర్శి పైలా శ్రీరామ్మూర్తి సోమవారం పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా అందరూ మట్టి విగ్రహాలను పూజించాలని అన్నారు.

నాయుడుతోటలో...

వేపగుంట, (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణలో భాగంగా 94వ వార్డు నాయుడుతోట కృష్ణానగర్‌లో కాలనీ వాసులకు ఐక్యత సేవా సంఘం సుమారు 1000 మట్టి గణపతి విగ్రహాలను సోమవారం పంపిణీ చేసింది. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

డబుల్ ఇంజన్ సర్కార్‌తో అభివృద్ధి

- అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్



సభలో మాట్లాడుతున్న అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్, వేదిపై విశాఖ ఎంపీ భరత్, తదితర నాయకులు

పెందుర్తి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): డబుల్ ఇంజన్ సర్కార్‌తో రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతోందని అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ అన్నారు. టీడీపీ ఇన్‌చార్జి గండి బాబ్జీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన స్త్రీశక్తి పథకం విజయోత్సవ ర్యాలీలో ఆయన మాట్లాడుతూ మోదీ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ద్వయంతో ఆంధ్రప్రదేశ్ సుభిక్షంగా ఉందన్నారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పిస్తున్న బిల్లుకు ఎన్‌డీఏ సర్కార్ చట్టబద్ధత కల్పించిందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం విప్లవాత్మకమైన నిర్ణయమని పేర్కొన్నారు. ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ స్త్రీశక్తి పథకం ద్వారా మహిళలకు ఆర్థిక భరోసా, భద్రత కల్పించామన్నారు. రాష్ట్రంలో ఉన్న మహిళలు, పురుషులు పనిచేస్తేనే ఆర్థికాభివృద్ధి సాధించవచ్చన్నారు. మేయర్ పీలా మాట్లాడుతూ టీడీపీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు మహిళలకు ఆస్తిలో వాటా కల్పిస్తే, చంద్రబాబు మహిళలకు ఆర్థిక సాధికారత కల్పించారన్నా రు. గండి బాబ్జీ మాట్లాడుతూ ఇంటిని చక్కది ద్దే మహిళకు పాలనా దక్షత కల్పించామన్నారు. పలువురు కార్పొరేటర్లు మాట్లాడారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సేనపతి వసంత, ముమ్మన దేవుడు, తదితరులు పాల్గొన్నారు

పీజీఆర్‌ఎస్‌లో 17 ఫిర్యాదులు స్వీకరణ

వేపగుంట ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): వేపగుంట జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 17 ఫిర్యాదులు అందాయి. వీటిలో ముఖ్యంగా 92వ వార్డు వెంకటాపురంలో స్పీడ్ బ్రేకర్లు వేయాలని, గోపాలపట్నం హైస్కూల్ ఎదురుగా అక్రమ నిర్మాణాలను నిలిపివేయాలని, 93వ వార్డులో కృష్ణానగర్ రోడ్డు ఆక్రమించి చేపడుతున్న నిర్మాణానికి ప్లాన్ మంజూరు చేయవద్దని, 94వ వార్డు చైతన్యనగర్‌లో మంచి నీటి సదుపాయం కల్పించాలని, ఆర్టీసీ లేఅవుట్‌లో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని, 96వ వార్డు పెందుర్తి ఏరియాలో అక్రమ నిర్మాణాన్ని అడ్డుకోవాలని, 98వ వార్డు సింహపురికాలనీలోని పైపులైన్ లీకేజీ సమస్యను పరిష్కరించాలని తదితర ఫిర్యాదులు అందాయి. వీటిని సంబంధిత శాఖాధిపతులకు పంపిస్తామని జడ్సీ కే.హైమావతి తెలిపారు.

గాజువాకలో 13..

గాజువాక: జీవీఎంసీ గాజువాక జోనల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి 13 వినతులు అందాయి. భానోజీతోట ప్రాంతంలో రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు అర్జీ అందజేశారు. అలాగే వీధి లైట్లు వేయాలని, రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని, కుక్కల బెడద నివారించాలంటూ కోరుతూ ఆయా ప్రాంతాల ప్రజలు, ప్రజా సంఘాల ప్రతినిధులు వినతులు సమర్పించారు. జోనల్ కమిషనర్ శేషాద్రి వినతులను స్వీకరించి వాటిని త్వరితంగా పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు.

మొక్కల రక్షణ మన బాధ్యత

ఎన్.ఎ.డి.జంక్షన్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటడమే కాకుండా వాటి రక్షణను బాధ్యతగా తీసుకోవాలని మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అన్నారు. 52వ వార్డు పరిధిలోని మర్రిపాలెం ఉడా లేఅవుట్ మల్లికార్జున స్వామి ఆయలం వద్ద స్థానిక అసోసియేషన్ ఆధ్వర్య ంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమం లో ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో మొక్కలు వేగంగా పెరిగే అవకాశం ఉన్నదని అన్నారు. అనంతరం మారేడు, మామిడి, వేప, రావి, జామ, కొబ్బరి మొక్కలను నాటా రు. వీటి వల్ల పర్యావరణానికి ఎంతో మేలు కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో దాదా పు 300 మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

సెయింట్ ఆన్స్ కళాశాలలో సైన్స్ ఎగ్జిబిషన్

మల్కాపురం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక సెయింట్ ఆన్స్ మహిళ కళాశాలలో సోమవారం పలు చైతన్య కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గణిత శాస్త్ర విద్యార్థులు ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసి తమ ప్రతిభను చాటారు. రసాయన శాస్త్ర విద్యార్థులు నీటి వనరుల పొదుపు, పర్యావరణ పరిరక్షణపై ఇంటింటి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని సంప్రదాయ దుస్తుల పోటీలను తెలుగు విభాగం నిర్వహించింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ ప్రేమకుమారి, జాతీయ సేవా పథకం జిల్లా నోడల్ అధికారి ఈపీఎస్ భాగ్యలక్ష్మి, సీనియర్ ప్రోగ్రామ్ అధికారి వై.అనసూయాదేవి విద్యార్థులను అభినందించారు.



స్మార్ట్ రేషన్ కార్డులతో వినియోగదారులు. చిత్రంలో గణబాబు, తదితరులు

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

మల్కాపురం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ రేషన్ కార్డుల వల్ల వినియోదగారులకు మోసం జరగదని రాష్ట్ర ప్రభుత్వ విప్, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు అన్నారు. 59వ వార్డు కొత్తనక్కవానిపాలెంలో స్మార్ట్ రేషన్ కార్డులను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం రేషన్ పంపిణీలో జరుగుతున్న మోసాలను దృష్టిలో పెట్టుకుని స్మార్ట్ రేషన్ కార్డులను ప్రభుత్వం ప్రవేశపెట్టిందని తెలిపారు. స్మార్ట్ రేషన్ కార్డుపై ఉన్న క్యూఆర్ కోడ్ ద్వారా కుటుంబ సభ్యుల వివరాలు తెలుసుకోవచ్చని, ఏటీఎం కార్డు తరహాలో ప్రభుత్వ చిహ్నంతో కుటుంబ పెద్ద ఫొటో స్మార్ట్ రేషన్ కార్డుపై పొందుపరిచారని అన్నారు. ఈ కార్యక్రమంలో ములగాడ మండల తహశీల్దార్ రమేశ్, సివిల్ సప్లయ్ అధికారి కృష్ణ, జిల్లా టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు నక్కా లక్ష్మణరావు, వార్డు కార్పొరేటర్ పుర్రె పూర్ణసురేశ్, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పారదర్శక మెగా డీఎస్సీ నిర్వాహణ కూటమికే సాధ్యం

- పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు

గోపాలపట్నం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పారదర్శకంగా మెగా డీఎస్సీ నిర్వహించిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. ఆయన నివాసంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికల సమయంలో నారా లోకేశ్ నిర్వహించిన యువగళం పాదయాత్రలో మెగా డీఎస్సీ నిర్వహిస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చారని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఉపాధ్యాయులు లేకుండా భవనాలకు రంగులు వేసి 'నాడు-నేడు' పేరుతో ప్రచారం చేసుకున్నారని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వం ఉపాధ్యాయులపై ఎన్నో విధాలుగా కక్షసాధింపులకు పాల్పడిందని గుర్తు చేశారు. ఈ ఏడాది నిర్వహించిన మెగా డీఎస్సీతో పాఠశాలల్లో నిష్ణాతులైన అధ్యాపకులను నియమించబోతున్నారని అన్నారు. విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకురావడానికి విద్యాశాఖ మంత్రి నారాలోకేశ్ చేస్తున్న కృషితో రాష్ట్రం ముందంజలో ఉంటుందని ఆకాంక్షించారు.

కోరమాండల్ కంపెనీ సేవలు అభినందనీయం

- ఎమ్మెల్యే పి.గణబాబు

మల్కాపురం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా కోరమాండల్ అనేక సేవా కార్యక్రమాలను చేపడుతుండడం అభినందనీయమని ఎమ్మెల్యే గణబాబు అన్నారు. 58వ వార్డు పిలకవానిపాలెంలో సామాజిక భవనాన్ని, శ్రీరామన్‌నగర్‌లో ఓపెన్ జిమ్‌లను కోరమాండల్ సంస్థ ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణబాబు సోమవారం వీటిని ప్రారంభించారు. పిలకవానిపాలెంలో నిర్మించిన సామాజిక భవనాన్ని స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని, ఓపెన్ జిమ్ ద్వారా వ్యాయామాలు చేసుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. అంతేకాకుండా నూతనంగా ప్రారంభించిన ఆర్‌వో ప్లాంట్‌ను పరిసర ప్రాంతాల ప్రజలందరూ ఉపయోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ మౌలిక సదుపాయాల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ అంగ దుర్గాప్రశాంతి, కోరమాండల్ ఎరువుల కర్మాగారం వైస్ ప్రెసిడెంట్ ఎం.జ్ఞానసుందరం తదితరలు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన

పెందుర్తి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): సాయి హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేషస్పందన లభించింది. సాయిరామ్ మెడికల్స్ సహకారంతో ఏర్పాటు చేసి ఈ శిబిరంలో 40 మంది యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. అనంతరం ట్రాఫిక్ ఎస్ఐ నరసింగరాజు రక్తదాతలకు ధ్రువీకరణపత్రాలను అందజేశారు. ఈకార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు సిరిమల్ల గణేశ్, పెంటకోట భాను, వినయ్, తేజ తదితరులు పాల్గొన్నారు.

వలకు చిక్కిన నేవీ పారాచూట్


మత్స్యకారుల వలకు చిక్కిన నేవీ పారాచూట్

బీచ్ రోడ్డు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పెద్ద చేప పడిందని సంబరపడిన మత్స్యకారులకు ఊహించని పరిస్థితి ఎదురైంది. వలలో చిక్కింది నౌకాదళానికి చెందిన పారాచూట్ అని తెలిసి తెల్లబోయారు. సోమవారం వేటకు బయల్దేరి సుమారు 10 కి.మీ.ల దూరం వెళ్లాక వల బరువుగా మారడంతో భారీ చేప పడిందని ఆశ పడ్డారు. కష్టపడి లాగి చూడగా అందులో ఓ వింత వస్తువు కనిపించింది. బయటకు తీసే ప్రయత్నంలో వల చిరిగిపోయింది. ఆ వస్తువు ఏమి టో అర్థం కాక, నేరుగా మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ వద్దకు తీసుకెళ్లారు. ఆయ నకు కూడా అంతు పట్టకపోవడంతో సమాచారం నేవీ అధికారులకు చేరవేశారు. వారు హుటాహుటిన ఫిషింగ్ హార్బర్‌కు చేరుకుని పారాచూట్‌గా చెప్పి స్వాధీనం చేసుకున్నారు. మత్స్యకారులకు తమ వంతు బహుమతి అందజేస్తామన్నారు.

పారదర్శకంగా మెగా డీఎస్సీ

- టీడీపీ పార్లమెంటరీ అధ్యక్షుడు గండి బాబ్జీ


మాట్లాడుతున్న గండి బాబ్జీ

విశాఖపట్నం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): గత ఏడాది ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు మెగా డీఎస్సీ నిర్వహించి ముఖ్యమంత్రి మాట నిలబెట్టుకున్నారని విశాఖ పార్లమెంటు అధ్యక్షుడు గండి బాబ్జీ అన్నారు. పార్టీ కార్యాలయంలో సోమవారం మీడియాతో మాట్లాడుతూ డీఎస్సీ ద్వారా 16,500 మంది ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎంపికయ్యారని, రెండురోజుల్లో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తి చేస్తారన్నారు. వైసీపీ ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ ప్రకటించి మాట తప్పిందని ఎద్దేవాచేశారు. జగన్ దిగిపోయే ముందు డీఎస్సీ ప్రకటించి మోసం చేశారన్నారు. విద్యా వ్యవస్థను జగన్ నాశనంచేస్తే మంత్రి లోకేశ్ గాడిన పెడుతున్నారని ప్రశంసించారు. డీఎస్సీ నియామకాలపై వైసీపీ నాయకులు కేసులు వేసి అడ్డుపడాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఉపాధ్యాయులకు వైన్ షాపుల వద్ద డ్యూటీలు వేసే సంస్కృతి జగన్‌దని విమర్శించారు. ఒక ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు ఇచ్చిన ప్రభుత్వంగా త్వరలో ప్రజలకు ముందుకు వస్తామన్నారు. నాడు-నేడు పథకంలో అక్రమాలపై ప్రభుత్వం విచారణ చేస్తోందన్నారు. తల్లికి వందనం పెండింగ్ బిల్లులు విడుదలయ్యాయన్నారు.

కలెక్టరేట్‌లో మట్టి వినాయక ప్రతిమల పంపిణీ


మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న సందీప్, చిత్రంలో కలెక్టర్, జేసీ, తదితరులు

విశాఖపట్నం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం మట్టి వినాయక విగ్రహాలను కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, కాలుష్యనియంత్రణమండలి సభ్యుడు పంచకర్ల సందీప్ పంపిణీ చేశారు. అధికారులు, ఉద్యోగులు, ఇతరులకు ప్రతిమలు అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఆర్వో సీహెచ్ సత్తిబాబు, కాలుష్య నియంత్రణమండలి ఈఈ పి.ముకుందరావు, అధికారులు పాల్గొన్నారు.

అలలతో...ఆటలొద్దు!

- సముద్ర స్నానాల పట్ల అప్రమత్తం
- కెరటాల తాకిడికి ఎందరో బలి
- హెచ్చరికలు పట్టించుకోకపోవడమే కారణం
- ప్రమాదంలో చిక్కుకున్న వారిని రక్షిస్తున్న లైఫ్ గార్డులు


తీరంలో ఆటలు ఆడుతున్న దృశ్యం

బీచ్ రోడ్డు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఎగసిపడే అలలను చూస్తూ... తీరంలో కేరింతలు కొడుతూ సముద్ర స్నానం చేయడం... ఆటలాడడం మధురానుభూతి. ఆహ్లాదకర వాతావరణంలో ఎంతసేపు గడిపినా తనివి తీరదు. అయితే స్నానానికి దిగి కేరింతల మధ్య కాస్త లోపలకు వెళ్లిపోతే... ప్రాణాలు గాలిలో కలిసిపోయినట్టే. కల్లోల కడలి కెరటాల్లో చిక్కుకున్నవారికి మరో జన్మను ప్రసాదిస్తున్నారు లైఫ్‌గార్డులు. ఆర్‌కే బీచ్‌లో కనిపించే ఈ గజ ఈతగాళ్లు అక్కడ స్నానాలకు దిగే సందర్శకులకు ముందుగానే హెచ్చరికలు జారీచేస్తున్నారు. కెరటాలతో ముందుకు వెళ్తున్న వారిలో కొంతమంది ప్రాణాపాయ స్థితికి చేరుకుంటారు. ఇలాంటి విపత్కర పరిస్థితిని గుర్తించి వారిని క్షేమంగా ఒడ్డుకు చేర్చేందుకు సుమారు 50 మంది లైఫ్ గార్డులు తీరంలో సేవలందిస్తున్నారు.


బాధితులను ఒడ్డుకు చేరుస్తున్న లైఫ్ గార్డులు (ఫైల్ ఫొటో)

సువిశాల సాగరతీరం, అందమైన బీచ్‌లు నగరం సొంతం. మిగిలిన పర్యాటక ప్రదేశాలను చూసినా, సందర్శకులు తీరానికి చేరాలని, అక్కడ అలలతో ఆటలాడాలని ఉవ్విళ్లూరుతుంటారు. ఈ క్రమంలో కొంతమంది స్నానాలకు దిగి, ప్రమాదాల్లో చిక్కుకుంటుండగా, మరికొంతమంది మొండిగా అలల వెనుక పరుగులు పెడుతుంటారు. ఈ క్రమంలో ప్రాణాల మీదకు తెచ్చుకుంటుంటారు. బీచ్‌లోని అలలతో గడపడం సరదాయే అయినప్పటికీ పోలీసుల సూచనలు పాటించడం, లోతు ఎక్కువగా ఉన్న ప్రాంతాలకు వెళ్లకపోవడమే శ్రేయస్కరం.

తస్మాత్ జాగ్రత్త

- సముద్రంలో స్నానాలకు దిగే సందర్శకులు పోలీసులు, గజ ఈతగాళ్ల సూచనలు పాటించాలి.
- మద్యం సేవించి సముద్రంలో దిగడం ప్రమాదకరం
- సురక్షిత తీరంలో సముద్ర స్నానాలు చేయాలి
- జన సంచారం లేని ప్రాంతంవైపు వెళ్లకూడదు
- తుఫాన్, సునామీ తదితర హెచ్చరికల సమయంలో సముద్రం వైపు వెళ్లకూడదు

నిర్లక్ష్యమే కారణం

సముద్ర స్నానాలకు దిగేవారిలో కొంతమంది యువత మద్యం సేవించి అలల్లో ఆడుతుంటారు. మత్తులో లోపలకు వెళ్తుంటారు. ఈ క్రమంలో అడుగు తీసి అడుగు వేసేలోగా ఒక్కోచోట సముద్రం పది అడుగుల కంటే ఎక్కువ లోతు ఉంటుంది. అందులో పడిపోయి ప్రాణాలు పోగొట్టుకుంటారు. మరికొంతమంది పెద్ద అలల తాకిడికి బలవుతుండగా, ఇంకొందరు సుడుల్లో చిక్కుకుంటారు. తీరంలో మెరైన్ పోలీసులు, గజ ఈతగాళ్ల హెచ్చరికలకు విలువనిస్తే ప్రమాదాలకు ఆస్కారమే ఉండదు.

రక్షిస్తున్న లైఫ్ గార్డులు



తీరంలో మూడేళ్లుగా లైఫ్ గార్డులు సేవలందిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో సంద్రంలో చాలా లోపలకు వెళ్లిన వారి ప్రాణాలు కాపాడారు. సుమారు 50 మంది గజ ఈతగాళ్లు తీరంలో పని చేస్తున్నారు. మెరైన్, త్రీటౌన్ పోలీసులు నిత్యం సందర్శకులను కాపాడాలనే ఉద్దేశంతో గస్తీ నిర్వహిస్తున్నారు.

\- లక్ష్మణరావు, జేడీ, మత్స్య శాఖ

నా సహనాన్ని పరీక్షించకండి

- అర్జీల పరిష్కారంలో అశ్రద్ధపై కలెక్టర్ సీరియస్
- పీజీఆర్ఎస్‌లో 329 వినతుల స్వీకరణ


అర్జీని పరిశీలిస్తున్న కలెక్టర్ ఎంఎన్‌హరేంధిర ప్రసాద్, చిత్రంలో జేసీ మయూర్ అశోక్, ఇన్‌చార్జి డీఆర్‌వో సత్తిబాబు

మహారాణిపేట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే అర్జీలపై అశ్రద్ధ చూపితే కఠినచర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ అధికారులను హెచ్చరించారు. పరిష్కార విధానంలో మార్పు రావాలని, సహనాన్ని పరీక్షించవద్దన్నారు. కలెక్టరేట్‌లో జేసీ మయూర్‌అశోక్, ఇన్‌చార్జి డీఆర్వో సత్తిబాబు, ఇతర జిల్లా అధికారులతో కలిసి సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ 329 వినతులు స్వీకరించారు. వీటిలో రెవెన్యూ 141, జీవీఎంసీ 72, పోలీసు 17, ఇతర విభాగాలకు 99 ఉన్నాయి. అనంతరం అధికారులతో సమీక్షించారు. గతంలో అందిన అర్జీలపై తీసుకున్న చర్యలేమిటని ప్రశ్నించి వివరణ కోరారు. కాల్ సెంటర్ నుంచి అందిన సమాచారం (ఫీడ్ బ్యాక్)పైనా బేరీజు వేసుకుని విశ్లేషించారు. తీసుకోవాల్సిన చర్యలపై మార్గదర్శకాలు జారీచేశారు. అర్జీల పరిష్కారంపై సంబంధిత అధికారులు, సిబ్బంది వ్యవహరించే తీరు మెరుగుపడాలని సూచించారు. ప్రజలు సంతృప్తి చెందేలా సత్వర, శాశ్వత పరిష్కారం చూపాలని ఆదేశించారు. అవసరమైతే క్షేత్రస్థాయికి వెళ్లి అర్జీదారులతో మాట్లాడి సమస్య పరిష్కరించాలన్నారు. వివిధ శాఖల అధికారులతోపాటు వర్చువల్‌గా తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి డిమాండ్

ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ఆందోళన నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న కరవు భత్యం, పీఎఫ్, ఏపీజీఎల్ఐ, ఆర్జిత సేవల నగదు, పీఆర్‌సీ బకాయిలు చెల్లించాలని కోరారు. ఉద్యోగ విరమణ చేసిన వారి గ్రాట్యుటీ చెల్లించాలని డిమాండ్ చేశారు. 12వ పీఆర్‌సీ కమిషన్‌ను నియమించి మధ్యంతర భృతి ఇవ్వాలని, ఎయిడెడ్ పాఠశాలలు, ఆర్టీసీ పెన్షనర్లకు ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్‌ను వర్తింపజేయాలని కోరారు.

అర్హులందరికీ పెన్షన్లు ఇవ్వాలి

అర్హులైన దివ్యాంగులకు పెన్షన్లు పునరుద్ధరించాలని దివ్యాంగులు కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. జేఏసీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వం రీవెరిఫికేష న్ పేరుతో పెన్షన్లు తొలగించడం దారుణమన్నారు. సద రం సర్టిఫికెట్లు నకిలీవని ప్రచారం చేస్తూ పెన్షన్లు నిలిపివేస్తున్నారని ఆరోపించారు.

సూపర్ బజార్ పర్సన్ ఇన్‌చార్జికి పొడిగింపు

విశాఖపట్నం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం కోపరేటివ్ సెంట్రల్ స్టోర్స్ (సూపర్ బజారు) పర్సన్ ఇన్‌చార్జిగా జాయింట్ కలెక్టర్ పదవీ కాలాన్ని మరో ఆరు నెలలు పొడిగిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు ఇచ్చింది. ఆయనకు సెప్టెంబరు 26వ తేదీ వరకు పదవీ కాలం ఉంది. అయితే సూపర్ బజారుకు ఎన్నికలు నిర్వహించి పాలకవర్గం ఏర్పాటు చేయాలని ఉత్తర్వులు పేర్కొన్నారు. ఆరు నెలల కంటే ముందే పాలకవర్గం ఏర్పాటైతే పర్సన్ ఇన్‌చార్జి బాధ్యతలు ఆపై ఉండవని అందులో పేర్కొన్నారు.

విద్యార్థిని పట్ల లెక్చరర్ అసభ్య ప్రవర్తన

- పరవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘటన
- పోక్సో చట్టం కింద కేసు నమోదు


లెక్చరర్ శ్రీధర్

పరవాడ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థిని పట్ల లెక్చరర్ అసభ్యంగా ప్రవర్తించిన ఘట న అనకాపల్లి జిల్లా పరవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చోటు చేసుకుంది. సీఐ ఆర్. మల్లికార్జునరావు తెలిపిన వివరాలిలా ఉన్నా యి. శనివారం కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ముగ్గురు విద్యార్థినులు ఫంక్షన్‌కు వెళ్లేందుకు కెమిస్ట్రీ లెక్చరర్ గుత్త ల శ్రీధర్‌ను పర్మిషన్ అడిగారు. ఆయన కుదరదని చెప్పడంతో క్లాసులకు వెళ్లిపోయారు. కొంతసేపటి తరువాత ఒకరిని శ్రీధర్ ల్యాబ్‌కు పిలిపించుకొని అసభ్యంగా ప్రవర్తించారు. ఆమె భయంతో బయటకు పరుగులు తీసింది. ఈ విషయాన్ని తల్లికి చెప్పింది. తల్లి, సోదరుడు సహాయంతో ఆదివారం పరవాడ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు లెక్చరర్ శ్రీధర్‌ను ఆదివారం రాత్రి అరెస్టు చేశారు. బాధితురాలు మైనర్ కావడంతో నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ సోమవారం తెలిపారు. లెక్చరర్ శ్రీధర్ రెండేళ్ల క్రితం పరవాడ బదిలీపై వచ్చారు. విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించేవారనే ఆరోపణలున్నాయి. విద్యార్థినులు ధైర్యం చేసి ప్రిన్సిపాల్‌కు చెప్పలేకపోయారు.

అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తాం

- పార్టీశ్రేణుల మనోగతం తెలుసుకుంటాం
- జనసేనాని సభపై అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ


మునిసిపల్ స్టేడియంలో సభా ఏర్పాట్లను పరిశీలిస్తున్న అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల, నేతలు

మహారాణిపేట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో జనసైనికులు, వీరమహిళల అభిప్రాయాలు తెలుసుకుని ప్రజలకు మరింత చేరువయ్యేలా పార్టీ పటిష్టతకు కృషి చేస్తామని అనకాపల్లి ఎమ్మెల్యే, పార్టీ సమన్వయ కమిటీ ఛైర్మన్ కొణతాల రామకృష్ణ చెప్పారు. ఈ నెల 30న జనసేన పార్టీ నిర్వహించనున్న క్రియాశీల కార్యక ర్తల సమావేశం ఏర్పాట్లపై ఇందిరా మునిసిపల్ స్టేడియం ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో ఆయన మాట్లాడారు. అన్ని అనుమ తులు తీసుకుని భూమిపూజ చేసి సభ ఏర్పాట్లు ప్రారంభించామని, వర్షం వచ్చినా ఇబ్బందులు లేకుండా జర్మన్ టెక్నాలజీతో స్టేజ్ పరదాలను (షెడ్‌లను) నిర్మిస్తున్నామన్నారు. బహిరంగ సభకు రెండు తెలుగు రాష్ట్రాలతోపాటువిదేశాల నుంచి 14,650 మంది హాజరవుతారన్నారు.మూడు ప్రవేశ గేట్లలో వీర మహిళలకు ఒకటి, వీఐపీలకుఒకటి, మిగిలిన వారికి ఇంకో గేటు ద్వారా ప్రశేశం కల్పిస్తామన్నారు. మధ్యాహ్నం ఒంటి గంటకు సభ ప్రారంభమవుతుందని సాయంత్రం ఆరు గంటలకు అధినేత పవన్ కల్యాణ్ ప్రసంగం ఉంటుందన్నారు.సభలో కార్యకర్తల అభిప్రాయాలు, సూచనలు తెలుసుకోవడమే కాకుండా, పార్టీ విధి విధానాలు ప్రజల్లోకి తీసుకెళతామన్నారు. కూటమి పార్టీలతో కలసి ఎలా పని చేయాలి? ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతస్థాయిలో ఎలా తీసుకువెళ్లాలో దిశా నిర్దేశం చేస్తారన్నారు. ఈ సమావేశంలో కోన తాతారావు ప్రియమణి తదితరులు పాల్గొన్నారు.

క్రైం... crime news

ములగాడలో దారుణ హత్య

- మతిస్థిమితం లేని వ్యక్తిపై విచక్షణా రహితంగా దాడి
- రౌడీషీటర్, మరో ఇద్దరిని అరెస్టు చేసిన పోలీసులు


హత్యకు గురైన రాజు

మల్కాపురం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం లేని వ్యక్తిపై ఓ రౌడీషీటర్‌తో పాటు మరో ఇద్దరు యువకులు విచక్షణా రహితంగా దాడి చేసి హత్యచేశారు. ఈ సంఘటన స్థానికంగా సంచలనం కలిగించింది. వివరాలిలా ఉన్నాయి... గ్రేటర్ 63వ వార్డు జైఆంధ్ర కాలనీకి చెందిన ఇడిమిశెట్టి రాజు (49) మతిస్థిమితం లేక తిరుగుతుంటాడు. శనివారం అర్ధరాత్రి మానస డిఫెన్స్ అకాడమీ సంస్థ సమీపంలో రౌడీషీటర్ ధర్మరాజు, దిన్నాల హేమంత్‌కుమార్, గురుబిల్లి తరుణ్‌కుమార్ మద్యం సేవిస్తున్నారు. అదే సమయంలో అటువైపు వెళ్తున్న ఇడిమిశెట్టి రాజు వారితో వాగ్వాదానికి దిగాడు. దీంతో అతడిపై దాడిచేయడంతో రాజు అక్కడికక్కడే మృతిచెందాడు. అనంతరం నిందితులు పారిపోయారు. రోడ్డుపై మృతదేహం కనిపించడంతో స్థానికులు గాజువాక పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహంపై గాయాలు ఉండడంతో పోలీసులు హత్యగా గుర్తించారు. సీసీటీవీ ఫుటేజ్ పరిశీలించి, దాడిచేసిన ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. హతుడి బంధువులకు సమాచారం ఇచ్చారు. సీఐ పార్థసారధి పర్యవేక్షణలో ఎస్ఐ రవి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య


వెంకటేష్ (ఫైల్)

భీమునిపట్నం (రూరల్) ఆగస్టు 25 (ఆంధ్ర జ్యోతి): అప్పుల బాధతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండలంలోని రేఖవానిపాలెంలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన కేఆర్‌టీ వెంకటేష్ (35) అప్పులు చేశాడు. తీర్చే మార్గం లేక మానసిక ఒత్తిడికి గురయ్యాడు. అప్పు ఇచ్చిన వారంతా ఇంటికి వచ్చి దుర్భాషలాడుతుండడంతో సోమవారం పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యులు కేజీహెచ్‌కు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని సీఐ బి.తిరుమలరావు తెలిపారు.

జీవిత ఖైదీ ఆత్మహత్యా యత్నం

ఆరిలోవ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): విశాఖ కేంద్రకారాగారంలో జీవిత శిక్ష అనుభవిస్తున్న నాగమల్లేశ్వరరావు సోమవారం బ్యారెక్‌లో ఆత్మహత్యా యత్నం చేశాడు. ఇన్‌చార్జి సూపరింటెండెంట్ సాయి ప్రవీణ్ తెలిపిన వివరాల మేరకు.. హత్య కేసులో ముద్దాయి నాగమల్లేశ్వరరావు 2015లో జైలుకు వచ్చాడు.. ఇక్కడ స్థలాభావంతో అతడిని రాజమండ్రి సెంట్రల్‌జైలుకు పంపారు. విశాఖ కోర్టులో కేసులున్నందున ఇటీవల తిరిగి తీసుకువచ్చారు. వచ్చినప్పటి నుంచి తనను ఆస్పత్రికి తరలించాలని, లేదంటే చనిపోతానని సిబ్బందిని బెదిరించాడు. ఈ నేపథ్యంలో సోమవారం బ్యారెక్‌లో తువ్వాలు మెడకు చుట్టుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. ఖైదీలు, వార్డర్లు అడ్డుకోగా చంపేస్తానని బెదిరించాడు. వెంటనే ఆస్పత్రికి తరలించగా అక్కడ వైద్యులను దూషించాడు. కాగా ఇతడికి అనేక నేరాలతో సంబంధం ఉందని, డబ్బున్న వృద్ధులతో సఖ్యతగా మెలిగి, వారికి మత్తుమందు, సైనైడ్ ఇచ్చి చంపేసి, డబ్బుతో పరారయ్యేవాడని సూపరింటెండెంట్ తెలిపారు. మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ కుటుంబసభ్యుల కిడ్నాప్ కేసులో జైలులో ఉన్న నిందితులు హేమంత్, రాజేష్‌లకు సెల్‌ఫోన్లను చేరవేసింది కూడా ఇతడేనన్నారు.

మంగళసూత్రం చోరీ

ఆరిలోవ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మహిళ మెడలోని రెండున్నర తులాల మంగళసూత్రాన్ని గుర్తు తెలియని వ్యక్తులు లాక్కుని ఉడాయించారని ఆరిలోవ సీఐ మల్లేశ్వరరావు తెలిపారు. ఎం.కృష్ణవేణి (50) పాతడెయిరీ ఫారం నుంచి విమ్స్ వైపు ప్రభాత నడకలో ఉండగా ముగ్గురు బైక్‌పై వచ్చి ఆమె మెడలోని మంగళ సూత్రాన్ని తెంపి పారిపోయారన్నారు. దీనిపై ఆమె ఫిర్యాదు చేయడంతో క్రైం ఎస్ఐ హరికృష్ణ సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారని, దొంగల కోసం గాలిస్తున్నామని సీఐ తెలిపారు.

లారీ ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

మధురవాడ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొనడంతో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన సోమవారం మధురవాడ ఎత్తువంతెనపై జరిగింది. మృతుడి వయసు సుమారు 45 సంవత్సరాలుంటుంది. పసుపు రంగు ఫుల్‌హ్యాండ్స్ షర్టు, నిక్కరు ధరించి ఉన్నాడని పీఎంపాలెం పోలీసులు తెలిపారు. మృతుడి వివరాలు తెలిస్తే సమాచారం ఇవ్వాలని సీఐ బాలకృష్ణ కోరారు.

యువకుడి ఆత్మహత్య

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): భార్యతో కలహాల కారణంగా ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొత్త వెంకోజీపాలేనికి చెందిన బోర భువనేష్(24)కు నాలుగేళ్ల క్రితం పెళ్లైంది. ఏడాది తర్వాత దంపతుల మధ్య గొడవలు మొదలయ్యాయి. దీంతో భార్య శిరీష పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో తన బావ మేడిశెట్టి కుమార్‌కు ఫోన్‌చేసి, ఆత్మహత్య చేసుకుంటున్నట్టు చెప్పాడు. అతడు మరో వ్యక్తిని పంపగా అప్పటికే ఉరివేసుకున్నాడు.అక్క లయ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.